www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 10-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 305 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి ఉ.8:24 తదుపరి అష్టమి, నక్షత్రం: హస్త మ.3:40 తదుపరి చిత్ర, వర్జ్యం: రా.12:30-2:16, దుర్ముహూర్తం: ఉ.6:51-8:19, అమృతఘడియలు: ఉ.9:10-10:54, రాహుకాలం: ఉ.9:00-10:30, సూర్యోదయం: 6:51, సూర్యాస్తమయం: 5:53 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

'రద్దు'పై రచ్చకు రెడీ!

Bharathi CEMENT

భారతీ సిమెంట్స్ పారిపోతోందంటూ ప్రకటన

జగన్ ముందస్తు బ్లాక్ మెయిలింగ్‌లో భాగం

కడప జిల్లాలో 752 ఎకరాల సున్నపురాయి లీజు

కేంద్ర చట్టాలు, హైకోర్టు తీర్పుల ఉల్లంఘన

తీర్పును వక్రీకరిస్తూ ఎన్నికల ముందు పునరుద్ధరణ

భారతీ సిమెంట్స్‌కు ప్రభుత్వం నోటీసులు జారీ

జవాబివ్వలేక మౌనంగా ఉన్న యాజమాన్యం

అందులో భాగమే 'పారిపోతున్నారు' ప్రకటన

12



రైతుకు భూమి అనేది ఆస్తి మాత్రమే కాదు.. జీవనాధారం. కుటుంబానికి భద్రత. భవిష్యత్‌కు నమ్మకం. అది ఎకరా కావచ్చు. అర ఎకరా కావచ్చు. ఐదు సెంట్లు కావచ్చు. కనీసం ఇంటి జాగా కావచ్చు.

రాజధానిపై కొత్తనాటకాలు చేస్తున్నారు. రాజ్యాంగంలో రాజధాని అనే మాటే లేదట. మూడుముక్కలాట అయిపోయింది. రాక్షసుల మాదిరిగా అబద్ధాలు చెబుతున్నారు. - చంద్రబాబు



రాయవరంలో రైతు కంటిపూడి సాయిబాబాకు చెందిన భూమి సర్వే వివరాలను పొలానికి వెళ్లి రెవెన్యూ సిబ్బంది నుంచి తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

తప్పులు తేల్చేస్తాం!

చంద్రబాబు పొలంబాట.. రీసర్వే, సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఉన్నతాధికారులను పక్కనపెట్టి..
వీఆర్వో, సర్వేయర్లతో నడిచిన సీఎం

రైతు పొలంలోకి వెళ్లి ప్రత్యక్ష పరిశీలన

భిన్నంగా జరిగిన రాయవరం 'గ్రామసభ'

తప్పులు, సమస్యలపై రైతులకు ప్రశ్నలు

ఈ-కేవైసీ అయిన వారంతా సభకు రాలేదేమని ప్రశ్న

లోపం ఎక్కడుందని జేసీపై ఆగ్రహం

తర్వాత మంత్రులు, అధికారులతో సమీక్ష

రీసర్వేలో తప్పులను సహించేదిలేదని అధికారులకు స్పష్టీకరణ

కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

జగన్ హయాంలో జరిగిన భూముల రీసర్వేలో ఘోరమైన తప్పులు జరగడం నిజం! వాటిని నేటికీ సరిదిద్దకపోవడమూ నిజం! జగన్ ఫొటో తొలగించి... రాజముద్రతో ఇస్తున్న కొత్త పాస్ పుస్తకాల్లోనూ తప్పులు దొర్లుతున్నాయి. ఈ లోటుపాట్లపై అధికారులు ప్రభుత్వానికి ఇస్తున్న నివేదికలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకూ పొంతనలేదని 'ఆంధ్రజ్యోతి' పలు కథనాల ద్వారా స్పష్టం చేసింది. ఈ విషయం సీఎం దృష్టికి వచ్చింది. అందుకే... శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో పట్టాదారు పాస్ పుస్తకాలను అందించే కార్యక్రమాన్ని ఆయన పూర్తి భిన్నంగా నిర్వహించారు. ఉన్నతాధికారులు, నేతలను పక్కన పెట్టి.. వీఆర్వో, సర్వేయర్లతో పొలంబాట పట్టారు. అధికారులు, మంత్రులతో సమావేశమై రీసర్వేల్లో తప్పులు సహించేది లేదని హెచ్చరించారు.

ఇక ఎవడూ కబ్జా చేయలేడు!

మీ భూమి-మీ హక్కు.. బ్లాక్ చైన్ టెక్నాలజీతో పాస్ పుస్తకాలు

ఏడాదిలోగా ప్రతి నెలా 2-9 మధ్య పంపిణీ కార్యక్రమం

కూటమి రాకుండా ఉంటే.. మీ భూములు గోవిందా అయ్యేవి

ఆ నరకాసురుడిని మళ్లీ రానివ్వొద్దు

సంక్రాంతికి కోడిపందేలు చూద్దాం

కానీ జూదాలు వద్దు: చంద్రబాబు

తూర్పుగోదావరి రాయవరంలో రైతులకు పాస్‌పుస్తకాలు అందజేత

13

పంచాయితీల కంటే.. పరిష్కారాలకే మొగ్గు

చర్చల ద్వారా సమస్యలకు పూర్తి పరిష్కారం దొరుకుతుంది: రేవంత్



3

పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు సాగిస్తూనే పెండింగ్ సమస్యల పరిష్కారానికి సిద్ధం

ఏపీ ఒక అడుగేస్తే మేం పదడుగులు వేస్తాం

సయోధ్య, పరస్పర సహకారంతో ముందుకెళ్దాం

ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన అనుమతులకు అభ్యంతరం చెప్పొద్దు

నీళ్ల ముసుగులో రాజకీయ లబ్ధి ఆలోచన లేదు

తెలంగాణ పోర్టు కనెక్టివిటీకి ఏపీ సహకరించాలి

అమరావతి అభివృద్ధికి హైదరాబాద్ సహకారమూ కీలకమే: తెలంగాణ సీఎం



కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో థింసా కళాకారులతో కలసి నృత్యం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

వైసీపీ నెత్తినెక్కి డ్యాన్స్ చేస్తోంది


12

తెలిసింది బూతులు తిట్టడం.. కేసులు పెట్టడమే

ఆ పార్టీ విషయంలో గట్టిగా ఉండాలి.. సీఎం చంద్రబాబు ప్రజాస్వామ్యవాది

నియంత్రణ పాటిద్దాం అంటుంటారు.. గత ఐదేళ్లు ప్రజలకు మనశ్శాంతి లేదు

పిఠాపురం వచ్చి గొడవలు పెడితే ఏరేస్తా.. ఎక్కడ శాంతిభద్రతలకు భంగం కలిగినా కలెక్టర్లు, ఎస్పీలు ఉపేక్షించవద్దు.. నాకు, చంద్రబాబుకు అపార అవగాహన ఉంది.. విభేదాలు, అరమరికలు లేవు.. ప్రజలు కూటమికి అండగా లేకపోతే మళ్లీ నియంతృత్వ పోకడలొస్తాయి.. పిఠాపురం సంక్రాంతి సంబరాల్లో పవన్



'టెట్'లో 52% మంది టీచర్లు ఫెయిల్

47.82 శాతం మాత్రమే పాస్

31,886 మందికి 15,239 మంది ఉత్తీర్ణత

12

పాస్ కాని వారికి రెండేళ్ల గడువు

టీటీడీ బోర్డుకు జంగా రాజీనామా

తిరుమలలో భూమి నా హక్కు. దానిని నాకే కేటాయించారు

అయితే ట్రస్టు పేరుతో ఇవ్వాలని అడిగితే బోర్డు ఆమోదించింది

బోర్డు తీర్మానాన్ని సీఎం ఎలా వద్దంటారు?

9

వాస్తవాలు తెలుసుకోకుండా కేటాయింపు రద్దు చేశారు

నా వల్ల ప్రభుత్వానికి ఇబ్బంది రాకూడదనే రాజీనామా: జంగా

బెంగాల్‌లో 'ఐ-ప్యాక్' రచ్చ

టీఎంసీ చీఫ్‌గా వెళ్లా.. ఐ-ప్యాక్ పార్టీకి సలహా సంస్థ

రాజకీయ కక్షతో ఈడీ దాడి: బెంగాల్ సీఎం మమత

మమత, పోలీసులపై సీబీఐతో దర్యాప్తు జరపాలి

కలకత్తా హైకోర్టులో ఈడీ రిట్ పిటిషన్

2

బంగారం చోరీ కేసులో ‘శబరిమల’ ప్రధాన పూజారి అరెస్టు

తిరువనంతపురం, న్యూఢిల్లీ, జనవరి 9: శబరిమల ఆలయంలో బంగారం చోరీ కేసును దర్యాప్తు చేస్తోన్న సిట్ ఆ ఆలయ ప్రధాన పూజారి(తంత్రి) కందరారు రాజీవరును శుక్రవారం అరెస్టు చేసింది. తెల్లవారుజామున ఆయన్ను ప్రశ్నించిన సిట్ అధికారులు అనంతరం మధ్యాహ్నం తమ కార్యాలయానికి తరలించి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావెంకూర్ దేవస్వం బోర్డ్ అధ్యక్షుడు పద్మకుమార్‌లు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ల ఆధారంగా ప్రధాన పూజారిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఉన్నికృష్ణన్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, అతడిని ఆలయానికి తీసుకువచ్చింది కూడా ఆయనేనని అధికారులు తెలుసుకున్నారు.

కళ్లు చెదిరేలా నోట్ల కట్టలు!

▸▸ రూ.9.5 లక్షలు తీసుకుంటూ పట్టుబడిన సీపీఆర్ఐ జేడీ



బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యుత్ పరిశోధనా సంస్థ (సీపీఆర్ఐ) జాయింట్ డైరెక్టర్ చెన్ను రాజారామ్ మోహన్‌రావు బెంగళూరులోని తన కార్యాలయంలో ఓ కంపెనీ ప్రతినిధి నుంచి శుక్రవారం రూ.9.50 లక్షలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన నివాసంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కళ్లు చెదిరేలా రూ.3.59 కోట్ల నగదు, రూ.4 లక్షలకు పైగా విలువైన విదేశీ కరెన్సీ (అమెరికన్, హాంగ్‌కాంగ్, సింగపూర్ డాలర్లు, ఇండోనేషియా రుపియా, మలేషియా రింగెట్, యూరో, యువాన్, స్వీడిష్ క్రోనా, యూఏఈ దిర్హామ్‌లు) వెలుగు చూశాయి. సుధీర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ తయారు చేసిన విద్యుత్ వస్తువులకు అనుకూలంగా టెస్టింగ్ నివేదికను ఇచ్చేందుకు రాజారామ్ లంచం తీసుకున్నారని సీబీఐ తెలిపింది.

అంతరిక్ష కేంద్రంలో మెడికల్ ఎమర్జెన్సీ

▸▸ ఐఎస్ఎస్ నుంచి భూమికి తిరిగి రానున్న వ్యోమగాములు

న్యూఢిల్లీ, జనవరి 9: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్, ఐఎస్ఎస్)లో తొలిసారి మెడికల్ ఎమర్జెన్సీ తలెత్తింది. నాసా.. స్పేస్ఎక్స్ క్రూ-11 మిషన్‌లో భాగంగా 2025 ఆగస్టులో ఐఎస్ఎస్‌కు వెళ్లిన నలుగురు వ్యోమగాముల్లో ఒకరు అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఆ వ్యోమగామితోపాటు మిగిలిన ముగ్గురిని కూడా షెడ్యూల్ కంటే ముందుగానే నాసా భూమికి రప్పిస్తుంది. ఐఎస్ఎస్ 25 ఏళ్ల చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి. అమెరికాకు చెందిన మైక్ ఫిన్సీ, జెనా కార్డ్‌మెన్‌తోపాటు కిమియా యుయి(జపాన్), ఓలెగ్ ప్లతనోవ(రష్యా) అనే వ్యోమగాములు క్రూ-11 మిషన్‌లో భాగంగా గత ఏడాది ఆగస్టులో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం వీరు ఈ ఏడాది మార్చిలో భూమికి తిరిగిరావాలి. కానీ మెడికల్ ఎమర్జెన్సీ నేపథ్యంలో షెడ్యూల్ కంటే ముందుగానే క్రూ-11 సభ్యులు భూమికి తిరుగు ప్రయాణం అవుతున్నారని, ఈ నెలలోనే భూమిని చేరుకుంటారని నాసా అధికారులు విలేకరులకు వెల్లడించారు.

28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ, జనవరి 9: పార్లమెంట్ మొదటి విడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28న ప్రారంభమై ఫిబ్రవరి 13వరకు కొనసాగనున్నాయి. సంప్రదాయాన్ని పాటిస్తూ ఫిబ్రవరి ఒకటో తేదీ ఆదివారం రోజునే బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ మేరకు బడ్జెట్ సమావేశాల షెడ్యూలును ఆయన శుక్రవారం ప్రకటించారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

అత్యవసరంగా భారత్ వెళ్తున్నారా?

▸▸ ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోండి

▸▸ హెచ్-1బీ వీసాదారులకు ఇమిగ్రేషన్ అటార్నీ హెచ్చరిక

న్యూయార్క్, జనవరి 9: కుటుంబ వేడుకలకు, బంధుమిత్రుల పెళ్లిళ్లకు హాజరయ్యేందుకు భారత్ వెళ్లాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే టికెట్లు బుక్ చేసుకొనే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని హెచ్-1బీ, హెచ్-4 వీసాదారులను ఇమిగ్రేషన్ న్యాయవాది రాహుల్ రెడ్డి హెచ్చరించారు. మరీ అత్యవసరం అయితే తప్ప భారత్‌కు ప్రయాణించడం మానుకోవాలని సూచించారు. ఏప్రిల్‌లో వీసా అపాయింట్‌మెంట్ ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి రిస్క్ తీసుకోకపోవడమే మంచిదని, ఆ తేదీలు కూడా వాయిదా పడే అవకాశం ఉందని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో భారత్ ప్రయాణించాలని నిర్ణయించుకున్నవారు వీలైనంత ఎక్కువ కాలంపాటు అక్కడే బస చేయడానికి సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. అమెరికా వెలుపల చిక్కుకుపోయేవారు తమ ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందని, ఇలాంటివారు మరో కంపెనీలో ఉద్యోగం పొందే అవకాశాలు కూడా చాలా తక్కువేనని హెచ్చరించారు.

ఒక్కొక్కరికి లక్ష డాలర్లు!

▸▸ గ్రీన్‌లాండ్ వాసులకు ట్రంప్ ఎర

న్యూఢిల్లీ, జనవరి 9: గ్రీన్‌లాండ్‌ను అమెరికా నియంత్రణలోకి తెచ్చుకొనే దిశగా ట్రంప్ యంత్రాంగం అడుగులు వేస్తోంది. డెన్మార్క్ నుంచి విడిపోయి, అమెరికాలో చేరాలని గ్రీన్‌లాండ్ దేశ వాసులను ఒప్పించడానికి డబ్బును ఎరగా చూపుతోంది. గ్రీన్‌లాండ్‌లో ఉంటున్న 57 వేల మందికి ఒక్కొక్కరికి 10వేల డాలర్ల నుంచి లక్ష డాలర్ల వరకూ అందజేసే ప్రతిపాదనలపై అధికారులు చర్చించారని వైట్‌హౌస్ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా నివేదించింది.

నాటో నుంచి తప్పుకొందాం..

▸▸ ఫ్రాన్స్ పార్లమెంటు ఉపాధ్యక్షురాలు క్లెమెన్స్ గ్యూటే ప్రతిపాదన

పారిస్, జనవరి 9: నాటో కూటమి నుంచి తప్పుకొందామని ఫ్రాన్స్ ప్రభుత్వానికి ఆ దేశ పార్లమెంటు ఉపాధ్యక్షురాలు క్లెమెన్స్ గ్యూటే ప్రతిపాదించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయని, అందువల్ల అమెరికా ఆధ్వర్యంలోని నాటోలో ఫ్రాన్స్ కొనసాగడం సరికాదని ‘ఎక్స్’లో పోస్టు పెట్టారు.

నేడు టీడీపీ కార్యాలయానికి సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ కార్యాలయానికి రానున్న చంద్రబాబు సుమారు మూడు గంటలపాటు అక్కడే ఉంటారు. కార్యకర్తల నుంచి వినతులు స్వీకరిస్తారు.

28న మంత్రి మండలి సమావేశం

రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈనెల 28న జరగనుంది. ఉదయం 10.30 గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఆయా శాఖలు తమ క్యాబినెట్ ప్రతిపాదనలను ఈనెల 26 సాయంత్రం 6 గంటల్లోగా పంపాలని జీఏడీ ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీలో టాటా పవర్ భారీ పెట్టుబడి

▸▸ 6,675 కోట్లతో నెల్లూరులో 10 గిగావాట్ ఇంగోట్, వేఫర్ ఉత్పత్తి కేంద్రం

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ రాష్ట్రంలో రూ.6,675 కోట్ల పెట్టుబడితో సోలార్ ప్యానళ్లు, సెల్స్ తయారీలో కీలకమైన ఇంగోట్, వేఫర్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంటు సామర్థ్యం 10 గిగావాట్లు కాగా, దేశంలోనే అతిపెద్ద తయారీ ప్లాంటుగా ఇది నిలవనుంది. నెల్లూరు సమీపంలోని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంటును ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్లాంటు పూర్తయితే ప్రత్యక్షంగా 1,000 మందికి ఉపాధి లభించనుంది. ఇంగోట్, వేఫర్ ప్లాంటుకు అవసరమైన విద్యుత్తును అందించేందుకు 200 మెగావాట్ల క్యాప్టివ్ గ్రీన్ పవర్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. 2028 జనవరి నాటికి ఈ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభం కానుంది.

బెంగాల్‌లో ‘ఐ-ప్యాక్’ రచ్చ

▸▸ రాజకీయ కక్షతో ఈడీ దాడి: బెంగాల్ సీఎం మమత



కలకత్తాలో జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొన్న సీఎం మమత, టీఎంసీ నేతలు, కార్యకర్తలు

న్యూఢిల్లీ/కోల్‌కతా, జనవరి 9: రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐ-ప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలపై పశ్చిమబెంగాల్‌లో రచ్చ కొనసాగుతోంది. మమతకు వ్యతిరేకంగా ఈడీ, దర్యాప్తు సంస్థ సోదాలను సవాలు చేస్తూ టీఎంసీ.. కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాలు కోర్టును ఆశ్రయించగా.. అక్కడా గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో అసహనం వ్యక్తం చేసిన న్యాయమూర్తి, పిటిషన్ల విచారణను ఈ నెల 14కు వాయిదా వేశారు. బొగ్గు అక్రమ రవాణా కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఐ-ప్యాక్ డైరెక్టర్ జైన్ ఇల్లు, సంస్థ కార్యాలయాల్లో గురువారం ఈడీ తనిఖీలు చేసిన సంగతి తెలిసిందే. ఈ తనిఖీలను వ్యతిరేకిస్తూ టీఎంసీ అధ్యక్షురాలు, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చారు. శుక్రవారం దక్షిణ కోల్‌కతాలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇందులో రాష్ట్ర మంత్రులు, టీఎంసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజకీయ కక్షతోనే కేంద్రంలోని బీజేపీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్న నినాదాలతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. టీఎంసీ అంతర్గత వ్యూహాలను చోరీ చేసేందుకు బీజేపీ సర్కారు ఈడీని వాడుకుంటోందని ఆరోపించారు. ఈడీ సోదాలు జరుగుతున్న సమయంలో తాను ఐ-ప్యాక్ కార్యాలయానికి, ప్రతీక్ జైన్ ఇంటికి వెళ్లడాన్ని సమర్థించుకున్నారు. “నేను నిన్న ఏం చేసినా అది టీఎంసీ అధ్యక్షురాలిగానే చేశా. సీఎంగా కాదు. నేనేమీ చట్టవిరుద్ధంగా ప్రవర్తించలేదు” అని మమత స్పష్టం చేశారు. ఐ-ప్యాక్ తమ పార్టీకి రాజకీయ సలహా సంస్థ అని తెలిపారు. తమ పార్టీ వ్యూహాలకు సంబంధించిన చాలా సమాచారాన్ని తస్కరించారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు అన్ని సంస్థలనూ తన గుప్పిట్లో పెట్టుకుందని ధ్వజమెత్తారు. ఈసీ సాయంతో మహారాష్ట్ర ఎన్నికల్లో గెలిచారని.. ఇప్పుడు ఓటర్ల జాబితా సవరణ పేరుతో నిజమైన ఓటర్లను కూడా తొలగించి బెంగాల్‌లోనూ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు.

మమతపై సీబీఐ దర్యాప్తు: ఈడీ

మనీలాండరింగ్ కేసులో ఐ-ప్యాక్ కార్యాలయాల్లో సోదాలు జరుపుతుండగా.. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వచ్చి కీలక ఆధారాలను తీసుకెళ్లిపోయారని, ఆమెపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ ఈడీ కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. తమ విధులకు ఆటంకం కలిగించిన సీఎం మమత, సీనియర్ పోలీసు అధికారులు, ఇతరులపై సీబీఐతో విచారణ జరిపించాలని అభ్యర్థిస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. సోదాలు చేసిన ప్రాంతాల నుంచి తాము సేకరించిన ఆధారాలను మమత, ఆమె అనుచరులు బలవంతంగా తీసుకెళ్లిపోయారని.. వాటిని తక్షణమే సీజ్ చేసి తమకు అప్పగించేలా చూడాలని కోరింది. కాగా, టీఎంసీ కూడా ఈడీకి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించింది. ఐ-ప్యాక్ కార్యాలయాల్లో సోదాల సందర్భంగా సేకరించిన సమాచారాన్ని దుర్వినియోగం చేయకుండా ఈడీని అడ్డుకోవాలని కోరుతూ రిట్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్లు జస్టిస్ సువ్ర ఘోష్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. అయితే, కోర్టు గది రసాభాసగా మారిపోవడంతో జస్టిస్ ఘోష్ విచారణను ఈ నెల 14కు వాయిదా వేసి తన సీటు నుంచి లేచి వెళ్లిపోయారు. మరోవైపు టీఎంసీ అధ్యక్షురాలి హోదాలో మమతా బెనర్జీ శుక్రవారం ఈడీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోల్‌కతా, బిధాన్‌నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు.

ఢిల్లీలో టీఎంసీ ఎంపీల నిరసన

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు శుక్రవారం ఢిల్లీలోని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. మహువా మొయిత్రా, శతాబ్ది రాయ్, కీర్తి ఆజాద్, డెరెక్ ఓబ్రెయిన్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు. ఐ-ప్యాక్ కార్యాలయంలో ఈడీ సోదాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అక్కడి నుంచి బలవంతంగా లాక్కెళ్లారు. పోలీసుల తీరును ఎంపీలు ఖండించారు. “ప్రజాస్వామ్య నిరసనలకు తావులేకుండా పోతోంది. నేరగాళ్లకు రివార్డులు దక్కుతున్నాయి. దర్యాప్తు సంస్థలను ఆయుధాలుగా వాడుతున్నారు. ఎన్నికలను తారుమారు చేస్తున్నారు. నిరసనకారులను జైలుకు పంపి.. రేపిస్టులకు బెయిల్ ఇస్తున్నారు. ఇది బీజేపీ విధానం. దీన్ని బెంగాల్ అంగీకరించదు” అని బీజేపీని ఉద్దేశించి తృణమూల్ నేత అభిషేక్ బెనర్జీ పోస్టు పెట్టారు.

ఈ డ్రామాలు మమతకు అలవాటే: బీజేపీ

ఈడీ తనిఖీల సమయంలో బెంగాల్ సీఎం మమత ప్రవర్తించిన తీరును బీజేపీ తప్పుపట్టింది. తనిఖీలు చేస్తున్న ఈడీ అధికారుల నుంచి పత్రాలను లాక్కెళ్లిపోవడం చూస్తుంటే ఆమెపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. ప్రతి ఎన్నిక ముందు ఆమె ఇలాంటి డ్రామాలే చేస్తుంటారని ఎద్దేవా చేశారు.

లోకం తీరు



చైనా కంపెనీలకు గేట్లు బార్లా!

▸▸ నియంత్రణల సడలింపునకు కేంద్ర ప్రభుత్వం యోచన

న్యూఢిల్లీ, జనవరి 9: భారత్‌లో చైనా కంపెనీల కార్యకలాపాలకు కేంద్ర ప్రభుత్వం గేట్లు బార్లా తెరవనుందా? గల్వాన్ ఘటన అనంతరం చైనా సంస్థలపై విధించిన నియంత్రణల ఎత్తివేతకు సిద్ధమవుతోందా? దేశంలో వివిధ రంగాల ప్రాజెక్టులకు తీవ్ర ఇబ్బందిగా మారిన నేపథ్యంలో ఈ విషయంలో తర్జనభర్జన పడుతోందా?.. కేంద్ర ఆర్థికశాఖలోని సంబంధిత అధికారవర్గాలు, రాయిటర్స్ ప్రచురించిన కథనం ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం ఇస్తున్నాయి. అయితే ఇది ప్రతిపాదనల దశలోనే ఉందని, ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొంటున్నాయి. 2020లో గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య ఘర్షణలు, అనంతర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. భారత్‌లో చైనా కంపెనీల కార్యకలాపాలపై కేంద్రం పలు నియంత్రణలు విధించింది. భారత్‌లోని వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల టెండర్లలో ఏవైనా చైనా కంపెనీలు పాల్గొనాలంటే.. భారత ప్రభుత్వం వద్ద ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకుని, రాజకీయ, భద్రతాపరమైన క్లియరెన్సులు తీసుకోవాలి. భారత ప్రభుత్వం వద్ద చైనా ప్రభుత్వ రంగ సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకునే పరిస్థితి ఉండదు. అంటే ఆ సంస్థలు భారత్‌లో ప్రాజెక్టులు చేపట్టడానికి వీలు ఉండదు. దీనితో లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులపై ప్రభావం పడినట్టు అంచనా. ఉదాహరణకు భారత్‌లో రూ.2 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుకు బిడ్ వేసిన చైనా ప్రభుత్వ రైల్, రోడ్ కార్పొరేషన్ సంస్థ ఆ పనులను చేపట్టలేని పరిస్థితి నెలకొందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పలు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకూ ఇలాంటి సమస్య ఉందని పేర్కొన్నాయి. ఈ క్రమంలో చైనా కంపెనీలపై నియంత్రణలు సడలించాలని విజ్ఞప్తులు వచ్చాయని వెల్లడించాయి. దానికి తోడు ప్రస్తుతం భారత్, చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తలు చల్లారడం, దౌత్యపరమైన సంబంధాలు పూర్వస్థితికి వస్తుండటంతో.. చైనా ప్రభుత్వ రంగ సంస్థలపై నియంత్రణలను తొలగించే దిశగా కసరత్తు జరుగుతున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

మోదీ ఫోన్ చేయలేదు.. ట్రేడ్ డీల్ కుదరలేదు..

▸▸ అమెరికా వాణిజ్య శాఖ మంత్రి లుట్నిక్ వ్యాఖ్య

న్యూయార్క్, జనవరి 9: భారత ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఫోన్ చేసి మాట్లాడకపోవటం వల్లే రెండు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరలేదని అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ తెలిపారు. రెండు దేశాల ప్రతినిధుల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగిన తర్వాత ఒప్పందం కొలిక్కి వచ్చిందని, ఆ దశలో ఒప్పందం కుదరాలంటే ట్రంప్‌నకు మోదీ ఫోన్‌చేసి మాట్లాడాల్సి ఉండగా.. అది వారికి (భారత్‌కు) నచ్చకపోవటంతో ఒప్పందం ఆగిపోయిందని చెప్పారు. ‘ఆల్ ఇన్ పాడ్‌కాస్ట్’ సంస్థకు గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ మేరకు వెల్లడించారు. ‘భారత్ గురించి మీకో విషయం చెబుతాను. బ్రిటన్‌తో నేను మొదటి ఒప్పందం కుదిర్చాను. మీకు (బ్రిటన్‌కు) రెండు వారాల సమయమే ఉందని, ఆ తర్వాత రైలు వేరే స్టేషన్ (దేశానికి)కు వెళ్లిపోతుందని వారితో నేను చెప్పాను. యూకేతో ఒప్పందం అనంతరం ఏ దేశంతో డీల్ ఉంటుందని ట్రంప్‌ను అందరూ అడిగారు. ఆయన భారత్‌తో ఉంటుందని బహిరంగంగానే చెప్పారు. మేం భారత అధికారులతో మాట్లాడి ఒప్పందం చేసుకోవటానికి మూడు వారాల సమయం మాత్రమే ఉందని చెప్పాం. నిజానికి అది స్పష్టంగా ట్రంప్ డీల్. ఆయనే ఈ చర్చలు మొత్తాన్ని నడిపించారు. దీంతో చివరగా ట్రంప్‌నకు మోదీ ఫోన్ చేసి మాట్లాడితే ఒప్పందం ఖరారవుతుందని నేను వారితో చెప్పాను. కానీ మోదీ కాల్ చేయలేదు. ఆ తర్వాత మేము ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, వియత్నాంలతో ఒప్పందాలు చేసుకున్నాం. నిజానికి వీటికంటే ముందు భారత్‌తోనే ఒప్పందం జరగాల్సి ఉంది. మేము ఇచ్చిన గడువు ముగిసిన తర్వాత భారత అధికారులు వచ్చి ఒప్పందానికి సిద్ధమని చెప్పారు. కానీ, ఎంత రేటుకు అని నేను అడిగా. త్రాసులో భారత్ సరైన వైపున ఉండలేదు. అందుకే వాణిజ్య ఒప్పందం కుదరలేదు’ అని లుట్నిక్ వివరించారు. కాగా, లుట్నిక్ వ్యాఖ్యలను భారత్ ఖండించింది. ట్రంప్‌నకు మోదీ ఫోన్ చేయకపోవటం వల్లనే భారత్,అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదరలేదన్నది వాస్తవం కాదని విదేశాంగశాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భారత్‌కు వెనెజువెలా చమురు

అమ్మడానికి సిద్ధంగా ఉన్న అమెరికా!

▸▸ మళ్లీ వెనెజువెలా క్రూడాయిల్ మార్కెట్‌లోకి వస్తే ధరలు తగ్గే చాన్స్

న్యూఢిల్లీ, జనవరి 9: రష్యా నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు కొనడంపై కినుకగా ఉన్న అమెరికా.. దానికి బదులుగా వెనెజువెలా నుంచి చమురు కొనడాన్ని అనుమతించేందుకు సిద్ధంగా ఉంది. ‘వెనెజువెలా చమురును కొనేందుకు భారత్‌ను అనుమతిస్తారా?’ అనే ప్రశ్నకు.. ట్రంప్ పాలనాయంత్రాంగంలోని అధికారి ఒకరు సానుకూలంగా స్పందించారు. ప్రపంచంలోని అన్ని దేశాలకూ వెనెజువెలా చమురును అమ్ముతామంటూ యూఎస్ ఇంధన మంత్రి క్రిస్టోఫర్ రైట్ చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు. నిజానికి 2017-2020 నడుమ వెనెజువెలా నుంచి పెద్ద ఎత్తున చమురును కొనే టాప్-6 దేశాల్లో భారత్ ఒకటి. 2018లో.. మన దేశ చమురు అవసరాల్లో 5 నుంచి 7% మేర వెనెజువెలా చమురే తీర్చేది. ఇండియాలోని కాంప్లెక్స్ రిఫైనరీలు(హెవీ ఆయిల్‌ను ప్రాసెస్ చేయడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసినవి) ఆ దేశ హెవీ క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకునేవి. అప్పట్లో ఇండియా ఆ దేశం నుంచి రోజుకు సగటున 3 లక్షల బ్యారెళ్ల ముడిచమురు కొనుగోలు చేసేది. 2022 తర్వాత అమెరికా ఆంక్షలతో కొనుగోళ్లను భారీగా తగ్గించేసింది. అదే సమయంలో రష్యా నుంచి రాయితీ ధరలకు చమురు వస్తుండడంతో ఆ దేశం నుంచి పెద్దఎత్తున కొనుగోలు చేయడం ప్రారంభించింది. కానీ.. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టాక పరిస్థితి మారింది! రష్యా నుంచి చమురు కొనే దేశాలపై ఆయన సుంకాల బాదుడుతో ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే మన ఉత్పత్తులపై 50% దాకా సుంకాలు విధించారు. ఇంకా మాట వినకపోతే 500% దాకా సుంకాల భారం మోపుతానని ఇప్పుడు బెదిరిస్తున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారు కావడానికి కూడా ఇదో పెద్ద అడ్డంకిగా మారింది. వెనెజువెలాలో తాజా పరిణామాల నేపథ్యంలో మళ్లీ ఆ దేశం నుంచి చమురు కొనుగోళ్లను పెంచే అవకాశం ఉంది. కాకపోతే, ఆ కొనుగోళ్లు పాత విధానంలో కాక.. అమెరికా నియంత్రిత విధానంలో ఉంటాయి. కాగా.. ప్రస్తుతం వెనెజువెలా వద్ద సిద్ధంగాఉన్న 3కోట్ల నుంచి 5 కోట్ల బ్యారెళ్ల చమురును అమ్మడానికి ప్రణాళికలు రచిస్తున్నామని.. భవిష్యత్తులో కూడా ఆ దేశ ముడిచమురును విక్రయిస్తామని క్రిస్టోఫర్ రైట్ మరో ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఆ దేశంలో గతంలో పనిచేసిన చమురు కంపెనీలతో పాటు, అక్కడ పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న సంస్థలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. ఇన్నాళ్లూ ఆంక్షల కారణంగా అంతగా మార్కెట్లోకి రాని వెనెజువెలా చమురు ఇప్పుడు విపణిలో అందుబాటులోకి వస్తే అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. బ్యారెల్‌కు డాలర్ చొప్పున ధర తగ్గినా.. మన ఆయిల్ దిగుమతుల బిల్లు ఏడాదికి రూ.13 వేల కోట్ల మేర తగ్గుతుంది. కాబట్టి వెనెజువెలా చమురు విపణిలో అందుబాటులోకి రావడం భారత్‌కు శుభవార్తే.



పాత డివిడెండ్ వసూలయ్యే చాన్స్

వెనెజువెలా చమురు రంగాన్ని అమెరికా తన చేతుల్లోకి తీసుకోవడం భారత్‌కు మరో రకంగా కూడా ఉపయోగపడే అవకాశం ఉంది. అదేంటంటే.. మన ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్‌కు తూర్పు వెనెజువెలాలోని శాన్‌క్రిస్టోబల్ చమురు క్షేత్రంలో 40% వాటా ఉంది. దానికి 2014 నాటికి రావాల్సిన 536 మిలియన్ల మేర డివిడెండు ఇప్పటిదాకా రాలేదు. ఆ తర్వాత సంవత్సరాలకు సంబంధించి మరో 500 మిలియన్ డాలర్ల మేర డివిడెండ్‌కూడా రాలేదు. ఇప్పుడా బిలియన్ డాలర్లూ వచ్చే అవకాశం ఉంది.

అట్టుడుకుతున్న ఇరాన్!

మరింత ఉధృతమైన ఆందోళనలు.. సుప్రీం లీడర్ ఖమేనీ తప్పుకోవాలని డిమాండ్లు



దుబాయ్, జనవరి 9: ఇరాన్‌లో కల్లోలం మొదలైంది. కరెన్సీ విలువ పడిపోవడం, ధరల పెరుగుదలపై మొదలైన నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. ఆయతొల్లా ఖమేనీ నేతృత్వంలోని ప్రభుత్వం దిగిపోవాలంటూ ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. మూకుమ్మడిగా ఆందోళనలు చేపట్టాలని ప్రవాసంలో ఉన్న ఇరాన్ యువరాజు రెజా పహ్లవీ పిలుపునివ్వడంతో.. గురువారం రాత్రి పెద్దసంఖ్యలో యువత ఆందోళనలకు దిగారు. వారికి మద్దతుగా మహిళలు, పెద్దవయసువారు ఇళ్లపై నుంచి నినాదాలు చేశారు. పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు ఆందోళనలు విస్తరించాయి. రోడ్లపై వాహనాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. విగ్రహాలను ధ్వంసం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలపై దాడికి ప్రయత్నించారు. ఈ ఆందోళనలను అత్యంత కఠినంగా అణచివేసేందుకు ఇరాన్ చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా ఇంటర్నెట్‌ను నిలిపివేసింది. విదేశాలకు చేసే, విదేశాల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను నిషేధించింది. విమానాల రాకపోకలను నిలిపివేసింది. దీనితో ఇరాన్ ప్రజలకు బయటి ప్రపంచంతో దాదాపుగా సంబంధాలు తెగిపోయాయి. పలుచోట్ల ఆందోళనకారులకు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు 41 మంది మృతిచెందారు. వేలాది మందిని పోలీసులు అరెస్టు చేశారు.

తీవ్రంగా స్పందించాల్సి ఉంటుంది: ట్రంప్

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆందోళనకారులపై ఇరాన్ పాలకులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని.. ఒకవేళ వారు ఆందోళకారులను చంపడం వంటివి మొదలుపెడితే తాము తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరించారు. అవసరమైతే తాను అంతర్జాతీయ చట్టాలను పట్టించుకోబోనని వ్యాఖ్యానించారు. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అరెస్టు చేసిన అనంతరం ఆ దేశంలో రాజకీయ ఖైదీల విడుదల ప్రారంభమైందని.. తాను చేసిన పని సరైనదేనని దీనితో రుజువైందని పేర్కొన్నారు.

ఇరానీయుల రక్తంతో తడిసిన చేతులవి: ఖమేనీ

ఇరాన్‌లో ఆందోళనకారులను ఆ దేశ సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ తీవ్రంగా హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను సంతోషపెట్టడానికి కొందరు ఇరానీయులు తమ సొంత దేశంలో వీధుల్లో పరుగెడుతున్నారని వ్యాఖ్యానించారు. గురువారం రాత్రి కొందరు టెహ్రాన్‌లో విధ్వంసానికి దిగారని.. విదేశీ శక్తుల చేతుల్లో కిరాయి సైనికుల్లా వ్యవహరిస్తున్న వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. ఆందోళనకారులను చంపితే తీవ్రంగా స్పందిస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఏకపక్షంగా దాడులకు దిగిన ట్రంప్ చేతులు ఇరానీయుల రక్తంతో తడిశాయని వ్యాఖ్యానించారు.

తప్పు చేసి.. సారీ చెప్తే సరిపోదు!

ప్రజాప్రతినిధుల పట్ల గౌరవం ఉండాలి: మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల అధికారులు గౌరవంగా వ్యవహరించాలని, వారి హక్కులకు భంగం కలిగించరాదని శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ బీటీ నాయుడు తెలిపారు. సభ్యుల పట్ల అమర్యాదగా, తప్పుగా ప్రవర్తించి.. ఆ తర్వాత సారీ చెబితే సరిపోతుందని అనుకోవద్దని స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ హాల్-1లో ప్రివిలేజ్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. “ప్రివిలేజ్ కమిటీకి మొత్తం 28 కేసులు అందాయి. ప్రధానంగా మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రయ్య, దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీలకు సంబంధించిన కేసులు విచారించాం. కొంత మంది అధికారులు జరిగిన తప్పుల్ని అంగీకరించారు. ఇకపై అలాంటివి జరగకుండా జాగ్రత్త పడతామని చెప్పారు. తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా వేశాం.” అని వివరించారు. కాగా, దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతంలో చేసిన ఫిర్యాదుపై ప్రివిలేజ్ కమిటీ విచారించింది. 2023 మార్చి 25న దెందులూరులో అప్పటి సీఎం జగన్ మీటింగ్‌కు రావాలంటూ సాబ్జీకి ఆహ్వానం పంపారు. అయితే ఆయనను సమావేశానికి వెళ్లకుండా అప్పటి ఏలూరు ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు గృహ నిర్బంధం చేశారు. దీంతో సాబ్జీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సీఐని కమిటీ ముందుకు పిలిపించి వివరణ కోరారు. “సీఎం సభకు ఆహ్వానించిన తర్వాత ఎమ్మెల్సీని నిర్బంధిస్తారా?.” అని కమిటీ చైర్మన్ బీటీ నాయుడు ప్రశ్నించారు. అయితే, అప్పటి ఎస్పీ ఆదేశాల మేరకే విధులు నిర్వహించానని సీఐ చెప్పారు.

పీఎస్ఎల్వీ-సీ62 రిహార్సల్ విజయవంతం

▸▸ 12న ఈవోఎస్-ఎన్1 ఉపగ్రహ ప్రయోగం



సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాది తొలి ప్రయోగానికి ఇస్రో సిద్ధమవుతోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి ఈ నెల 12న పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగానికి చకచకా ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం ఉదయం 10.17 గంటలకు చేపట్టే ఈ రాకెట్ ప్రయోగం ద్వారా ఈవోఎస్-ఎన్1 ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనుంది. ప్రయోగ సన్నాహాల్లో భాగంగా శుక్రవారం రాకెట్ రిహార్సల్‌ను శాస్త్రవేత్తలు నిర్వహించారు. ఇందులో భాగంగా రాకెట్‌ను మొబైల్ సర్వీసు టవర్ నుంచి వెనక్కి తీసుకొచ్చి మళ్లీ ముందుకు తీసుకెళ్లే ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ శనివారం షార్‌కు రానున్నారు. మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్ఆర్) శనివారం జరగనుంది. ఎంఆర్ఆర్ అనంతరం షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ సమావేశం కానున్నారు. ప్రీ కౌంట్ డౌన్ నిర్వహించి రాకెట్‌కు తుది పరీక్షలు పూర్తయ్యాక ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు.



మారుమూల ప్రాంతాల్లో కమ్యూనికేషన్ అనౌన్స్‌మెంట్ వాహనాలను ప్రారంభిస్తున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

మారుమూల ప్రాంతాలకూ పోలీసు కమ్యూనికేషన్

- విపత్తుల్లో వేగంగా మెరుగైన సేవలు: డీజీపీ హరీశ్‌గుప్తా

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అత్యంత మారుమూల ప్రాంతాలకు సైతం పోలీసు కమ్యూనికేషన్ వ్యవస్థను విస్తరించి, వేగవంతమైన సేవలు అందించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. సెల్‌ఫోన్ సిగ్నళ్లు అందని అటవీ ప్రాంతాల్లో నూ పోలీసు కమ్యూనికేషన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తద్వారా సకాలంలో సమాచారం అందించడం ద్వారా ప్రజల రక్షణతో పాటు విపత్తుల సమయంలో పోలీసుల సేవలు మరింత మెరుగవుతాయన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ కేంద్ర హోంశాఖ నిధులతో రిమోట్ ఏరియా కమ్యూనికేషన్ మెరుగుదల(రేస్) కింద రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలకు 8 కార్లు, 16 బైకులను డీజీపీ చేతుల మీదుగా అందజేశారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీశ్ గుప్తా ఈ వాహనాలకు పచ్చ జెండా ఊపారు.

వివాదాలతో ఫలితాలు పెండింగ్: ఏపీపీఎస్సీ

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): న్యాయ వివాదాల కారణంగానే గ్రూప్-1, 2 ఫలితాలు పెండింగ్‌లో ఉన్నాయని ఏపీపీఎస్సీ వెల్లడించింది. వివాదాలు పరిష్కారమయ్యాక వీలైనంత త్వరలోనే ఫలితాలు విడుదల చేస్తామని శుక్రవారం తెలిపింది. గ్రూప్-1 నోటిఫికేషన్‌పై హైకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉందని.. గ్రూప్-2 నోటిఫికేషన్‌లో క్రీడా కోటా కేసులపై హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పరిశీలిస్తున్నట్టు తెలిపింది.

ప్రీఫైనల్ ఫలితాల ఆధారంగా విద్యార్థుల సన్నద్ధం

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రీఫైనల్ పరీక్ష ఫలితాల ఆధారం గా పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా చర్యలు చేపట్టాలని ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లిలోని కార్యాలయం నుంచి డీఐఈవోలు, ఆర్జేడీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షల కోసం నిర్వహిస్తున్న 'సంకల్ప్'ను సమర్థంగా అమలు చేయాలన్నారు.

ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు: మంత్రి డోలా

విశాఖపట్నం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగుల వసతి గృహాల్లో విద్యార్థుల భద్రతలో భాగంగా ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. శుక్రవారం విశాఖలో మాట్లాడారు. హాస్టళ్లలో సీసీ కెమెరాల వల్ల బయట వ్యక్తుల ప్రవేశానికి అడ్డుకట్ట పడుతుందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో వసతులకు రూ.360 కోట్లు కేటాయించామన్నారు.

లాభాపేక్ష లేని సంస్థలకు లీజు పెంపు

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖకు చెందిన భూముల్లో ప్రస్తుతం ఉన్న విద్యాసంస్థలు, లాభాపేక్ష లేని సంస్థలకు లీజులు పొడిగించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు ఇచ్చారు.

ఎస్టీలకు ఆర్‌వోఆర్ అమలు కావడం లేదు

దేవదాయ శాఖలో ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు, రిజర్వేషన్లు సరిగ్గా అమలు కావడం లేదన్న ఫిర్యాదులపై జాతీయ గిరిజన కమిషన్ విచారణ చేసింది. శుక్రవారం దేవదాయ శాఖ కార్యాలయానికి ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్, డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి వచ్చి విచారణ చేపట్టారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ల(ఆర్‌వోఆర్), పదోన్నతుల్లో ప్రాధాన్యం నిబంధనలు దేవదాయ శాఖలో అమలు కావడం లేదని గుర్తించారు.

పంచాయితీల కంటే.. పరిష్కారాలకే మొగ్గు



- ఏపీ ఒక అడుగు వేస్తే.. మేం పదడుగులేస్తాం
- సయోధ్య, పరస్పర సహకారంతో ముందుకు
- నీళ్ల వివాదాల ముసుగులో రాజకీయ లబ్ధి ఆలోచన లేదు: టీ సీఎం రేవంత్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

"తెలంగాణ రాష్ట్రానికి పంచాయితీ కావాలా? నీళ్లు కావాలా? అని అడిగితే నేను నీళ్లే కావాలని కోరుకుంటాను. వివాదం కావాలా?, పరిష్కారం కావాలా ? అని అడిగితే పరిష్కారమే కావాలని కోరుకుంటా. వివాదాల కంటే శాశ్వత పరిష్కారాలకే మొగ్గు చూపుతా" అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలను కొనసాగిస్తూనే పెండింగ్ సమస్యలను పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల ఈ-సిటీలో సుజెన్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా యూనిట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాల నేపథ్యంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కృష్ణానదిపై తెలంగాణ చేపడుతున్న ప్రాజెక్టుల అనుమతుల కోసం ఏపీ ప్రభుత్వం సహకరించాలని కోరారు. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన అనుమతులకు ఇప్పుడు అడ్డంకులు పెట్టవద్దని ఏపీ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. "పాలమూరు-రంగారెడ్డితోపాటు కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్‌బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఉమ్మడి రాష్ట్రంలోనే అనుమతులు వచ్చాయి. ఇప్పుడు వీటికి అభ్యంతరాలు చెప్పవద్దు. ఈ అడ్డంకులతో పర్యావరణ, సీడబ్ల్యూసీ నుంచి సమస్యలు తలెత్తుతున్నాయి. రుణాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మాకు సహకరించండి" అని కోరారు. రాజకీయ ప్రయోజనాలు కాదని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వెళ్లాలని, చర్చల ద్వారా సమస్యలకు సంపూర్ణ పరిష్కారం దొరుకుతుందని అన్నారు. "అంతర్రాష్ట్ర నీటి వివాదాలపై ఏపీతోపాటు పొరుగు రాష్ట్రాలతో చర్చలకు మేం సిద్ధం. ఈ విషయంలో ఏపీ ఒక అడుగు ముందుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకేస్తుంది. నీళ్ల వివాదాల ముసుగులో రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచన మాకు లేదు. నీళ్ల విషయంలో వివాదాలు, రాజకీయ లబ్ధి కోసం ఆలోచనలు చేయవద్దు. చర్చలు ఒక్కటే పరిష్కారం. న్యాయస్థానాలు లేదా ఇతరుల వద్ద పంచాయితీల కంటే మనమే కూర్చొని మన సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుందాం." అని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.

పోర్టు కనెక్టివిటీ అవసరం

రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోకపోతే సమస్యలు పరిష్కారం కావని, ఇందుకోసం పక్క రాష్ట్రంతో చర్చలు కొనసాగుతాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఏపీతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలతో వివాదాలు కోరుకోవడం లేదని, పరస్పర సహకారమే కోరుకుంటున్నామని చెప్పారు. దేశంలో పోర్టు కనెక్టివిటీ లేని ఏకైక పెద్ద రాష్ట్రం తెలంగాణనేనని, తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ అవసరమని, సముద్ర మార్గంతో అనుసంధానం కావాలంటే ఏపీ సహకారం తప్పనిసరి అని చెప్పారు. అందుకే, మచిలీపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ సమీపంలోని భారత్ ఫ్యూచర్ సిటీ వరకు 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, దానికి సమాంతరంగా రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం సహకారం కోరుతున్నామన్నారు. "ఈ కనెక్టివిటీ రెండు రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. అయితే, పక్క రాష్ట్రం సహకారం, సయోధ్య లేకుండా ఇవన్నీ జరగవు. అందుకే ఇచ్చి పుచ్చుకునే ధోరణి అవసరం." అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధికి హైదరాబాద్ సహకారం కూడా అవసరమేనన్నారు.

పరిశ్రమల గ్రౌండింగ్‌పై రెండేళ్లలో పురోగతి!

- ప్రభుత్వాల కొనసాగింపుతోనే అభివృద్ధి
- గత సర్కారు పీపీఏలను రద్దుచేసింది
- ఆ భయంతో చాలా కంపెనీలు పరార్
- పుణే పబ్లిక్ పాలసీ ఫెస్టివల్‌లో మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో గత ప్రభుత్వం పీపీఏలను రద్దు చేయడంతో చాలా కంపెనీలు భయపడి వెళ్లిపోయాయి, అభివృద్ధికి ప్రభుత్వాల కొనసాగింపు చాలా ముఖ్యం. ప్రజలు ఈ విషయంలో చైతన్యవంతులు కావాలి' అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ అన్నారు. శుక్రవారం మహారాష్ట్ర పుణేలోని 'గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్' సంస్థ నిర్వహించిన పబ్లిక్ పాలసీ ఫెస్టివల్‌లో ఆయన ప్రసంగించారు. ఏపీలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన పరిశ్రమల గ్రౌండింగ్‌కు సంబంధించి రెండేళ్లలో పురోగతి చూపిస్తామన్నారు. ఆ తర్వాత వచ్చే పరిశ్రమలు గ్రౌండయ్యేసరికి మరో రెండేళ్లు పడతాయని తెలిపారు. 1995, 99ల్లో వరుసగా రెండుసార్లు చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టడం వల్ల హైటెక్ సిటీ, మైక్రోసాఫ్ట్, ఐఎస్‌బీ వంటి ఎన్నో సంస్థలు ఏర్పాటై నేడు లక్షలాది మంది యువతకు ఉపాధి చూపుతున్నాయని, ప్రభుత్వ కొనసాగింపు ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలని కోరారు. 'ప్రభుత్వ పాలసీలను ప్రజల్లోకి తీసుకెళ్లడమేకాక, 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్‌ను విజయవంతంగా అమలు చేస్తున్నాం. దీని ద్వారా 36 శాఖలకు చెందిన వెయ్యి రకాల సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. వాట్సాప్ గవర్నెన్స్ జాతీయస్థాయిలో ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం చేస్తుంది' అని పేర్కొన్నారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ పనులకు ఫిబ్రవరిలో శ్రీకారం చుడతామన్నారు. లోకేశ్ ఇంకా ఏమన్నారంటే..



పుణే పబ్లిక్ పాలసీ ఫెస్టివల్‌లో పాల్గొన్న లోకేశ్

నైపుణ్యం పోర్టల్ ద్వారా..

మార్చిలో ఇండియా ఏఐ కాన్ఫరెన్సుకు ఏపీ ఆతిథ్యం ఇస్తోంది. నైపుణ్యం పోర్టల్ ద్వారా మాక్ ఇంటర్వ్యూలు సైతం నిర్వహిస్తాం. భారత్‌లో ల్యాండ్ రికార్డుల నిర్వహణ అతిపెద్ద సవాల్. దీనికి ఏపీ కూడా మినహాయింపు కాదు. ఇప్పుడు మేం ఏఐ వినియోగం ద్వారా ల్యాండ్ రికార్డులన్నీ బ్లాక్ చైన్ మీదకు తీసుకొస్తున్నాం. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి బడా కంపెనీలు రాష్ట్రానికి క్యూ కట్టడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటిది నిరూపితమైన నాయకత్వం. సీఎం చంద్రబాబుకు ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. రెండోది.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. మూడోది.. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు. ప్రస్తుతం ఏపీలో నమో(నాయుడు, మోదీ) నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జెట్ స్పీడ్‌తో పనిచేస్తోంది. పైమూడు కారణాలతో ఏపీ పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోంది.

> ఒకసారి ఏదైనా పరిశ్రమ ఏపీతో ఎంవోయూ చేసుకున్నాక.. ఆ ప్రాజెక్టును మా సొంతదిగా భావించి.. అతి తక్కువ సమయంలో అన్ని రకాల అనుమతులూ ఇస్తున్నాం.
>
> ఏపీలో క్వాంటమ్ ఎకో సిస్టమ్ చంద్రబాబు కల. ఐబీఎం, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ, ఐఐటీ మద్రాస్ వంటి సంస్థలను ఏకతాటిపైకి తెచ్చి అమరావతి క్వాంటమ్ వ్యాలీకి ఆయన శ్రీకారం చుట్టారు. - మంత్రి లోకేశ్

రాష్ట్రంలో జీసీసీలకు అనుకూల విధానం

- టైర్-2 నగరాల్లో కోయంబత్తూరు, విశాఖపట్నం మధ్య గట్టి పోటీ
- 'ఆంధ్రజ్యోతి'తో హెచ్‌సీఎల్ జీసీసీ గ్లోబల్ ప్రాక్టీస్ లీడర్ కిరణ్‌బాబు చెరుకూరి వెల్లడి



విశాఖపట్నం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సామర్థ్య కేంద్రాల(జీసీసీ-గ్లోబల్ క్యాబబిలిటీ సెంటర్)కు ఏపీలో అనుకూల విధానాలు ఉన్నాయని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ జీసీసీ గ్లోబల్ ప్రాక్టీస్ లీడర్, ఏపీ సలహా మండలి సభ్యుడు కిరణ్‌బాబు చెరుకూరి తెలిపారు. టైర్-2 నగరాల్లో తమిళనాడులోని కోయంబత్తూరు, ఏపీలోని విశాఖపట్నాల మధ్య గట్టి పోటీ నెలకొందన్నారు. ఇక, ప్రపంచంలోని జీసీసీలలో 55 శాతం భారత్‌లోనే ఉన్నాయని, వాటిలో 19 లక్షల మంది పనిచేస్తున్నారని వివరించారు. విశాఖపట్నంలో శుక్రవారం మొదలైన 'ఏపీ డిజిటల్ టెక్నాలజీ' సదస్సుకు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో కిరణ్ బాబు మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో 1,800 జీసీసీలు ఉన్నాయని, వాటి ద్వారా 65 బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతోందన్నారు. 2030 నాటికి జీసీసీల సంఖ్య 2,500కు, వాటి టర్నోవర్ 110 బిలియన్ డాలర్లకు చేరుతుందని తెలిపారు. అదే సమయంలో ఉద్యోగుల సంఖ్య కూడా 28 లక్షలకు పెరుగుతుందన్నారు. "భారత్‌లోని టెక్నాలజీ వర్క్ ఫోర్స్(సాంకేతిక ఉద్యోగ రంగం)లో 35 శాతం ప్రస్తుతం జీసీసీలలో పనిచేస్తున్నారు. 2030 నాటికి ఇది 50 శాతానికి చేరుతుంది. అంటే సాధారణ సాఫ్ట్‌వేర్ కంపెనీలో 50 శాతం మంది ఉపాధి పొందితే, మిగిలిన 50 శాతం మందికి జీసీసీలు అవకాశాలు కల్పిస్తాయి." అని వివరించారు. జీసీసీలో ఉద్యోగం పొందాలంటే ఐదారేళ్ల అనుభవంతో పాటు విస్తరిస్తున్న సాంకేతిక అంశాలైన కృత్రిమ మేధ(ఏఐ), సైబర్ భద్రత, క్వాంటం సాంకేతికత, ప్రాజెక్టు ఇంజనీరింగ్ వంటి రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు.

జీసీసీల హబ్‌గా విశాఖ!

"ఆంధ్రప్రదేశ్‌లో జీసీసీల కోసం మంచి పాలసీని ప్రవేశపెట్టారు. సలహా మండలిని కూడా ఏర్పాటు చేశారు. అయితే అదొక్కటే సరిపోదు. దానిని సరిగ్గా ముందుకు నడిపించినప్పుడే కంపెనీలు ఇక్కడకు తరలి వస్తాయి." అని కిరణ్‌బాబు తెలిపారు. జీసీసీలు రావాలంటే.. కాస్ట్ ఎఫెక్టివ్ ఆపరేషన్లు, నైపుణ్యాలు, సోషల్ ఎకో సిస్టమ్, కార్యాలయాలు వంటివి అవసరమని తెలిపారు. ఏపీలో విశాఖపట్నం, విజయవాడలో ఇవి కొంతవరకు ఉన్నాయన్నారు. విశాఖపట్నాన్ని జీసీసీల హబ్‌గా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. జీసీసీలు స్థానిక అవసరాలకు అనుగుణంగా విస్తరిస్తాయని చెప్పారు. విశాఖలో హెచ్‌ఎస్‌బీసీ ఫైనాన్షియల్ రంగంలో ఒక బాటను నెలకొల్పిందని కిరణ్‌బాబు వివరించారు. జీసీసీలకు అవసరమైన నైపుణ్యం ఉన్నవారు కావాలంటే.. విద్యా సంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేయాలని కిరణ్‌బాబు సూచించారు. ప్రభుత్వం అవసరమైన నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. ఇవన్నీ ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఐఐఎం, ఐఐటీ, ఎస్ఆర్ఎం, వీఐటీ, గీతం వంటి విద్యా సంస్థలు దీనికి సహకారం అందించాల్సి ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మతం - మెరిట్

జమ్మూలోని వైష్ణోదేవి వైద్యకళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతి రద్దుచేసింది. 'శ్రీ మాతా వైష్ణోదేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎక్సలెన్స్'కు అన్ని అనుమతులూ ఇచ్చిన కొద్దినెలల్లోనే సదరు కాలేజీలో సవాలక్ష సమస్యలున్న ఆరోపణతో కేంద్రప్రభుత్వ సంస్థ ఈ నిర్ణయానికి వచ్చింది. ఎన్ఎంసీ బృందం ఆకస్మిక తనిఖీలో అనేక లోపాలూ దోషాలూ బయటపడ్డాయట. తమకు అందిన ఫిర్యాదుల్లో ప్రస్తావించిన అంశాలన్నీ నిజమేనని, కాలేజీ కొనసాగింపును అనుమతిస్తే వైద్యవిద్య ప్రమాణాలు కచ్చితంగా పతనమవుతాయని ఎన్ఎంసీ వ్యాఖ్యానించింది. ఈ కళాశాలలో మౌలికసదుపాయాల కొరత తీవ్రంగా ఉందట, బోధనాసిబ్బంది నలభైశాతం తక్కువట, ట్యూటర్లు, డిమాన్‌స్ట్రేటర్లు, సీనియర్ రెసిడెంట్స్ వంటివారి లోటు 60శాతం వరకూ ఉందట. రోగులు సగమే ఉన్నారట, ఎనభైశాతం పడకలు భర్తీకావాల్సి ఉండగా, నలభైశాతమే నిండాయట. ఇంటెన్సివ్‌కేర్ యూనిట్లు, లేబరేటరీలు, లైబ్రరీలు, ఆపరేషన్ థియేటర్లు ఇలా ప్రతీచోటా లోపాలు అనేకం బయటపడటంతో ఈ చర్య తీసుకుందట. యాభైమంది ఎంబీబీఎస్ సీట్ల భర్తీతో విద్యాసంవత్సరం ఆరంభానికి సకల అనుమతులూ ఇచ్చిన సంస్థకు కొద్దినెలల్లోనే ఎన్నో ఘోరాలు జరిగిపోతున్నట్టు కనిపించింది. వరుస ఫిర్యాదులతో ఆకస్మిక తనిఖీలు జరిగేట్టుచేసి, కాలేజీ మూసివేయించింది తామేనని నలభైఐదురోజులుగా అడ్మిషన్లకు వ్యతిరేకంగా పోరాడుతున్న సంఘర్ష్ సమితి నేతలు ప్రకటించారు. అనుమతి రద్దయిన వార్త చెవినపడగానే వీరంతా సంబరాలు చేసుకున్నారు. మహాద్భుతంగా నిర్మితమైన ఒక కాలేజీ ఇంకా పూర్తిగా నడకమొదలెట్టకముందే కుప్పకూలితే ఆనందం కలుగుతుందా? నలభైరెండుమంది ముస్లిం విద్యార్థులకు చదువుకొనే అవకాశాన్ని దూరం చేసిన ఆ సంతోషం కొలవలేనిది.

ఆకస్మిక తనిఖీలతో పాటు, అనుమతి రద్దు నిర్ణయం కూడా అతివేగంగా జరిగిపోయింది. నాసిరకం కాలేజీలకు కూడా తమ వాదన వినిపించుకోవడానికి ఎన్ఎంసీ ఎంతో సమయం ఇస్తుంది. తనిఖీలో తాము గ్రహించిన లోటుపాట్లమీద ప్రశ్నలు వేసి, జవాబు చెప్పుకోమంటుంది. ఒక నిర్ణయం తీసుకున్నాక కూడా మూడు దశల్లో అప్పీలుచేసుకొనే అవకాశం కూడా కాలేజీలకు ఉంటుందని అంటారు. ఈ కాలేజీ విషయంలో అటువంటిదేమీ జరగలేదని, అనుమతి ఇచ్చేముందు కఠిన పరీక్షలు పెట్టిన ఈ సంస్థ, రద్దు నిర్ణయాన్ని మాత్రం వెంటనే తీసుకుందని కాలేజీ అధ్యాపకులు, అధికారుల వాదన. లైబ్రరీలో పుస్తకాలు, ఆపరేషన్ థియేటర్లు, ఆడామగా వార్డులు, లేబరేటరీలు ఇత్యాది ప్రతీవిషయంలోనూ తనిఖీ బృందం తప్పుడు లెక్కలు రాసిందని వారు పోల్చిచూపిస్తున్నారు. ఆరేళ్ళుగా పనిచేస్తున్న బ్రహ్మాండమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి అనుబంధంగా, సిబ్బంది నుంచి లేబరేటరీలవరకూ దేనికీ లోటన్నదిలేకుండా, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో ఈ కాలేజీ ఏర్పడిందని, ఇక్కడి సదుపాయాలు ఈ కేంద్రపాలిత ప్రాంతంలో ఉన్న మిగతా పన్నెండు మెడికల్ కాలేజీల్లోనూ లేవని విద్యార్థులంతా ఒక్కమాటగా అంటున్నారు. అడ్మిషన్ ప్రక్రియలో వీసమెత్తు దోషం లేకుండా 'నీట్' ర్యాంకుల ఆధారంగానే ఆ యాభై సీట్లూ భర్తీ చేసినా, మైనారిటీ రిజర్వేషన్ అంటూ వేరుగా లేకున్నా నలభైరెండుమంది ముస్లిం కుర్రాళ్ళు ఈ కాలేజీలోకి ప్రవేశించడం బీజేపీ, దాని అనుబంధ సంఘాలకు ఒక ఆయుధంగా ఉపకరించింది. నేషనల్ మెడికల్ కమిషన్ నిర్ణయం వెనుక ఎవరి ఒత్తిళ్ళు పనిచేశాయో తెలుస్తూనే ఉంది. మెరిట్ కాదు, మతం చూడాలి అంటున్నవారి వాదనే పైచేయి అయింది. పోటీపరీక్షలో మంచిర్యాంకుతో సీటు తెచ్చుకున్నవారిని కశ్మీర్‌కు తరిమేయాలన్న సంఘర్ష్ సమితి డిమాండుకు వ్యవస్థలన్నీ దిగివచ్చాయి. ఒక మతానికి చెందినవారిని తరగతి గది నుంచి గెంటివేయాలన్న ఉన్మాదుల ఒత్తిడికి లొంగిపోయి, రాజ్యాంగ విలువలను వమ్ముచేయడానికి కూడా కేంద్రప్రభుత్వమూ, దాని సంస్థలూ సిద్ధపడ్డాయి. మతద్వేషానికి చేయూతనిచ్చి ఏకంగా ఒక జాతీయ స్థాయి అడ్మిషన్ల ప్రక్రియను అపహాస్యం చేశారు. మిగతాదేశంతో కశ్మీర్ విలీనం సంపూర్ణంగా జరగడానికే ప్రత్యేకప్రతిపత్తిని లాగేసుకున్నామని పాలకులు ఎప్పుడూ అంటూంటారు. యువతరాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ఇటువంటి చర్యలు పాలకపెద్దలు ప్రవచిస్తున్న 'నయా కశ్మీర్'కు దోహదం చేయకపోగా లోయప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసి, వారిని దేశానికి మరింత దూరం చేస్తాయి.

జాతుల సార్వభౌమత్వంపై సామ్రాజ్యవాద పంజా

యూరోపియన్ దేశాలు ఉభయ అమెరికా ఖండాలలోని స్వతంత్ర దేశాల వ్యవహారాలలో జోక్యం చేసుకోకూడదని, ఉభయ అమెరికాల్లో కొత్త వలసలకు పూనుకోకూడదని, ఇందుకు ప్రతిగా యూరోపియన్ వలసలలో గానీ, యూరోపియన్ రాజ్యాల అంతర్గత వ్యవహారాలలో గానీ తాము జోక్యం చేసుకోబోమని అమెరికా అయిదవ అధ్యక్షుడు జేమ్స్ మన్రో 1823లో ప్రతిపాదించారు. రెండు శతాబ్దాల అనంతరం అమెరికా 47వ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జనవరి 2 అర్ధరాత్రి ఆ సుప్రసిద్ధ మన్రో సిద్ధాంతంలోని ప్రతి మౌలిక అంశాన్ని ఉల్లంఘించారు. దక్షిణ అమెరికా ఖండంలోని ఒక సార్వభౌమిక రాజ్యాన్ని దురాక్రమించేందుకు అమెరికా అపార సైనిక శక్తిని ఆయన ఉపయోగించారు. దురాక్రమించిన దేశ అధ్యక్షుడిని బంధించి, న్యూయార్క్‌కు తీసుకువచ్చి నేర విచారణా న్యాయస్థానంలో నిలబెట్టారు. ట్రంప్ తెగువకు ప్రపంచదేశాలు నివ్వెరబోయాయి.




■ పి. చిదంబరం

'పళని' పలుకు

ట్రంప్ అమలుపరిచిన కొత్త మన్రో సిద్ధాంతం బుష్–ట్రంప్ సిద్ధాంతంగా పిలిచేందుకు అర్హమైనది. వెనెజువెలా ఉదంతానికి సమాంతర ఘటనగా 1989లో పనామాలో అమెరికా జోక్యాన్ని చెప్పవచ్చు. అమెరికా నాటి అధ్యక్షుడు సీనియర్ జార్జి బుష్ ఆదేశాల మేరకు అమెరికా సైన్యం పనామాపై దండయాత్ర చేసి, పనామా సైన్యాలను ఓడించింది. పనామా అధ్యక్షుడు నోరియేగా తమ రాజధానిలోని వాటికన్ రాయబార కార్యాలయాన్ని శరణుజొచ్చారు. అయితే అంతిమంగా అమెరికా సైన్యానికి లొంగిపోక తప్పలేదు. అమెరికా దురాక్రమణ లక్ష్యం పనామాలో తమకు సానుకూలంగా ఉండే ప్రభుత్వాన్ని నెలకొల్పడమే. ఆ లక్ష్యం నెరవేరింది.

ట్రంప్ ప్రకటనలను నిశితంగా పరిశీలిస్తే వెనెజువెలాలోని అపార చమురు సంపదపై నియంత్రణ సాధించే లక్ష్య పరిపూర్తికి మదురో బాధితుడు అయ్యాడన్నది స్పష్టమవుతున్నది. ప్రపంచంలో మరే దేశంలోనూ లేనంతగా చమురు నిల్వలు వెనెజువెలాలో ఉన్నాయి. తన చమురును ప్రధానంగా చైనాకు ఎగుమతి చేస్తూ ఆ దేశం నుంచి ఆయుధాలు, విదేశీ పెట్టుబడులను వెనెజువెలా దిగుమతి చేసుకొంటున్నది. మరే ఇతర దేశమూ, మరీ ముఖ్యంగా రష్యా, చైనాలు వెనెజువెలా చమురు సంపదను స్వాయత్తం చేసుకోకుండా అడ్డుకునేందుకు అమెరికా కృతనిశ్చయంతో ఉన్నది. ఆ చమురు నిక్షేపాలు పూర్తిగా తన నియంత్రణలో ఉండాలని అమెరికా పట్టుదలతో ఉంది. మదురోను పట్టుకున్న అనంతరం ట్రంప్ విలేఖర్లతో మాట్లాడుతూ, వెనెజువెలాలో చమురును ఉత్పత్తి చేసి, విక్రయించేందుకు అమెరికా కార్పొరేట్ కంపెనీలకు అనుమతినిచ్చినట్టు వెల్లడించారు.

నికోలస్ మదురోను పట్టుకునేందుకు ఉద్దేశించిన నాలుగు గంటల 'ఆపరేషన్ అబ్సల్యూట్ రిజాల్వ్' అమెరికా సైనిక దళాల అపూర్వ శక్తి సామర్థ్యాలకు నిలువెత్తు నిదర్శనం. అధునాతన సాంకేతికతల తోడ్పాటుతో పటిష్ఠ ప్రణాళికతో అంతే దక్షతతో దానిని అమలుపరచడం ప్రపంచాన్ని అబ్బురపరిచింది. అర్ధరాత్రిపూట మరొక దేశంలోకి ప్రవేశించి, దేశాధ్యక్షుడిని బంధించి తీసుకురావడమనేది అమెరికా సేనలకు మాత్రమే సాధ్యమయ్యే పని. ప్రపంచ చరిత్రలో ఎప్పుడూ ఏ దేశానికీ లేని మహాశక్తిమంతమైన యుద్ధ యంత్రాంగం అమెరికాకే సొంతం. ఈ సైనికశక్తిని ఉపయోగించుకుని చైనా మినహా, మిగతా ప్రపంచ మంతటిపై పెత్తనం చెలాయించడానికి అమెరికా ఆరాటపడడం ఆందోళన కలిగిస్తున్న విషయమే.



> అమెరికా చరిత్రలోనే అత్యంత జోక్యందారీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్. ఏడాది కాలంగా ఆయన జోక్యం చేసుకున్న దేశాల జాబితాలో పాలస్తీనా, ఇరాన్, సిరియా, యెమెన్, నైజీరియా, తాజాగా వెనెజువెలా ఉన్నాయి. మదురో, ఆయన భార్య విపత్కర పరిస్థితికి మనం ఒక్క కన్నీటి బొట్టు కూడా కార్చకపోవచ్చు కానీ, సామ్రాజ్యవాదం పునర్విజృంభణ, జాతుల సార్వభౌమత్వం సమసిపోయే సంకటం ప్రపంచానికి వాటిల్లినందుకు మనం దుఃఖించాలి.

'ఆపరేషన్ అబ్సల్యూట్ రిజాల్వ్'కు పూర్వమూ, పిమ్మట భారత్ అనుసరించిన వైఖరి ఏమిటనేది ఎవరికీ పట్టలేదు! ట్రంప్ ఇప్పటికే ఆపరేషన్ సిందూర్ విషయంలోనూ, రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తున్న విషయంలోనూ ప్రధాని మోదీని చిన్నబుచ్చే విధంగా పలుమార్లు మాట్లాడారు. ట్రంప్ వైఖరికి భయపడుతున్న కారణంగానే, వెనెజువెలా విషయమై మోదీ సర్కార్ విడుదల చేసిన ప్రకటనలో మదురో అరెస్టును ఖండించనే లేదు. అసలు ఆ వ్యవహారంలో అమెరికా ప్రమేయాన్ని గురించి కూడా ప్రస్తావించనే లేదు. 'వెనెజువెలాలో 'ఇటీవలి పరిణామాల గురించి' ప్రస్తావిస్తూ 'అన్ని సమస్యలనూ సంబంధిత వ్యక్తులు చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని' ఆ ప్రకటన సూచించింది. ఫుట్‌బాల్ మ్యాచ్‌లో స్కోర్ విషయమై నెలకొన్న వివాదంపై పెద్దమనిషి తరహా సలహా ఇస్తున్నట్టుగా ఆ ప్రకటన ఉన్నది! చెప్పవచ్చినదేమిటంటే, విశ్వగురు అనే ఘనతలకు పోతున్న భారత్ ప్రపంచ వ్యవహారాలలో తన ప్రాధాన్యాన్ని కోల్పోయింది. 'ఇండియా ఏమి చెప్పినా అది ఎటువంటి ప్రభావాన్నీ చూపదు' అని భారత మాజీ రాయబారి ఒకరు నిష్కర్షగా వ్యాఖ్యానించడం గమనార్హం.

ట్రంప్ అమెరికా వలే, పుతిన్ రష్యా, కమ్యూనిస్టు చైనా సైతం ఇతర దేశాలను దురాక్రమించేందుకు సాహసించవచ్చు. అందుకు ఆ రెండు అగ్రరాజ్యాలను 'అబ్సల్యూట్ రిజాల్వ్' ప్రోద్బలిస్తుందని నేను విశ్వసిస్తున్నాను. డెన్మార్క్‌లో భాగమైన గ్రీన్‌లాండ్‌ను స్వాయత్తం చేసుకుంటామని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు సూచనప్రాయంగా చెప్పారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఒక కొలిక్కి రావడం అంటూ జరిగితే ఉక్రెయిన్ తప్పనిసరిగా తన భూభాగాలను రష్యాకు వదులుకోవల్సి ఉంటుంది. చైనా తన 'ఒకే చైనా' విధానాన్ని దాని తార్కిక పర్యవసానానికి తీసుకువెళ్లే అవకాశం ఎంతైనా ఉన్నది.

చైనా కనుక మరోసారి మన ఉత్తర సరిహద్దుల్లోకి లేదా అరుణాచల్‌ప్రదేశ్‌లోకి చొరబడిన పక్షంలో మనలను ఆదుకునేందుకు ఏ దేశమూ ముందుకురాదు. భారత్ తనను తానే రక్షించుకోవల్సి ఉంటుంది. వెనెజువెలా చమురు నిక్షేపాలపై నియంత్రణ సాధించిన అమెరికా, ఇప్పుడు భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపదు. వాణిజ్య ఒప్పందం లేకుండానే సుంకాలను పెంచుతూ, తగ్గిస్తూ అమెరికాకు భారత్ ఎగుమతులను ట్రంప్ ఏదో ఒక రీతిలో అనుమతిస్తాడు. ఏడాది క్రితం రెండవసారి అధికారంలోకి వచ్చిన డోనాల్డ్ ట్రంప్ అమెరికా చరిత్రలోనే అత్యంత జోక్యందారీ అధ్యక్షుడు. ఆయన జోక్యం చేసుకున్న దేశాల జాబితాలో గతంలో పాలస్తీనా, ఇరాన్, సిరియా, యెమెన్, నైజీరియా, తాజాగా వెనెజువెలా ఉన్నాయి. మదురో, ఆయన భార్య విపత్కర పరిస్థితికి మనం ఒక్క కన్నీటి బొట్టు కూడా కార్చకపోవచ్చు కానీ, సామ్రాజ్యవాదం పునర్విజృంభణ, జాతుల సార్వభౌమత్వం సమసిపోయే సంకటం ప్రపంచానికి వాటిల్లినందుకు మనం దుఃఖించాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

మహిళా ఓటర్లకు 'సర్' ఘాతం!

మహిళలకు ఓటుహక్కు అనేది ఒకనాడు విప్లవాత్మక భావన. ఇప్పుడు అది మహిళల ప్రాథమిక మానవ హక్కుగా పరిగణిస్తున్నారు. భారతీయ సమాజంలో సమస్త రాజకీయ కార్యకలాపాలలో మహిళలు భాగస్వాములుగా ఉన్నారు. స్వతంత్ర భారత సార్వత్రిక ఎన్నికల చరిత్రలో 2019 ఎన్నికలు ఒక 'నిశ్శబ్ద విప్లవం'గా పేరుపొందాయి. ఆ సార్వత్రిక ఎన్నికలలో ఓటువేసిన వయోజనులలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. రాజకీయ క్రియాశీలురుగా భారతీయ మహిళలు ముందంజ వేస్తోన్న ప్రస్తుత తరుణంలో ఓటర్ జాబితాల నుంచి మహిళా ఓటర్ల పేర్లను పెద్ద ఎత్తున తొలగించారు, ఇంకా తొలగిస్తున్నారు. ఏమిటీ వైరుధ్యం? వట్టి వైరుధ్యం మాత్రమే కాదు, అది చాలా క్రూర వైరుధ్యం, సందేహం లేదు. 21వ శతాబ్ది మూడో దశకంలో ఇదెలా సంభవించింది? అని భావి చరిత్రకారులు తప్పక నివ్వెరపోతారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇప్పటికే బిహార్‌లో ముగించిన, ప్రస్తుతం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలుపరుస్తున్న ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో ఈ కఠోర వాస్తవం, క్రూర వైరుధ్యం చోటుచేసుకుంటోంది.




■ యోగేంద్ర యాదవ్

రెండో దశ 'సర్'కు సంబంధించి ఉత్తరప్రదేశ్ మినహా, మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల గురించిన సమాచారం అందుబాటులో ఉన్నది. మహిళల భాగస్వామ్యంతో దశాబ్దాలుగా ఎన్నికలలో సాధించిన ప్రగతిశీల విజయాలు ఒక్కసారిగా తిరోగమనంలోకి మళ్లాయని ఆ సమాచారం విశదం చేస్తోంది. గత రెండు దశాబ్దాలుగా మహిళా ఓటర్ల నమోదులో గణనీయమైన మెరుగుదల, ఓటుహక్కు వినియోగించుకుంటున్న మహిళల సంఖ్యలో భారీ పెరుగుదల, మహిళా సమస్యలపై రాజకీయ పార్టీలు విశేష శ్రద్ధ చూపడం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ అద్భుత పురోగతిని పూర్తిగా వెనక్కినెట్టి, మహిళల ఓటింగ్ హక్కుల కోసం మళ్లీ ప్రాథమిక పోరాటం చేయవలసిన అగత్యం 'సర్'తో వాటిల్లనున్నది. భారతీయ మహిళా ఓటింగ్ ప్రభావశీలతకు చారిత్రకంగా రెండు అపకారాలు జరిగాయి, ఇంకా జరుగుతున్నాయి. వాటిలో ఒకటి ఆర్థికవేత్త, సామాజిక తాత్త్వికుడు అమర్త్యసేన్ గుర్తించిన 'తప్పిపోయిన ఆడపిల్ల' దృగ్విషయం. సహజ జనన రేటు ప్రకారం పుట్టవలసిన బాలికల సంఖ్య కంటే పుట్టిన బాలికల వాస్తవ సంఖ్య మధ్య పెద్ద వ్యత్యాసం ఉండడం. రెండోది ఓటుహక్కు ఉన్న మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉండడం. ఓటుహక్కుకు అర్హమైన వయస్సు వచ్చిన మహిళలు ఓటర్ జాబితాల్లో ఉండే అవకాశాలు పరిమితంగా ఉండడం. ఇప్పుడు 'సర్' కారణంగా భారతీయ మహిళలకు మూడో అపకారం వాటిల్లుతోంది. ఇప్పటికే ఓటర్ జాబితాలలో ఉన్న మహిళల పేర్లను పెద్ద ఎత్తున తొలగించడం, తొలగించనుండడమే ఈ మూడో అపకారం. పెద్ద ఎత్తున మహిళలు తమ ఓటుహక్కును కోల్పోవడమనేది స్వతంత్ర భారతదేశం ఇంతకు ముందెన్నడూ చూడలేదనడం ఎంతమాత్రం సత్యదూరం కాదు.

సంభవించనున్న ఈ క్రూర పరిణామానికి సూచనలు బిహార్ 'సర్'లోనే స్పష్టంగా కనిపించాయి. 'సర్'కు ముందు బిహార్‌లో జెండర్ నిష్పత్తి (జనాభాలో పురుషుల సంఖ్యను స్త్రీల సంఖ్యతో పోల్చడం) ఇలా ఉంది: ప్రతి 1000 మంది పురుషులకు 932 మంది స్త్రీలు మాత్రమే ఉన్నారు. ఓటర్ల జాబితాలో ఈ నిష్పత్తి మరింత తక్కువగా ఉన్నది. ప్రతి 1000 మంది పురుష ఓటర్లకు మహిళా ఓటర్లు 914 మంది మాత్రమే ఉన్నారు. అంటే జనాభాలో తమ వాటా కంటే తక్కువగా ఉన్నారు. జనాభాలో ఉన్న వాటా ఓటర్ల జాబితాలో ప్రతిబింబించి ఉన్నట్టయితే మహిళా ఓటర్ల సంఖ్య 7 లక్షల మేరకు అధికంగా ఉండేది. 'సర్' అనంతరం బిహార్ ఓటర్ల తుది జాబితాలో జెండర్ నిష్పత్తి మరింతగా తగ్గిపోయింది. ప్రతి 1000 మంది పురుష ఓటర్లకు మహిళా ఓటర్లు 890 మంది మాత్రమే ఉన్నారు! మరింత స్పష్టంగా చెప్పాలంటే 'తప్పిపోయిన మహిళా ఓటర్ల' సంఖ్య 7 లక్షల నుంచి 16 లక్షలకు పెరిగింది. బిహార్‌లో ఒక దశాబ్ద కాలంలో జెండర్ నిష్పత్తిలో నమోదైన పెరుగుదల 'సర్'తో తుడిచిపెట్టుకుపోయింది. ఈ తిరోగతి, రాజకీయ భాగస్వామ్యంలో మహిళలు సాధించిన పురోగతి పూర్తిగా నిరర్థకమైపోవడమే కాదూ?

బిహార్‌లో మహిళా ఓటర్ల నమోదులో అవకతవకలు జరిగాయని రెండో దశ 'సర్' సమాచారం ధ్రువీకరిస్తోంది. ఓటర్ల జాబితాలో జెండర్ నిష్పత్తి పడిపోయేందుకు 'సర్' దారితీసిందనేది స్పష్టం. 'సర్' ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు– రెండో దశ ఆరు రాష్ట్రాల ఓటర్ల జాబితాలలో ప్రతి 1000 మంది పురుషులకు సగటున 979 మంది స్త్రీలు ఉన్నారు. వయోజన జనాభాలో మహిళాల వాటా 985. అంటే ఓటర్ల జాబితాలో స్త్రీల సంఖ్య కొంచెం తక్కువగా ఉన్నది. 'సర్' చూపిన ప్రభావం ఏమిటో చూద్దాం. ముసాయిదా ఓటర్ల జాబితాలో జెండర్ నిష్పత్తి 963కు తగ్గిపోయింది. అంటే ప్రతి 1000 మంది పురుష ఓటర్లకు 963 మంది స్త్రీ ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఈ నిష్పత్తిని సంఖ్యల్లోకి మార్చితే 'తప్పిపోయిన మహిళా ఓటర్లు' అదనంగా 23 లక్షల మంది ఉన్నారని విశదమవుతుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే 'సర్ తొలగింపులు పురుష, మహిళా ఓటర్ల విషయంలో సమరీతిలో ఉన్నట్టయితే ముసాయిదా ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్ల సంఖ్య 23 లక్షల మేరకు అధికంగా ఉండేది.



ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు సంబంధించి జెండర్ వారీగా సమాచారం ఇంకా అందుబాటులో లేదు. ఆ రాష్ట్రాల సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే 'తప్పిపోయిన మహిళా ఓటర్ల' సంఖ్య, బహుశా మరింత అధికంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఇవేగాక, రెండో దశ 'సర్' అమలయిన మిగతా రాష్ట్రాలలో తమిళనాడు, కేరళ కూడా ఉన్నాయి. జెండర్ నిష్పత్తి మెరుగ్గా ఉండే రాష్ట్రాలవి. అంతేకాదు, ఈ రెండు రాష్ట్రాలలోనూ ఓటర్ల జాబితాలో మహిళల సంఖ్య పురుషుల కంటే అధికంగా ఉండడం కూడా పరిపాటి. అయినా 'సర్' లెక్కల్లో ఈ రెండు రాష్ట్రాలలోనూ జెండర్ నిష్పత్తి తగ్గుదలకు దారితీసింది! ఆ తగ్గుదల తమిళనాడులో 2 పాయింట్లు (రెండు శాతాల మధ్య వ్యత్యాసం)గాను, కేరళలో 14 పాయింట్లుగాను ఉన్నది. ఇతర రాష్ట్రాలలో పరిస్థితి మరింత ఘోరంగా ఉన్నది. ఆ రాష్ట్రాలు ప్రతి ఒక్కదానిలోను సగటున జెండర్ నిష్పత్తి తగ్గుదల 15 పాయింట్ల కంటే ఎక్కువగా ఉన్నది! మరింత స్పష్టంగా చెప్పాలంటే 'సర్ ప్రక్రియ ఇప్పటికే గుజరాత్‌లో 6 లక్షల మంది మహిళలకు ఓటు హక్కు నిరాకరించింది. రాజస్థాన్, బెంగాల్లో ఓటుహక్కు తొలగింపునకు బాధితులైన మహిళల సంఖ్య అయిదు లక్షల పైచిలుకు చొప్పున ఉన్నది. మధ్యప్రదేశ్‌లో ఇంచుమించు అయిదు లక్షలమంది మహిళలకు ఓటుహక్కును నిరాకరించారు.

> మహిళా ఓటర్ల నమోదు ప్రతి దశలోను జెండర్ నిష్పత్తిని నిశితంగా గమనంలోకి తీసుకోవాలని, ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేయాలని, స్త్రీ–పురుష ఓటర్ల నిష్పత్తిలో ఏమైనా అసమతౌల్యత ఉంటే దాన్ని తొలగించేందుకు మహిళా బీఎల్ఓలను నియమించాలని భారత ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. నియమాలు, పద్ధతులు ఇంత స్పష్టంగా ఉన్నా ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం మహిళా ఓటర్ల ప్రత్యేక సమగ్ర తొలగింపు ప్రక్రియగా ఎలా మారిపోయింది?

బిహార్‌లో వలే ఈ రాష్ట్రాలలో కూడా ఎన్నికలలో మహిళల భాగస్వామ్యం విషయంలో దశాబ్దాలుగా సాధించిన పురోగతిని 'సర్ నిరర్థకం చేసిందని చెప్పక తప్పదు. మధ్యప్రదేశ్‌నే తీసుకోండి. 2009లో ఆ రాష్ట్ర ఓటర్ల జాబితాలో జెండర్ నిష్పత్తి చాలా తక్కువగా ఉండేది. ప్రతి 1000 మంది పురుషులకు 887మంది మహిళలు మాత్రమే ఉండేవారు. ఈసీఐ కృషి కారణంగా ఆ తరువాత జరిగిన ప్రతి (ఓటరల్ జాబితా) సవరణలోనూ జెండర్ నిష్పత్తి పెరుగుతూ వస్తోంది. గత ఏడాది ఆ నిష్పత్తి 950గా ఉన్నది. రాష్ట్ర వయోజన జనాభాలో స్త్రీ–పురుష నిష్పత్తికి అది దాదాపు సరిసమానంగా ఉన్నది. ఇప్పుడు 'సర్' ముసాయిదా ఓటర్ల జాబితాలో జెండర్ నిష్పత్తి 933కు తగ్గిపోయింది!

ఇందులో ఆశ్చర్యపోవల్సిందేమీ అంతగా లేదు. లోపభూయిష్ఠమైన రూపకల్పన కారణంగా 'సర్' మహిళా ఓటర్లకు అననుకూలంగా అమలయింది. ప్రతి ఓటరు కచ్చితమైన గడువులోగా ఫొటోగ్రాఫ్‌తో సహా కొత్త ఎన్యూమరేషన్ ఫామ్‌ను సమర్పించవలసి ఉన్నది. పరిపాలనా ఓటు హక్కు రద్దు (Administrative Disenfranchisement– అర్హత కలిగిన పౌరులు ఓటు వేయడం కష్టతరం లేదా అసాధ్యం చేసే పద్ధతులను పరిపాలనా ఓటుహక్కు రద్దు అంటారు)కు ఇదొక ప్రామాణిక తార్కాణం. ఈ పద్ధతి మహిళా ఓటర్లకు ప్రతికూలంగా పరిణమించింది. 'ఆబ్సెంట్/షిఫ్టెడ్' (గైర్హాజరు/ వేరే ప్రదేశాలకు వెళ్లినవారు) కారణాల ప్రాతిపదికన మహిళలను గణనీయమైన సంఖ్యలో ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. గమనార్హమైన వాస్తవమేమిటంటే ఇలా తొలగింపునకు గురైన మహిళలలో అత్యధికులు వివాహితలు. సహజంగానే వీరు పుట్టింట ఉండరు. ఈ కారణంగా పుట్టింటి ప్రదేశాల ఓటర్ జాబితాల నుంచి వారి పేర్లను తొలగించారు. అయితే మెట్టినిల్లు ప్రదేశాలకు చెందిన ఓటర్ జాబితాల్లో వారి పేర్లు చేర్చలేదు! ఇంతేనా? ముసాయిదా జాబితాలోని మహిళలు రెండు దశాబ్దాల క్రితం నాటి పాత ఓటర్ల జాబితాలోని తమ తల్లిదండ్రుల పేర్లతో తమను అనుసంధానించుకుని, తమ అర్హతను నిర్ధారించాలి (ఇందుకు అత్తమామల పేర్లను అంగీకరించరు). ఇది వివాహిత మహిళల పట్ల వివక్ష చూపడంకాక మరేమిటి?

మన భావి చరిత్రకారులు ఈ 'సర్ సమాచారాన్ని నిశితంగా పరిశీలించే క్రమంలో ఓటర్ జాబితాల విషయమై ఈసీఐ మాన్యువల్‌ను తప్పక చూస్తారు. మహిళా ఓటర్ల నమోదు విషయంలో ఈసీఐ నిర్దేశించిన నియమాలు, ప్రక్రియా వ్యవహార పద్ధతులు ఎంత సున్నితమైనవిగా ఉన్నాయో గమనించి తప్పక ఆశ్చర్యపోతారు. నమోదు ప్రక్రియ ప్రతి దశలోనూ జెండర్ నిష్పత్తిని నిశితంగా గమనంలోకి తీసుకోవాలని ఈసీఐ మాన్యువల్ నిర్దేశించింది. ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేయాలని, జెండర్ నిష్పత్తిలో ఏమైనా అసమతౌల్యత ఉంటే దాన్ని తొలగించేందుకు మహిళా బీఎల్ఓ (పోలింగ్ బూత్ స్థాయి అధికారి)లను నియమించాలని కూడా స్పష్టం చేసింది. నియమాలు, పద్ధతులు ఇంత స్పష్టంగా ఉన్నా ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)... అమలులో మాత్రం, మహిళా ఓటర్ల ప్రత్యేక సమగ్ర తొలగింపు ప్రక్రియగా ఎలా మారిపోయిందని భావి చరిత్రకారులు తప్పక ఆశ్చర్యపోతారు.

(రాహుల్‌శాస్త్రి సహకారంతో)

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

బ్రిటిష్ వారిని వణికించిన రేనాటి గెరిల్లా యోధుడు

భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రను పరిశీలిస్తే, అడుగడుగునా మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలర్పించిన వీరుల గాథలు కనిపిస్తాయి. 1857 సిపాయిల తిరుగుబాటుకు దశాబ్దం ముందే బ్రిటిష్ సామ్రాజ్యవాద పునాదులను వణికించిన మహోజ్వల విప్లవం తెలుగుగడ్డపై ఉద్భవించింది. ఆ విప్లవానికి అసమానమైన ఊపిరి పోసి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యానికి వెన్నెముకలా నిలిచిన సర్వసైన్యాధ్యక్షుడే వడ్డే ఓబన్న. ఆయన సాగించిన అలుపెరగని పోరాటం, చారిత్రక నేపథ్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకం.

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశపెట్టిన శాశ్వత భూమి శిస్తు విధానం రాయలసీమ ప్రాంతంలో తీవ్ర అశాంతికి దారితీసింది. అంతకుముందు విజయనగర సామ్రాజ్య కాలం నుంచి స్థానిక పాలకులుగా ఉన్న పాలెగాళ్ల వ్యవస్థను బ్రిటిష్ వారు క్రమంగా రద్దు చేశారు. నిజాం నవాబు నుంచి దత్త మండలాలుగా (సీడెడ్ జిల్లాలు) ఈ ప్రాంతం ఆంగ్లేయుల పరమైన తర్వాత, వారు ఇక్కడి సామాజిక, ఆర్థిక నిర్మితిని పూర్తిగా విచ్ఛిన్నం చేశారు. అప్పటి వరకు గౌరవప్రదమైన హోదాలో ఉన్న పాలెగాళ్లకు నామమాత్రపు భరణం ఇస్తూ, వారి భూములను, అధికారాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి కేవలం 11 రూపాయల భరణం నిర్ణయించడం బ్రిటిష్ వారి అహంకారానికి నిదర్శనం. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు పండకపోయినా, పన్నుల వసూళ్లలో ఆంగ్లేయులు ప్రదర్శించిన నిర్బంధం చివరకు తిరుగుబాటు అగ్నిని రాజేసింది. నిర్లక్ష్యానికి గురైన అడవి బిడ్డలను, కులవృత్తుల వారిని ఏకం చేసి, ఓబన్న ఒక అజేయమైన ప్రజా సైన్యాన్ని సిద్ధం చేశారు.



నంద్యాల జిల్లా సంజామల గడ్డపై 1807 జనవరి 11న జన్మించారు ఓబన్న. వడ్డే సుబ్బమ్మ, సుబ్బయ్య దంపతుల సంతానంగా చిన్నతనం నుంచే సాహసోపేతమైన విద్యల్లో నిష్ణాతులయ్యారు. సుబ్బయ్య.. తలారి(విలేజ్ గార్డ్)గా పని చేయడం వల్ల గ్రామీణ రక్షణ వ్యవస్థ, భౌగోళిక పరిస్థితులపై ఓబన్నకు అపారమైన పట్టు ఉండేది. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి అత్యంత నమ్మకస్తుడైన ఓబన్న, కేవలం అనుచరుడిగా కాకుండా ఒక శక్తిమంతమైన సైన్యాన్ని నిర్మించిన దళపతిగా ఎదిగారు. వడ్డెరలు, బోయలు, చెంచులతో కూడిన ఈ సైన్యం నల్లమల అడవులను కేంద్రంగా చేసుకుని బ్రిటిష్ బలగాలను ముప్పుతిప్పలు పెట్టింది. అడవిని తన ఆయుధంగా మార్చుకున్న ఓబన్న, శత్రువుకు నీడ కూడా దొరకని రీతిలో మెరుపు దాడులను రూపొందిస్తూ ఆంగ్లేయుల వ్యూహాలను చిత్తు చేశారు.

ఓబన్న వ్యూహరచనలో అత్యంత ప్రధానమైనది గెరిల్లా యుద్ధం. ప్రతికూల పరిస్థితుల్లో కూడా శత్రువుపై మెరుపుదాడులు చేయడం, వారి రవాణా మార్గాలను, కమ్యూనికేషన్ వ్యవస్థను దెబ్బతీయడంలో ఆయన అసాధారణ ప్రతిభ ప్రదర్శించారు. 1846 జూలై 10న కోవెలకుంట్ల సబ్ ట్రెజరీపై జరిగిన దాడి బ్రిటిష్ పాలకులను దిగ్భ్రాంతికి గురిచేయడమే కాక, వారిలో వణుకు పుట్టించింది. ఈ దాడి వల్ల ఆంగ్లేయుల ఆర్థిక మూలాలు దెబ్బతిన్నాయి. నల్లమల అడవుల అంచున ఉన్న కొండలు, వాగులను ఓబన్న తన సైన్యానికి అభేద్యమైన రక్షణ కవచాలుగా మార్చుకున్నారు. ఆధునిక తుపాకుల గర్జనల మధ్య, సంప్రదాయ ఆయుధాలతో ఆయన సైన్యం సాగించిన సమరం బ్రిటిష్ బలగాల్లో వణుకు పుట్టించింది. బ్రిటిష్ ప్రభుత్వం ఓబన్న, నరసింహారెడ్డిలను బంధించడానికి కట్టుదిట్టమైన పన్నాగం పన్నింది. 1846 అక్టోబర్ 6న నంద్యాల జిల్లా సంజామల మండలం గిద్దలూరు సమీపంలోని జగన్నాథకొండ వద్ద భీకర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఓబన్న అసాధారణ ధైర్యసాహసాలను ప్రదర్శించారు. కానీ, 39 ఏళ్ల ప్రాయంలోనే వీరమరణం పొందారు. ఆయన మరణం నరసింహారెడ్డి సైన్యానికి కోలుకోలేని దెబ్బ అయింది. ఆ తర్వాత నరసింహారెడ్డిని బంధించిన బ్రిటిష్‌వారు, ప్రజల్లో భయాన్ని నింపడానికి 1847 ఫిబ్రవరి 22న కోవెలకుంట్ల వద్ద రెండువేల మంది ప్రజల సమక్షంలో బహిరంగంగా ఉరితీశారు. కానీ, ఓబన్న రగిల్చిన విప్లవజ్వాల భావి స్వాతంత్ర్య సమరానికి బాటలు వేసింది.

దురదృష్టవశాత్తు, భారత స్వాతంత్ర్య చరిత్ర పుటల్లో వడ్డే ఓబన్న వంటి వీరులకు లభించాల్సిన ప్రాముఖ్యం చాలాకాలం పాటు లభించలేదు. జాతీయ స్థాయిలో చరిత్రకారులు అధికంగా ఉత్తర భారత తిరుగుబాట్లకే ప్రాధాన్యమివ్వడం వల్ల, దక్షిణాదిలో ముఖ్యంగా తెలుగునేలపై జరిగిన ఈ తొలి విప్లవం మరుగున పడిపోయింది. ఇటీవలి కాలంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం స్వాగతించదగ్గ పరిణామం. అయితే, ఇది కేవలం ఉత్సవాలకే పరిమితం కాకూడదు. డిజిటల్ ఆర్కైవ్స్ స్థాపన, ప్రత్యేక మ్యూజియంల ఏర్పాటు, విశ్వవిద్యాలయాలలో పరిశోధక పీఠాలను నెలకొల్పడం ద్వారా ఓబన్న పాత్రను ప్రామాణికంగా గుర్తించి, భవిష్యత్ తరాలకు ఈ వీరగాథను అందించాలి. తద్వారా భావితరాల్లో దేశభక్తిని, చారిత్రక స్పృహను పెంపొందించాలి.

● బొంతల తిరుపతి

(జనవరి 11: వడ్డే ఓబన్న జయంతి)

స్వభావం, సాహసం అలిశెట్టి బలాలు


శ్రామిక పెత్తనం ద్వారా వ్యవస్థలోని దోపిడీని రూపుమాపితేనే అందరి బతుకులు బాగుపడతాయని నమ్మి, ఆ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని వెచ్చించిన అమర కవి అలిశెట్టి ప్రభాకర్. 1954, జనవరి 12న పుట్టి, 1993లో అదే తేదీనాడు మరణించిన అలిశెట్టి బతికింది 39 ఏళ్లే. 19వ ఏట కలం పట్టిన ఆయన, మిగతా 20 ఏళ్లపాటు కవిత్వమే జీవిత పరమార్థంగా గడిపారు. ఆర్థిక ఇబ్బందులొచ్చాయి, ఆరోగ్యం దెబ్బతిన్నది, ఆస్తులు కరిగిపోయాయి.



ఇవేవీ ఆయన రచనా సంకల్పాన్ని చెదరగొట్టకపోగా కవిత్వాన్ని మరింత రాటుదేల్చాయి. తన జీవన కాంక్షను, బతుకు ఆటుపోట్లను కవిత్వంలో బలంగా చెప్పడం ద్వారా ఆయన అక్షరాలు పాఠకుల హృదయాలను సూటిగా తాకాయి. స్వతహాగా అలిశెట్టి సాహసి. వ్యక్తిగత సమస్యల విషయంలో ఎదురయ్యే పర్యవసానాల పట్ల ఎప్పుడూ జంకలేదు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన సిటీ లైఫ్ కవితా శీర్షిక వల్ల చేతికందే పారితోషికమే చివరికాలపు జీవనాధారమైంది. నిలదీసేలా కవిత్వం రాయడానికి ఎంతో నిజాయితీ గల పటిష్ఠ పునాది కావాలి. అది అలిశెట్టి ప్రభాకర్‌కు ఉంది.

– బద్రి నర్సన్

(జనవరి 12: అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి)





- బోర్డు ఆమోదం.. త్వరలో ప్రారంభ తేది ప్రకటన
- బాపట్ల,న్యూ గుంటూరు, తెనాలిలో నిలుపుదల సౌకర్యం

అందుబాటులోకి.. రెగ్యులర్ వీక్లీ రైలు

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులకు శుభవార్త. త్వరలో రెగ్యులర్ వీక్లీ రైలు అందుబాటులోకి రానున్నది. బాపట్ల, తెనాలి, న్యూగుంటూరు రైల్వేస్టేషన్ల మీదగా ఈ రైలు రాకపోకలు సాగించనుంది. ఈ మేరకు రైల్వేబోర్డు శుక్రవారం ఆమోదం తెలిపింది. సాధ్యమైనంత త్వరగా సర్వీసు ప్రారంభ తేదీని ప్రకటించాలని ఈస్టు కోస్టు రైల్వేని ఆదేశించింది. ఇటీవలే తిరుపతి - సాయినగర్ షిర్డీ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ని మంజూరు చేసిన రైల్వేబోర్డు ఇప్పుడు మరో రైలుని మంజూరు చేయడంపై రైల్వే వినియోగదారుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్ఎంవీటీ బెంగళూరు - రాధికపూర్ మధ్య రాకపోకలు సాగించే ఈ ఎక్స్‌ప్రెస్‌తో గుంటూరు, తెనాలి, బాపట్ల ప్రజలకు రైలు కనెక్టివిటీ కలుగుతుంది.

- నంబరు.16223 ఎస్ఎంవీటి బెంగళూరు - రాధికపూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ని ప్రతీ గురువారం నడుపుతారు. గురువారం మధ్యాహ్నం 1.50కి బయలుదేరి కృష్ణరాజపురం, బంగారపేట, కుప్పం, జోలార్‌పెట్టాయి, కాట్పాడి, ఆర్కోణం, సూళ్లూరుపేట, నాయుడుపేట, నెల్లూరు, బాపట్ల, తెనాలి, న్యూగుంటూరు, విజయవాడ, రాజమండ్రి పలు స్టేషన్ల మీదగా రాధికపూర్‌కు శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంటుంది. 16224 రాధికపూర్ - ఎస్ఎంవీటీ బెంగళూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ ఆదివారం రాత్రి 9.30కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై మంగళవారం రాత్రి 8.45కి ఎస్ఎంవీటీ బెంగళూరుకు చేరుకుంటుంది.

చీరాల, తెనాలి మీదగా మరో రెండు రైళ్లు

- నంబరు.16523 ఎస్ఎంవీటీ బెంగళూరు - బలుర్‌ఘాట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం ఉదయం 10.15 గంటలకు బయలుదేరి కృష్ణరాజపురం, బంగారపేట, కుప్పం, జోలార్‌పెట్టాయి, కాట్పాడి, నాయుడుపేట, నెల్లూరు, తెనాలి, విజయవాడ, రాజమండ్రి మీదగా శుక్రవారం వేకువజామున 4.15కి బలుర్‌ఘాట్‌కు చేరుకుంటుంది. 16524 బలుర్‌ఘాట్-ఎస్ఎంవీటీ బెంగళూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ శనివారం వేకువజామున 5.15కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై సోమవారం వేకువజామున 3 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుంది.

రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లు

- నంబరు.16107 తాంబరం - సంత్రగచి వీక్లీ అమృత్ భారత్ రైలు ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం 3.30కి బయలుదేరి చెన్నైఎగ్మోర్ సూళ్లూరుపేట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, రాజమండ్రి మీదగా శనివారం రాత్రి 8.15కి సంత్రగచి చేరుకుంటుంది. 16108 సంత్రగచి - తాంబరం వీక్లీ అమృత్ భారత్ రైలు ప్రతీ శనివారం రాత్రి 11.55కి బయలుదేని పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా సోమవారం ఉదయం 10 గంటలకు తాంబరం చేరుకుంటుంది.
- నంబరు.16597 ఎస్ఎంవీటీ బెంగళూరు - అలీపూర్ దౌర్ వీక్లీ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ శనివారం ఉదయం 8.50కి బయలుదేరి చీరాల, తెనాలి మీదగా సోమవారం ఉదయం 10.25కి అలీపూర్ దౌర్‌కు చేరుకుంటుంది. 16598 అలీపూర్ దౌర్ - ఎస్ఎంవీటీ బెంగళూరు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారం రాత్రి 10.25కి బయలుదేరి తెనాలి, చీరాల మీదగా గురువారం వేకువజామున 3 గంటలకు ఎస్ఎంవీటీ బెంగళూరు చేరుకుంటుంది.



గంగిరెద్దు ఆట



బొమ్మల కొలువు



సంక్రాంతి.. సందడి

- విద్యా సంస్థల్లో ముందస్తు సంబరాలు
- నేటి నుంచి విద్యా సంస్థలకు సెలవులు
- ప్రయాణికులతో రద్దీగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు



(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

సంతోషాల సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. ముందస్తు సంక్రాంతితో విద్యా సంస్థల ప్రాంగణాలు హోరెత్తాయి. భోగిమంటలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. బొమ్మల కొలువులు.. ముగ్గుల పోటీలు.. కోడిపందేలు.. పిండి వంటల ప్రదర్శనలతో పల్లెలు, పట్టణాల్లో ముందస్తుగానే వేడుకలు జరుగుతున్నాయి. ఇక వివిధ గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాలు కూడా సంక్రాంతికి అప్పుడే ముస్తాబయ్యాయి. పల్లెల్లో సంక్రాంతి వేడుకలు మొదలయ్యాయి. ఎద్దుల పందేలు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. దీంతో పోటీలకు వచ్చిన వారు.. వాటిని తిలకించేందుకు వచ్చిన వారితో పల్లెల్లో సందడి నెలకొంది. విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంస్కృతిని తెలియజేసే రీతిలో వేడుకలు జరిపారు. భోగి మంటలు, పిల్లలపై భోగి పళ్లు, రంగ వల్లులు, తెలుగు దనం ఉట్టిపడేలా వస్త్రధారణలో విద్యార్థుల ప్రదర్శనలతో అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని నృత్యాలతో అదరగొట్టారు. సంక్రాంతి ఎలా జరుపుకోవాలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో కళ్లకు కట్టినట్లు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ముందస్తుగా నిర్వహించారు.

ప్రయాణ కష్టాలు..

విద్యాసంస్థలకు శనివారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించారు. విద్యార్థులు హాస్టళ్ల నుంచి స్వగ్రామాలకు పయనమయ్యారు. సెలవుల ప్రకటనతో పెద్ద పండుగ సంక్రాంతికి పట్టణాల నుంచి పిల్లాపాపలతో అందరూ పల్లెలకు బయల్దేరారు. దీంతో శుక్రవారం బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు రద్దీగా మారాయి. కాగా రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. చాలీచాలని బస్సులతో ప్రయాణ కష్టాలను ఎదుర్కొన్నారు. చిన్నారులు.. వృద్ధులు సొంత గ్రామాలకు చేరుకునేందుకు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు.



బీఆర్ స్టేడియానికి మోక్షం

- అభివృద్ధికి రూ.14 కోట్ల మంజూరు
- ఏపీ ప్రతిపాదనకు స్పందించిన కేంద్రం
- తదుపరి నిర్మాణాలకు దశల వారీగా నిధులు



గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధికి ఎట్టకేలకు మోక్షం లభించింది. అతి పెద్ద స్టేడియమైనా అభివృద్ధిపై పాలకులు పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల కల్పనకు రూ.170 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదించింది. ఈ క్రమంలో ఖేలో ఇండియా పథకం కింద బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో 60 మీ/40 మీ/12.5 మీ.ల మల్టీ-స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.14 కోట్లు కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ గురువారం మంజూరు చేసింది. తదుపరి నిర్మాణాలకు దశల వారీగా నిధులను సేకరిస్తామని తెలిపింది.

నిధుల మంజూరుకు పెమ్మసాని కృషి

బీఆర్ స్టేడియంపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు. తద్వారా స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తానని ఎన్నికల ప్రచారంలో ఆయనిచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ నిధుల ద్వారా గుంటూరులో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన క్రీడా వసతులు అందుబాటులోకి రానున్నాయని పెమ్మసాని తెలిపారు. క్రీడల్లో గుంటూరును ప్రోత్సహిస్తూ సహకరిస్తున్న ప్రధాని మోదీ, క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

సరస్‌మైన ధరలు.. నోరూరించే రుచులు





స్టాల్స్‌లో కొనుగోలు చేస్తున్న దృశ్యం

గుంటూరు సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని నల్లపాడు రెడ్డి కళాశాల సమీపంలో జరుగుతున్న సరస్ మేళాకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. శుక్రవారం నగర ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఈ అఖిలభారత డ్వాక్రా బజారును సందర్శించి వస్తువులు కొనుగోలు చేసి.. ప్రత్యేక ఆహార పదార్థాలను రుచి చూశారు. దేశవ్యాప్తంగా హ్యాండీక్రాఫ్ట్, వస్త్రాలు, ఆయుర్వేద మందులు, నాచురల్ ఫుడ్ ఐటమ్స్, మెటల్, డెకర్ వస్తువులు సరసమైన ధరలకు లభిస్తున్నాయి. ఈ మేళాలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆట వస్తువులతో వినోద పార్కును ఏర్పాటు చేశారు. అలాగే మనసు మురిపించే వంటలు.. దేశంలోని వివిధ ప్రాంతాల రుచులు అప్పటికప్పుడే.. అందిస్తున్న ఫుడ్‌కోర్టులు కిటకిటలాడుతున్నాయి. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ.. నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.



సరస్ మేళాలో సాంస్కృతిక కార్యక్రమాలు



అమరావతి రాజధానిపై జగన్ ద్వంద్వ వైఖరి: ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల రాజధాని అమరావతిపై జగన్ ద్వంద్వ వైఖరిని రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఆంధ్రుల రాజధాని అమరావతిని సోలార్ క్యాపిటల్ అంటూ అవాస్తవాలు జగన్ ప్రచారం చేస్తున్నారన్నారు. అమరావతికి ప్రజలందరి ఆమోదంతోనే త్వరలో చట్టబద్ధత కలుగుతుందన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపజేసేలా ప్రయత్నాలు జరుగుతున్న వేళ జగన్ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతూ రైతులను భయపెట్టేలా తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

12న ఐటీఐలో అప్రంటీస్ మేళా

తెనాలి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12న అప్రంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రావి చినవెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు బయోడేటా, సర్టిఫికెట్లతో జగ్గడిగుంటపాలెంలోని ప్రాంగణంలో జరిగే మేళాలో పాల్గొనాలని తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య

రేపు ఉపకార వేతనాల పంపిణీ

గుంటూరు(విద్య), జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేయనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య తెలిపారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, నర్సింగ్, ఎంబీబీఎస్ విద్యార్థులకు రూ.10వేల నుంచి రూ.17వేల వరకు ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు. కమిటీ సభ్యుడు బొప్పన ద్వారకప్రసాద్ మాట్లాడుతూ 440మంది విద్యార్థులకు రూ.61 లక్షలు ఉపకార వేతనాలుగా అందిస్తామని పేర్కొన్నారు. డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ వీసీ నామినేని కోటేశ్వరరావు, వడ్లమూడి గోవర్ధనరావు, రామారావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆహ్వాన నాటిక పోటీలు

పిరంగిపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగుపాడులో అభినయ నాటక పరిషత్ ఆధ్వర్యంలో 20వ తెలుగురాష్ట్రాల ఆహ్వాననాటిక పోటీలు ఈ నెల 11నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని పరిషత్ వ్యవస్థాపకుడు ప్రసాద్ శుక్రవారం తెలిపారు. గద్దె వెంకటేశ్వర్లు స్మారక కళావేదిక శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పోటీలను ప్రారంభిస్తారన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, నాటక కళా పరిషత్ అధ్యక్షుడు వంకాయలపాటి బల రామకృష్ణయ్య పాల్గొంటారని చెప్పారు.

జగన్ అధికారంలో ఉంటే అరాచకం.. లేకుంటే విధ్వంసం

● పిల్లి మాణిక్యరావు, మేయర్ రవీంద్ర

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జగన్ అధికారంలో ఉంటే అరాచకం.. లేకపోతే విధ్వంసం అని నిరూపించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు దుయ్యబట్టారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమరావతి నిర్మాణం రాజ్యాంగబద్ధంగా లేదనడం జగన్‌రెడ్డికి పూర్తిగా మతిభ్రమించిందని అర్థమవుతోందన్నారు. అమరావతి రాజధాని నదీగర్భంలో నిర్మిస్తున్నారని పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారన్నారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ పార్లమెంట్ శీతాకాల సమావేశంలో అమరావతికి రాజధానిగా చట్టభద్దత కల్పిస్తారని తెలిసి జగన్ రెడ్డికి నిద్ర పట్టడం లేదన్నారు.

చలపతిలో ఘనంగా ముందస్తు సంక్రాంతి

తాడికొండ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు ప్రారంభించారు. భోగిమంటలు వేసి విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించి, 40 అడుగుల ప్రభను ఏర్పాటు చేశారు. వైవీ ఆంజనేయులు దంపతులు పూజలు నిర్వహించారు. క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్ డి.వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ కె.నాగ శ్రీనివాసరావు, కె.కిరణ్‌కుమార్, బాలమురళి కృష్ణ పాల్గొన్నారు.



మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో పూజలు చేస్తున్న వై.వి.ఆంజనేయులు

ఏఎన్‌యూలో ఇండోనేషియా శాస్త్రవేత్తల బృందం

ఏఎన్‌యూ జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫారెస్ట్రీ విభాగాన్ని ఇండోనేషియా శాస్త్రవేత్తల బృందం శుక్రవారం సందర్శించింది. నేషనల్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఏజెన్సీ (బీఆర్ఐఎం)లోని రీసెర్చ్ సెంటర్ ఫర్ బయోమాస్ ప్రొఫెసర్ విద్యా ఫాత్రియాసారి, ఎస్ఆర్ఎం, అమరావతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ సైన్సెస్ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్.రంగభాసియం పాల్గొన్నారు. ఏఎన్‌యూ వీసీ కె. గంగాధరరావుని వారు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ భేటీలో వ్యర్థాల నిర్వహణ, బయో వ్యర్థాల సమర్థ వినియోగంపై చర్చించారు. సంయుక్త పరిశోధనలపై వీసీ ఈ సందర్భంగా ఆసక్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు. ఫాత్రియాసారి మాట్లాడుతూ.. వరి గడ్డి వ్యర్థాల నుంచి హైడ్రోఫోబిక్ పదార్థాల తయారీ, వాటిని వైద్య రంగంలో వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ అంశాలను వివరించారు. డాక్టర్ ఎస్. రంగభాసియం వ్యర్థాల నుంచి ఉష్ణ నిరోధక ఉత్పత్తులను తయారు చేసే ఆధునిక సాంకేతిక విధానాలను తెలిపారు. అధ్యాపకులు, ఫారెస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.మల్లికార్జున పాల్గొన్నారు. అలాగే ఏఎన్‌యూలో ఈనెల 19, 20 తేదీల్లో వర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయస్థాయి సదస్సు పోస్టర్‌ను వీసీ గంగాధర రావు, రిజిస్ట్రార్ సింహాచలం ఆవిష్కరించారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్న వైసీపీ నేతలు

రెంటచింతల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను కుయుక్తులతో వైసీపీ నేతలు దెబ్బతీస్తున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కలియుగదైవంతో రాజకీయాలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వైసీపీ నేతలను హెచ్చరించారు. మద్యం సీసాలను కార్ల ద్వారా తరలించి అక్కడేదో జరుగుతుందని భక్తులను నమ్మించడానికి చేసిన ప్రయత్నాలను పోలీసులు ఛేదించారని, దీంతో వారి కుతంత్రాలు బట్టబయలయ్యాయన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

రేపు ఏపీటీఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా సదస్సు

గుంటూరు(విద్య), జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న ఏపీటీఎఫ్ రాష్ట్రస్థాయి విద్యాసదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె బసవలింగారావు, మహ్మద్‌ఖాలీద్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆహ్వానపత్రాలు విడుదల చేశారు. జాతీయ విద్యా హక్కు చట్టం, విద్యా విధానం, విద్య ప్రైవేటీకరణ అనే అంశాలపై మాడభూషి శ్రీధర్, ఆర్థికరంగ నిపుణుడు దేవభక్తుల పాపారావు ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	173, 182, 193
చికెన్ విత్ స్కిన్(కిలో)	336.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	346.00

ఆస్తి కోసం బంధువుల హత్య.. ఇద్దరికి జీవిత ఖైదు

గుంటూరు(లీగల్), సత్తెనపల్లి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కాజేయాలనే దురుద్దేశంతో ముగ్గురు బంధువులను దారుణంగా హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పెద్ద మసీదు వీధికి చెందిన షేక్ ఖాసిం అతని కుమారుడు జకీర్‌కు జీవితఖైదు, రూ.2,500 చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ప్రధాన నిందితుడు ఖాసిం.. తన బాబాయి ద్వారా సంక్రమించిన వారసత్వపు ఆస్తిలో వాటా ఇవ్వాలని పిన్ని రహీమున్‌ను కోరాడు. వచ్చిన నగదుతో తన కుమార్తె పెళ్లి చేస్తానని చెప్పగా అందుకు రహీమున్ నిరాకరించింది. దీనికితోడు చనిపోయిన తన కొడుకు జబ్బార్ వద్ద తీసుకున్న అప్పు రూ.5వేలు తీర్చాలని ఆమె డిమాండ్ చేసింది. దీంతో ఆలోచనలో పడ్డ ఖాసిం రహీమున్‌ను, ఆమె కుమార్తె మలిన్‌బీ, కొడుకు రహిమాన్ అడ్డుతొలగించాలనుకున్నాడు. దీంతో ఆస్తి అంతా తమ సొంతమవుతుందని ఖాసిం, అతని భార్య సూఫియా, కొడుకు జకీర్ భావించారు. పథకం ప్రకారం 2023 మే5న రహిమాన్‌ను బాకీ తీరుస్తామని సత్తెనపల్లి శివారు పొలాల్లోకి రప్పించి ఖాసీం, జకీర్ నవారుతో గొంతు నులిమి చంపారు. అనంతరం బైక్‌పై తండ్రీ కొడుకులు ధూళిపాళకు వెళ్లి.. ఇంటిలో పడుకుని ఉన్న రహీమున్‌ను విచక్షణారహితంగా నరికి చంపారు. అడ్డవచ్చిన కుమార్తె మలిన్ బీపైనా కత్తులతో దాడి చేశారు. ఇంటిలో ఉన్న ఇమాంషా కేకలువేయగా..అక్కడికి వచ్చిన వారు ఖాసిం, జకీర్లను పట్టుకోవడానికి యత్నించగా.. పరారయ్యారు. మలీన్‌బి చికిత్సపొందుతూ మృతిచెందింది. సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఖాసిం, జకీర్, సుఫియాపై కేసు నమోదుచేశారు. డీఎ స్పీ ఎం హనుమంత రావు చార్జిషీటు దాఖలు చేశారు. విచారణ అనంతరం సూఫియాపై కేసు కొట్టేసిన.. న్యాయమూర్తి.. ఖాసిం, జకీర్‌కు జీవితఖైదు విధించారు. డిప్యూటీ డైరెక్టర్ బర్కత్ ఆలీ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

మిర్చియార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	45,460
అమ్మకాలు	52,312
నిల్వ	8,891

నాన్ ఏసీ కామన్ వెరైటీ

334	13500	19000
నెంబరు. 5	13500	18000
273	----	----
341	14000	20500
4884	----	----
సూపర్ 10	----	----

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	11500	15000
షార్క్-1	-----	----
బ్యాడిగి	13000	18000
దేవనూరు డీలక్స్	13500	20500
ఆర్మూరు	12000	13500

ఏసీ కామన్ వెరైటీ

334	12000	18000
నెంబరు. 5	13000	17500
273	----	----
341	13000	18800
4884	----	----
సూపర్ 10	----	----

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	11000	14800
బ్యాడిగి 355	12000	17500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	5500	8700

పౌష్టికాహారం కోసం.. రూ.57.77 లక్షలు

గుంటూరు సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్, ప్రభుత్వ, మునిసిపల్ ఇతర ఉన్నతపాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులు 10,004మందికి పౌష్టికాహారం సరఫరా చేసేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి జడ్పీ నిధులు రూ.57,77,310 మంజూరుచేసినట్లు చెర్పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, సీఈఓ వీర్ల జ్యోతిబసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో పౌష్టికాహారం సరఫరా సక్రమంగా అమలుచేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

సెన్సార్ సర్టిఫికెట్ కోసం ఎదురుచూసే ఓపిక లేదా?

● 'జన నాయగన్' చిత్ర యూనిట్‌పై హైకోర్టు ఆగ్రహం- సింగిల్ జడ్జి తీర్పుపై స్టే



హీరో విజయ్ నటించిన 'జన నాయగన్' చిత్రానికి మద్రాస్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం షాకిచ్చింది. ఆ చిత్రానికి తక్షణం సెన్సార్ సర్టిఫికేట్‌ను జారీ చేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాత్సవ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 9న విడుదల కావాల్సిన ఈ చిత్రానికి సెన్సార్ సర్టిఫికేట్ జారీ ఆలస్యమవడంతో చిత్ర నిర్మాణ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న సింగిల్ జడ్జి జస్టిస్ పీటీ ఆషా.. శుక్రవారం ఉదయం 'జన నాయగన్'కు 'యూఏ' సర్టిఫికేట్ మంజూరు చేయాలంటూ సెన్సార్ బోర్డును ఆదేశించారు. అయితే, సింగిల్ జడ్జి తీర్పుపై సెన్సార్ బోర్డు తక్షణం హైకోర్టులో అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. రివ్యూ చేసేందుకు తగిన సమయం ఇవ్వకుండానే సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారని, వీటిని రద్దు చేయాలని సెన్సార్ బోర్డు అభ్యర్థించింది. అనేక నిబంధనలు పాటించాల్సివున్న తరుణంలో సెన్సార్ సర్టిఫికేట్ కోసం ఓపిగ్గా వేచి చూడకుండా, న్యాయస్థానంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తారా? అంటూ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. మీపాటికి మీరు విడుదల తేదీని ప్రకటిస్తే మేం మీ ఇష్టానుసారంగా నడుచుకోవాలా? అని నిలదీసింది. సెన్సార్ సర్టిఫికేట్ పొందేందుకు మరికొంత కాలం వేచి చూడొచ్చు కదా అని ప్రశ్నిస్తూ.. సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వులపై స్టే విధించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఏపీలో ప్రత్యేక ప్రదర్శనకు అనుమతి

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా ప్రత్యేక ప్రదర్శనకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నెల 12వ తేదీన విడుదలయ్యే ఈ సినిమాకు నిబంధనల సడలింపు ఇస్తూ టికెట్ ధరల పెంపునకు హోంశాఖ శుక్రవారం అనుమతి ఇచ్చింది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 8 నుంచి రాత్రి 10 గంటల మధ్యలో ఒక ప్రత్యేక షోకు అనుమతి లభించింది. దీనికి గానూ టికెట్ ధర రూ.500గా నిర్ణయించారు. సినిమా విడుదలైన రోజు నుంచి పది రోజుల పాటు టికెట్ ధరలను పెంచుకునే అనుమతిని ప్రభుత్వం ఇచ్చింది. సింగిల్ స్క్రీన్‌లలో రూ.100, మల్టీ ప్లెక్స్‌లలో రూ.125 అదనంగా వసూలు చేసుకునే వెసులుబాటును ఇస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది

అమరావతి (ఆంధ్రజ్యోతి)



ఆ సర్ప్రైజ్ అదిరిపోతుంది

రవితేజ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సుధాకర్ చెరుకూరి నిర్మాత. డింపుల్ హయతీ, ఆషికా రంగనాథ్ కథానాయికలు. సంక్రాంతి సందర్భంగా ఈనెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయికలు సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

బాలామణి పాత్రలో ఒదిగిపోయా

సినిమాలో ఎవరూ ఊహించని ఒక సర్ప్రైజ్ ఎలిమెంట్ ఉంది. అది వెండితెరపై చూస్తేనే మజా వస్తుందని డింపుల్ తెలిపారు. 'రవితేజ గారితో నాకు ఇది రెండో చిత్రం. బాలామణి అనే పాత్రను కిశోర్ గారు నా కోసం డిజైన్ చేశారు. ఈ సినిమా కథ ప్రతి కుటుంబానికి కనెక్ట్ అవుతుంది. ప్రస్తుతం రిలేషన్షిప్‌లో ఉండే గొడవలు, ఎమోషన్స్‌ను దర్శకుడు ఇందులో అద్భుతంగా చూపించారు. స్పెయిన్‌లో షూట్ చేసిన పాటలు, సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి' అని చెప్పారు.

మోడ్రన్ అమ్మాయిగా కనిపిస్తాను

తన పాత్ర గురించి ఆషికా రంగనాథ్ వివరిస్తూ..."నా సామిరంగ చిత్రంతో పోలిస్తే ఇందులో నా పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. మానస శెట్టి అనే మోడ్రన్ అమ్మాయిగా కనిపిస్తాను. నేటి తరం అమ్మాయిలకు రిలేట్ అయ్యే పాత్ర ఇది. కిశోర్ తిరుమల నా పాత్రను, లుక్‌ను సరికొత్తగా తీర్చిదిద్దారు. నాకు తెలుగు అంతగా రాకపోయినా, ఎంతో ఓపిగ్గా నాతో డబ్బింగ్ చెప్పించారు" అని తెలిపారు. 'రవితేజ, సునీల్, వెన్నెల కిశోర్, సత్య వంటి నటులతో కామెడీ టైమింగ్‌ను మ్యాచ్ చేయడం సవాల్‌గా అనిపించింది. మాస్ సాంగ్ షూట్ చేస్తున్నప్పుడు చిరంజీవి గారు సెట్స్‌కు రావడం నా జీవితంలో మర్చిపోలేని అనుభవం' అని ఆషిక పేర్కొన్నారు.

ప్రభాస్ 'ఫౌజీ'కి సింగిల్ కార్డ్



కేకే

టాలీవుడ్‌లో తనదైన సాహిత్యంతో, వైవిధ్యమైన పాటలతో అగ్రశ్రేణి గీతరచయితగా కొనసాగుతున్నారు కేకే (కృష్ణ కాంత్). ఆయన తన సినీ ప్రయాణం గురించి మీడియాతో ముచ్చటించారు. "వార్ 2' చిత్రంతో ఎన్టీఆర్‌కు తొలిపాట రాసే అవకాశం వచ్చింది. గతేడాది పాటల రచయితగా నాకు దక్కిన మధుర జ్ఞాపకం అది' అని ఆనందం వ్యక్తం చేశారు. ప్రభాస్, హనూ రాఘవపూడి కాంబినేషన్‌లో వస్తున్న ఫౌజీ చిత్రం గురించి చెబుతూ 'ఈ చిత్రానికి సింగిల్ కార్డు (అన్నిపాటలు)నేనే రాస్తున్నాను, ఇప్పటికి మూడు పాటలు పూర్తయ్యాయి, వాటిలో రెండు పాటల చిత్రీకరణ పూర్తయింది' అని చెప్పారు. 'నా పాటల్లో ఇంగ్లీష్ పదాలు తగ్గించి, స్వచ్ఛమైన తెలుగు పదాలు వాడడానికే ప్రాధాన్యమిస్తాను' అని కేకే చెప్పారు.

చప్పట్లు కొట్టని వారి కుటుంబాలు నాశనమవ్వాలని సరస్వతీ దేవిని కోరతా

● ఆవకాయ్- అమరావతి కార్యక్రమంలో యండమూరి వివాదాస్పద వ్యాఖ్యలు



'చప్పట్లు కొట్టని వారి కుటుంబాలు నాశనం అయిపోవాలని సరస్వతీ దేవిని కోరతాను' అంటూ ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆవకాయ్-అమరావతి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని భవాని ద్వీపంలో శుక్రవారం జరిగిన ప్యూర్ ఈవిల్ (సినిమాల్లో ప్రతి నాయకుల పాత్రలు) చర్చలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు దుమారం రేపాయి. ప్రముఖ జర్నలిస్ట్ బాలాజీ మిట్టల్ సమక్షంలో జరిగిన చర్చకు బాలీవుడ్ రచయిత సుధీర్ మిశ్రాతో కలిసి యండమూరి హాజరయ్యారు. సినిమాల్లో విలన్ పాత్రల సృష్టిపై జరుగుతున్న చర్చను అక్కడున్న వారందరూ శ్రద్ధగా వింటూ మధ్యమధ్యలో చప్పట్లు కొట్టారు. అయితే కొందరు వ్యక్తులు చప్పట్లు కొట్టకుండా ఉండటాన్ని యండమూరి గమనించారు. వారిని ఉద్దేశించి.. 'నేను సరస్వతీ దేవి గుడి కట్టిస్తున్నాను., చప్పట్లు కొట్టని వారి కుటుంబాలు నాశనమైపోవాలని సరస్వతీ దేవికి మొక్కుతాను' అని ఆయన వ్యాఖ్యానించారు. చర్చ ముగిసిన తరవాత ఓ గృహిణి యండమూరి వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వేదిక వద్దకు వెళ్లి 'మీరు వస్తున్నారని, మిమ్మల్ని చూడాలని, మీ మాటలు వినాలని ఎంతో ఆశతో వచ్చాం, మా కుటుంబాలు నాశనం అయిపోవాలని మీరు దేవుడిని కోరటం ఏమిటి' అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రేక్షకులకు క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. దీంతో యండమూరి ఓకే.. ఓకే.. అంటూ వేదిక దిగి వెళ్లిపోయారు.

విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి)


మాది పక్కా పండగ సినిమా



రామ్ అబ్బరాజు

శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నారి నారి నడుమ మురారి'. సంయుక్త, సాక్షి వైద్య హీరోయిన్లు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రామ్ అబ్బరాజు మీడియాతో మాట్లాడుతూ 'శర్వా గారి బైకర్ సినిమా విడుదల వాయిదా పడడంతో మాకు సంక్రాంతికి వచ్చే మంచి అవకాశం దొరికింది. నా సినిమా సంక్రాంతికి వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులను అలరించడం నాకు ఇష్టం. ఒక హీరో ఇద్దరు హీరోయిన్లు అనగానే ముక్కోణపు ప్రేమకథ అనుకుంటారు. కానీ ఇందులో చాలా కొత్త పాయింట్ ఉంది. శర్వానంద్ ఈ చిత్రంలో చాలా యంగ్ లుక్‌లో కనిపిస్తారు. ఆయన గత చిత్రాల తరహాలో సాగే ఫన్ ఎంటర్‌టైనర్ ఇది. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని రామ్ అబ్బరాజు తెలిపారు.

యువతను మెప్పించేలా...



ర్యాప్ సింగర్ రోల్ రిడా, వెంకట్ దుగ్గిరెడ్డి, రాజ్ పవన్ ప్రధాన పాత్రధారులుగా గంగ సప్తశిఖర తెరకెక్కిస్తున్న చిత్రం 'పాంచాలి పంచ భర్తృక'. వెంకట్ దుగ్గిరెడ్డి నిర్మిస్తున్నారు. రాజేంద్రప్రసాద్, జెమినీ సురేశ్, పృథ్వీరాజ్, శ్రీకాంత్ అయ్యంగార్, సరీహ ఫర్, రూపలక్ష్మి కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'యువతను మెప్పించే చిత్రమిది. ఆద్యంతం సరదాగా సాగుతుంది. అందరినీ అలరించి, ఘన విజయం సాధిస్తుంది' అని అన్నారు.

రెండు సినిమాలతో ఆస్కార్‌లోకి ఎంట్రీ!





భారతీయ సినిమా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్న చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మరో ప్రతిష్ఠాత్మక మైలు రాయి చేరుకుంది. 2025 లో ఆ సంస్థ నిర్మించగా విడుదలై ఘన విజయం సాధించిన 'మహావతార్ నరసింహ', 'కాంతార చాప్టర్ వన్' చిత్రాలు ఆస్కార్ జనరల్ ఎంట్రీ లిస్ట్‌లో అధికారికంగా చోటు దక్కించుకున్నాయి. ఇది నిజంగా భారతీయ సినిమాకు, హోంబలే సంస్థకు గర్వకారణమే!

రిషబ్ శెట్టి దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన 'కాంతార చాప్టర్ వన్', అశ్విన్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'మహావతార్ నరసింహ' చిత్రాలు భారీ విజయం సాధించడమే కాకుండా అద్భుతమైన కథ, సాంస్కృతిక ప్రామాణికత, సాంకేతిక నైపుణ్యం, విజువల్ గ్రాండియర్‌కు విశేష ప్రశంసలు అందుకొన్నాయి. ఇప్పుడు ఈ రెండు చిత్రాలూ ఆస్కార్ జనరల్ ఎంట్రీ లిస్ట్‌లో స్థానం పొందడంతో ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ నిర్మాత, ఉత్తమ దర్శకుడు. వంటి ప్రధాన విభాగాల్లో అకాడమీ అవార్డ్ పరిశీలనకు అర్హత సంపాదించాయి.

22న తుది నామినేషన్ల జాబితా

అలాగే మరో మూడు భారతీయ చిత్రాలు.. 'టూరిస్ట్ ఫ్యామిలీ', 'తన్వీ ది గ్రేట్', 'సిస్టర్ మిడ్‌నైట్' కూడా పోటీలో నిలిచాయి. ఈ నెల 22న ఆస్కార్ కమిటీ తుది నామినేషన్ల జాబితాను ప్రకటిస్తుంది. దీనికోసం భారతీయ చిత్ర పరిశ్రమ ఆసక్తిగా ఎదురు చూస్తోంది.

ఫ్యామిలీ కథతో 'పురుష'



పవన్‌కల్యాణ్ బత్తులను హీరోగా పరిచయం చేస్తూ రూపుదిద్దుకుంటున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పురుష'. పెళ్లి తర్వాత పురుషులు పడే అవస్థలు చూపిస్తూనే భార్యల ప్రాధాన్యం ఏమిటని వివరించే కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వీరు వులవల దర్శకత్వంలో బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేశారు. టీజర్ చాలా ఆసక్తికరంగా ఉందని ఆయన చెప్పారు. పక్కా కామెడీ ఎంటర్‌టైనర్ ఇదనీ, పెళ్లి తర్వాత జీవితం ఎలా ఉంటుందనే అంశాలను వినోదంతో మిళితం చేసి చూపించామనీ, అతి త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. వైష్ణవి కొక్కుర, విశిక, హాసిని, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ తదితరులు 'పురుష' చిత్రంలో నటించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

కళాపరిషత్ నాటకోత్సవాలు ప్రారంభం



నాటిక ప్రదర్శనలను ప్రారంభిస్తున్న ఆలోకం పెద్దబ్బయ్య, నాయుడు గోపి, పీవీ మల్లికార్జునరావు తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవెంకటేశ్వ విజ్ఞాన మందిరంలో, గుంటూరు కళాపరిషత్ నాటకోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా గుంటూరు కళా పరిషత్ అధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు, ఎన్టీఆర్ కళాపరిషత్ గుదె పాండు రంగరావు, కళాపరిషత్ ఉపాధ్యక్షుడు ధనియాల గాంధీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పీవీ మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. నాటక రంగానికి కళాపరిషత్ చేస్తున్న సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం కేకేఎల్ స్వామి దర్శకత్వం వహించిన శ్రీకాకుళం వారిచే ప్రదర్శించిన 'మాయాజాలం' నాటిక ఆలోచింపజేసింది. ఉదయ్ దర్శకత్వం వహించిన హైదరాబాదు వారిచే 'స్త్రీ మాత్రేనమః' రెండో నాటికగా ప్రదర్శించారు. సుఖమంచి కోటేశ్వరరావు దర్శకత్వం వహించిన విజయవాడ వారిచే 'మమ్మల్నీ బ్రతకనియ్యండి' నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. కళాపరిషత్ కార్యదర్శి అమ్మిశెట్టి శివ, కార్యవర్గ సభ్యుడు రావుల అంజిబాబు సభకు స్వాగతం పలకగా, ప్రధాన కార్యదర్శి పూర్ణ, ఉపాధ్యక్షుడు నాయుడుగోపి, కార్యదర్శి గుమ్మడి నాగేశ్వరరావు, అలోకం పెద్దబ్బయ్య కార్యక్రమాల్ని పర్యవేక్షించారు.

విద్యార్థి నాయకులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

● కలెక్టరేట్ ఎదుట వినూత్న నిరసన

గుంటూరు(తూర్పు), జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సంఘాల నాయకులు డిమాం డ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట చేతులకు సంకెళ్లతో వినూత్న నిరసన చేప ట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు జిల్లాల్లో విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై రౌడీ షీట్ తెరవడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాత కేసులను తొలగిస్తామని ఇచ్చిన హామీ ఎమైందని నిలదీశారు. విద్యార్థి సంఘ నాయకుల కేసులపై మంత్రి నారా లోకేశ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనల్లో పలు విద్యార్థి సంఘా ల నాయకులు పానుగంటి చైతన్య, నాసర్ జీ, కరీం, జంగాల చైతన్య, వలీ, వినోద్, ఉత్తేజ్, జవహర్, తదితరులు పాల్గొన్నారు.

జన రంజక కవి ప్రతిభా పురస్కార విజేతలు

గుంటూరు(తూర్పు), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఫిబ్రవరి 5వ తేదీన జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్టు రావి రంగారావు సాహిత్య పీఠం కన్వీనర్ నర్రా ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీకి పద్యాలు, గేయాలు, వచన, లఘు కవితలు, బాలగేయాల సంపుటాలను ఆహ్వానించారన్నారు. 87 కవితల సంపుటాల్లో నాలుగు పుస్తకాలకు జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు లభించాయని చెప్పారు. అందులో భాగంగా ఇళ్ల మురళీధరరావు (విశాఖపట్నం), నాగజ్యోతి శేఖర్, డా.రాధేయ (అనంతపురం), కుందుర్తి కవిత (హైదరాబాదు) రచించిన పుస్తకాలు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఒక్కో కవికి రూ.3 వేలు నగదు, జ్ఞాపికతో సత్కారం ఉంటుందని తెలిపారు.

ఎస్సీల సంక్షేమానికే నిధులను వినియోగించాలి

● మంత్రి బాలవీరాంజనేయులుకు మాలమహానాడు విజ్ఞప్తి

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కేటాయించే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఆయా వర్గాల సంక్షేమానికి మాత్రమే కేటాయించాలని, మరే ఇతర కార్య క్రమాలకు దారి మళ్లించవద్దని సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనే యులును మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ కోరారు. సచివాలయంలో శుక్రవారం మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలు వురు మాలమహానాడు జిల్లా నాయకులున్నారు.

12న జిల్లా స్థాయి సంప్రదాయ క్రీడా పోటీలు

గుంటూరు(తూర్పు), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన బీఆర్ స్టేడియంలో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీవో ఆఫ్రోజ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల్గిన వారు అదే రోజున ఉదయం 8 గంటలకు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

గోదాదేవి అమ్మవారికి ధనుర్మాస సారే బహుకరణ

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాత బస్టాండు వెంకటేశ్వర స్వా మి దేవస్థానంలో గోదాదేవి అమ్మవారికి ధనుర్మాస సారెను భక్తులు బహూకరించారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీపద్మావతి ఆండాల్ సమేత శ్రీవెంకటేశ్వర స్వామి గోష్టి సభ్యులు శ్రీగోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.సుభద్ర, గోష్టి సభ్యులు వెంకటసుబ్బమ్మ, కనకరత్నం, వాణి, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దస్త్రం ఇక ఈ-ఆఫీస్‌లోనే

● ప్రభుత్వంపై ప్రజల సానుకూల దృక్పథం పెరగాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



విద్యార్థులకు స్టడీ మెటిరియల్ అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి దస్త్రం ఇక నుంచి ఈ-ఆఫీస్‌లోనే నడపాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా వివిధ ప్రభుత్వ జిల్లా శాఖల అధికారులను ఆదేశిం చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖపై ప్రజలకు సానుకూల దృక్పథం పెర గాలన్నారు. పీజీఆర్ఎస్‌ను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. తప్పుడు ఎండార్స్‌మెంట్ ఇవ్వరాదని స్పష్టం చేశారు. ప్రతి దస్త్రం ఈ-ఆఫీస్‌లో రావాలని ఆదేశించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు సమర్పించాలన్నారు. ఒకే అంశంపై పలుమార్లు దస్త్రాలు తిప్పరాదని చెప్పారు. ప్రభుత్వం కొన్ని అధికారాలను తహసీల్దార్లకు బదలాయిం చిందని, వాటిని వినియోగించడంలో ప్రజలకు మేలు కలిగే విధంగా ఉండాలన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ 11వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదే శించారు. రెవెన్యూ క్లినిక్‌లు విజయవంతం చేయాలి. రెవెన్యూ రికార్డులు డిజిటలైజే షన్ కావాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీలో జాప్యం జరగరాదన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో వీ జ్యోతిబసు, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మి కుమారి, శ్రీనివాస్, పార్థసారథి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే విజయం మీదే : కలెక్టర్

గుంటూరు(విద్య), జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే విజయం తథ్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంక్షే మ హాస్టల్స్‌లో చదివే పది విద్యార్థుల కోసం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమా లు నిర్వహిస్తున్నామని అందరూ ఉత్తమ ఫలితాతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విజయం మనదే స్టడీ మెటీరియల్‌ను, విద్యాజ్యోతి గైడ్‌ను విద్యార్థులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి పి.మురళీధర్, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి పార్థసారథి, డీఈవో షేక్ సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు చట్ట రీత్యా నేరమని, ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. శుక్రవారం జంతు హింస నిరోధక చట్టం ప్రకారం కోడి పందేలు, ఎడ్ల పందేలు నివారణ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. కలెక్టర్ మాట్లాడు తూ చట్టం ప్రకారం నిషేధం ఉందన్నారు. శనివారం అన్ని గ్రామాల్లో దండోరా వేయించా లని ఆదేశించారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు (మెడికల్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం (ఏపీజీఎన్ఎ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2026 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను శుక్రవా రం కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా శాఖ కార్యదర్శి వై పద్మజ, కోశాధికారి పీ హేమలత, సభ్యులు ఎం ఆషాలత, పీ సునీత, జీ అరుణ, ఏ భూలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, నర్సుల సంఘం సభ్యులు



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ తదితరులు

కేఎల్పీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

గుంటూరు (విద్య) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక రింగ్ రోడ్డులోని కేఎల్పీ స్కూల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి పటాల ను ఎగురవేయడం హరిదాసుల కీర్తనలు, ముగ్గులు వేయడం, భోగిమంటలు, సాంస్కృ తిక కార్యక్రమాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కొండ బోలు కృష్ణప్రసాద్, అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, వ్యవస్థాపకులు డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో...

గుంటూరు(విద్య), జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని కళ్ళం హరనాథరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వ హించారు. చైర్మన్ కళ్ళం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ, సంప్రదాయాల్లో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కళాశాలలో గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాటు చేసిన తలపించేలా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డైరె క్టర్ ఎం.ఉమాశంకర రెడ్డి, ప్రిన్సిపాల్ బీఎస్‌బీ రెడ్డి, కళ్ళం భరద్వాజ్ పాల్గొన్నారు.



టగ్ ఆఫ్ వార్ పోటీల్లో పాల్గొన్న కళ్ళం మోహనరెడ్డి తదితరులు

బాలకుటీర్‌లో...

గుంటూరు(విద్య), జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని శ్రీవెంకటేశ్వర బాల కుటీర్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సూర్యుడు మకర రాశి లోకి ప్రవేశించే సమయంలో మకర సంక్రాంతిగా జరుపుకుంటారని పాఠశాల వ్యవస్థాప కులు డాక్టర్ నన్నపనేని మంగాదేవి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ముగ్గుల పోటీలు, భోగి మంటలు, కొత్త పొంగళ్ళు భోగీ పళ్ళు, బొమ్మల కొలువులు, గాలి పటాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలోని ఏఓ రఘురాం, సహ కార్యదర్శి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చిప్స్ కళాశాలలో....

గుంటూరు(విద్య), జనవరి 9 (ఆంధ్ర జ్యోతి):స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మా స్యూటికల్ సైన్సెస్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వ హించారు. విద్యార్థులు మెహందీ, రంగోలి, కబడ్డీ పోటీలు, కోకో పోటీల్లో పాల్గొన్నారు. క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో....

గుంటూరు(విద్య), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ముగ్గులు వేసి, గాలిపటాలను ఆకాశంలోకి ఎగురవేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

రేపు రెటినోపతి ఉచిత వైద్యశిబిరం

సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్‌టెన్షన్ అండ్ డయాబెటిస్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 11వ తేదీ ఉదయం 9 గంటల నుంచి బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో భవనంలో కంటికి సంబంధించిన రెటినోపతి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సేవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో రబీకి సరిపడా యూరియా నిల్వలు

● ఎరువుల కొరత లేదని స్పష్టం చేసిన డీఏవో పద్మావతి

గుంటూరు సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రబీ 2025--26 సీజన్‌కు గుంటూరు జిల్లాలో అన్ని పంటల అవసరాలను తీర్చేందుకు సరిపడా యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ముళ్లపూడి పద్మావతి స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. రబీ సీజన్‌కు జిల్లాలో మొత్తం 55,840 మెట్రిక్ టన్నుల యూరియా అవసరంగా గుర్తించి, అందుకు అనుగుణంగా పంపిణీ ప్రణాళికను రాష్ట్ర వ్యవసాయ సంచాలకులకు పంపినట్లు తెలిపారు. అక్టోబరు 2025 నాటికి జిల్లాలో 1,770 మెట్రిక్ టన్నుల ప్రారంభ నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అప్పటి నుంచి జనవరి 31 వరకు జిల్లాకు 39,422 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటివరకు 44,127 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందు బాటులో ఉంచామని వెల్లడించారు. ఈ నెలాఖరు నాటికి జిల్లాకు మరొక 8,727 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు ఆమె సూచనలు చేస్తూ, ఎరువులు కొనుగోలు చేసే సమ యంలో బస్తాపై ముద్రించిన ఎంఆర్‌పీని పరిశీలించి, అదే ధరకు మాత్రమే కొనుగోలు చేసి, డీలర్ నుంచి తప్పనిసరిగా రసీదు పొందాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లింపుచేసినా డీలర్లపై ఎరువుల నియంత్రణ చట్టం–1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ముళ్లపూడి పద్మావతి హెచ్చరించారు.

ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో ఏఐ ఇనిస్టిట్యూట్

● రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో క్వాంటమ్ సెంటర్

● వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్‌కుమార్

గుంటూరు(విద్య), జనవరి 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా బోధన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వారిని కార్యో న్ముఖుల్ని చేయాలనే లక్ష్యంతో ఏపీఎస్‌ఆర్‌ఎం వర్సిటీ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కార్నెగి మెలన్ యూనివర్సిటీతో భాగ స్వామ్య ఒప్పందం చేసుకుందని వీసీ సీహెచ్ సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం గుంటూరులో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో సతీష్ కుమార్ మీడియాకు వివరాలను వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు విశేషమైన ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో ఎస్ ఆర్ఎంలో ఏఐ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయనున్నామని ఆయన తెలిపారు. ఇందుకోసం కార్నెగి మెలన్ యూనివర్సిటీ సహకారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రేమ్ కుమార్, వినాయక్, చీఫ్ ఎక్స్ పీరియన్స్ ఆఫీసర్ శంతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రెండో శనివారం పురస్క రించుకొని విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-1 ఈఈ పీహెహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి వంద గ్రాముల గంజాయి, 3.2 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాదీనం స్వాదీనం చేసుకున్నారు. నెహ్రూనగర్‌కు చెందిన పఠాన్ మున్నా, చిల్లర ప్రేమ్ కుమార్‌ని అరెస్టు చేసి నట్లు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. శుక్రవారం కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుపరచి వివరాలు వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సుమారు 50సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి శుక్రవారం ఉదయం రాజాగారితోట పాత తేజ బార్ వెనుక రోడ్డు పక్కన అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కొత్తపేట ఏఎస్ఐ రెహమాన్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుంటూరు ప్రభు త్వాస్పత్రి శవాగారంలో భద్రపరచారు. మృతదేహాన్ని గుర్తించిన వారు కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

3.5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 6/18లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. పాలేటి నాగరాజు అనే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని స్వాదీనం చేసుకున్నారు. అందులో బ్రాడీపేటకు చెందిన కస్తూరి శ్రీనుకు చెందిన రేషన్ బియ్యంగా తెలిసింది. ఎస్ఐ రాజ్‌కుమార్ వాహనాన్ని, డ్రైవర్‌ను పట్టాభిపురం పోలీసులకు అప్పగించారు.

ఆర్థర్ గైటన్ విగ్రహావిష్కరణ

గుంటూరు మెడికల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): శరీర ధర్మశాస్త్రంలో ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త ఆర్థర్ గైటన్ రచనలు ఎన్నో తరాల వైద్య విద్యార్థులను ప్రేరేపించాయని, ఆయన పేరిట గుంటూరు వైద్య కళాశాలలో లాబీ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ తెలిపారు. శుక్రవారం కళాశాల ఫిజి యాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన ఆర్థర్ గైటన్ విగ్రహాన్ని, ప్రిన్సిపాల్ సుందరాచారీ సమక్షంలో.. న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమా శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ భవనం అనిత ప్రారంభించారు. ఫిజియాలజీ విభాగానికి ఈ దంపతులు రూ.10 లక్షల విరాళం అందజేశారు. అనాటమీ విభాగం మోడలర్ టీవీ కృష్ణ సుబ్బారావు రూ.75 వేల వ్యయంతో గైటన్ విగ్రహాన్ని తయారు చేయించి ఈ విభాగానికి అందజేశారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు మన సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీక అని టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు అన్నారు. మల్లె విజయలక్ష్మి జ్ఞాపకార్థం, పాలడుగు అంజ య్య సహకారంతో జిల్లా తెలుగు మహిళల ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాల యంలో ముగ్గులపోటీలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్య రావు, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు తదితరులు ముగ్గుల పోటీలను వీక్షించారు. అనంతరం ముగ్గుల పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక బహుమతులు అందించారు. పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచుమర్తి కల్పన, పెండ్యాల పద్మలత, ఏమినేటి లక్ష్మీ శైలజా, కార్పొరేటర్ మానం పద్మశ్రీ, తిరువళ్లూరి పద్మావతి, శివజ్యోతి, నంది సరస్వతి, మల్లీశ్వరి, కోటమ్మ, ఇత్తడి రత్నకుమారి, చిట్టెం సింధు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులను వీక్షిస్తున్న మేయర్ నాని, పిల్లి మాణిక్యరావు తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇచ్చి, బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యం తో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రజా గ్రీవెన్స్ ద్వారా వచ్చే ప్రతి సమస్యపై నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ శాశ్వత పరిష్కారం దిశగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

మహిళల ఆర్థిక స్వావలంబనే కూటమి లక్ష్యం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● రూ.66 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన


గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం గా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నగరంలోని ఆరో డివిజన్ సోము వారి వీధిలో రూ.66 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి నగర మేయర్ కోవెల మూడి నానితో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఏర్పాటు చేసిన సరస్ మేళా అన్ని వర్గాలకు ఉప యోగ కరంగా ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన ఈ మేళా మహిళల ప్రగతికి బాటలు వేసే విధంగా ఉందని అన్నారు. మహిళల చేతుల్లో రూపు దిద్దుకున్న కళాకృతులు, వంటకాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. గుంటూ రు తూర్పు నియోజకవర్గాన్ని ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చేయకుండా 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని విమర్శించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి శకం ఆరంభమైందన్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, కార్పొరేటర్ పోతురాజు సమత, చంద్రశేఖర్, శనక్కాయల రాజకుమారి, కొనకళ్ళ సత్యం తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ నాని, ఎమ్మెల్యే నసీర్

సాఫ్ట్‌వేర్ కొలువులకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్

● ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ



మాట్లాడుతున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు(విద్య), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ కొలువులకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్ మారుతుందని.. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో జరిగిన వార్షిక వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించుకొని ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు ఆర్ఐవో సునీత, ఆర్జేడీ పద్మ, కార్పొరేటర్ సమత, డాక్టర్ శనక్కాయల రాధామాధవి, ప్రిన్సిపాల్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మెడికల్ క్యాంపులో వైద్యులు, సిబ్బంది

సరస్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు

గుంటూరు సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సరస్ ప్రాంగణంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. అక్కడబస చేసే వారితో పాటు, సరస్ చూసేందుకు నిత్యం చాలా మంది వస్తుండటంతో వైద్యసేవలపై ప్రభుత్వం దృష్టిసారించి.. ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అక్కడ పలువురు డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసినట్టు డాక్టర్ చలసాని దివ్య తెలిపారు.

ముందస్తు చర్యలతో లక్ష మందికి అదనంగా వైకుంఠ ద్వార దర్శనాలు

- పది రోజుల్లో 7.83 లక్షల మందికి శ్రీవారి దర్శనం
- రూ.41.14 కోట్ల హుండీ ఆదాయం: టీటీడీ చైర్మన్

తిరుపతి(భవానీనగర్), జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో గత ఏడాది కంటే ఈసారి లక్ష మంది భక్తులు అదనంగా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతేడాది పది రోజుల్లో 6.83 లక్షల మంది భక్తులు వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోగా, ఈ ఏడాది 7.83 లక్షల మంది దర్శించుకున్నారని వెల్లడించారు. జనవరి 2న శుక్రవారం ఒక్క రోజే 83 వేల మంది, మరుసటి రోజు శనివారం రికార్డు స్థాయిలో 89 వేల మంది దర్శనం చేసుకున్నారని వివరించారు.

రూ.41 కోట్లు దాటిన హుండీ ఆదాయం

వైకుంఠ ద్వార దర్శనాల పది రోజుల్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లు వచ్చిందని చైర్మన్ తెలిపారు. 44 లక్షల లడ్డూలను విక్రయించామని, గత ఏడాదితో పోలిస్తే ఇది 10 లక్షలు అదనమని చెప్పారు. అలాగే 2.06 లక్షల మంది తలనీలాలు సమర్పించారన్నారు. 33 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాలను అందించామంటూ, గత ఏడాదితో పోలిస్తే ఇది 39 శాతం అధికమని వెల్లడించారు. శ్రీవారి ఆలయంలో పది రోజులపాటు 50 టన్నుల పుష్పాలు, 10 టన్నుల ఫలాలు, 4 టన్నుల కట్ ఫ్లవర్స్‌తో ఏర్పాటు చేసిన అలంకరణలతో వైకుంఠాన్ని తలపించిందన్నారు. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ మాట్లాడుతూ తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా గతంలో కంటే అధికంగా భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారన్నారు.



వాజపేయి విగ్రహావిష్కరణలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు

అజాతశత్రువు వాజపేయి: మాధవ్

- పార్వతీపురంలో మాజీ ప్రధాని విగ్రహావిష్కరణ

పార్వతీపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని వాజపేయి అజాత శత్రువని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కొనియాడారు. పార్వతీపురంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలిసి శుక్రవారం వాజపేయి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ దేశంలో కాంగ్రేసేతర పార్టీలను ఒకే గూటికి తెచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనత వాజపేయికే దక్కిందన్నారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో ఎన్టీఆర్, వాజపేయి కీలకపాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు.

టీటీడీ బోర్డుకు జంగా రాజీనామా

- నావల్ల ప్రభుత్వానికి ఇబ్బంది రాకూడదనే రాజీనామా
- ఆ ప్లాటు నా హక్కు
- ఎందుకు ప్రశ్నించకూడదు?

ప్రెస్‌మీట్‌లో జంగా ప్రశ్నలు



అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యత్వానికి మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా శుక్రవారం మీడియా ముఖంగా ప్రకటించారు. దీంతోపాటు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. తిరుమలలో స్థలం పొందడం తన హక్కుగా ప్రకటించిన జంగా.. 'ఆంధ్రజ్యోతి'లో రెండ్రోజులపాటు వచ్చిన కథనాలు తనను అప్రతిష్ఠ పాల్జేశాయని అన్నారు. చంద్రబాబు వాస్తవాలను పరిశీలించకుండా తన ట్రస్టుకు భూ కేటాయింపులను చేయబోమని క్యాబినెట్‌లో ప్రకటించడంతో రాజీనామా చేసినట్లు వెల్లడించారు. 'నాపై అనేక మంది కుట్రలు పన్ని ఆరోపణలు చేస్తున్నారు. నావల్ల ప్రభుత్వానికి, చంద్రబాబుకు ఎలాంటి ఇబ్బందీ కలగకూడదనే టీటీడీ సభ్యత్వానికి రాజీనామా చేశాను. రాజీనామా పత్రాలను సీఎంకు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి పంపించాను. తిరుమలలో భూమి నా హక్కు. అది నాకు కేటాయించినదే. నా హక్కుపై నేనెందుకు ప్రశ్నించకూడదు? గతంలో ఆ స్థలం నాకు కేటాయిస్తే.. వ్యక్తిగతంగా గెస్ట్ హౌస్ కట్టడానికి ఇబ్బందిగా ఉందని 'ఓం శ్రీ నమో వేంకటేశ్వర స్వామి గ్లోబల్ ట్రస్టు' ఏర్పాటు చేసుకున్నాను. దాని చైర్మన్ నేనే. ఆ ట్రస్టుకు స్థలం కేటాయించండని ధర్మారెడ్డి ఈవోగా ఉన్నప్పుడే విన్నవించాను. కానీ వైసీపీ ప్రభుత్వంలో నేను కట్టిన డబ్బులను బోర్డు వెనక్కి ఇచ్చేసింది. అది కూడా నేను టీడీపీలో చేరుతున్నానని తెలుసుకుని వెనక్కి ఇచ్చేశారు. ఆ తర్వాత భూ కేటాయింపును తిరస్కరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మరోసారి సీఎం చంద్రబాబుకు విన్నవించాను. ఇప్పుడు బోర్డు తీర్మానం చేసింది. ఆ తీర్మానం ప్రభుత్వానికి వచ్చింది. దానిని ఆమోదించాలా, తిరస్కరించాలా అనేది ప్రభుత్వ నిర్ణయం. ఇదంతా పరిపాలనా ప్రక్రియ. వెనుక ఏం జరిగిందో నాకు తెలియదు. కానీ ఒక పేద వర్గానికి, బడుగు బలహీనవర్గానికి చెందిన నేను నా హక్కును పరిరక్షించుకుందామని, దేవుడి సేవ చేసుకుందామన్న ఆలోచనతో అడిగితే.. కొన్ని శక్తులు అడ్డుపడుతున్నాయి. భూ కేటాయింపు రద్దుకు, నా రాజీనామాకు ఎలాంటి సంబంధం లేదు. ఇప్పుడు బోర్డులోని మెజారిటీ సభ్యులు తీర్మానాన్ని ఆమోదించారు. భానుప్రకాశ్‌రెడ్డి (టీటీడీ సభ్యుడు) తప్ప మిగతా వారంతా కొండను అపవిత్రం చేసినట్లే కదా! నా వల్ల ప్రభుత్వం, బోర్డు అపనిందలు పడకూడదన్న ఉద్దేశంతో నేను రాజీనామా చేయాల్సి వచ్చింది' అని తెలిపారు.

ధర్మారెడ్డి నిర్వాకమే..

గతంలో బాలాజీ-2 స్థలం తనకే కేటాయించారని జంగా తెలిపారు. 'మాలాంటి వారు అక్కడ ఉండడం ధర్మారెడ్డికి ఇష్టం లేదు. ఆయన చేసిన నిర్వాకమే ఇదంతా' అని విమర్శించారు. కొండపైన కూడా వేలం పాటలు పెట్టి రియల్ ఎస్టేట్‌గా తయారు చేశారని ఆరోపించారు. సీఎంకు, చైర్మన్‌కు రాసిన రాజీనామా లేఖను జంగా మీడియాకు విడుదల చేశారు.

మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో ఆర్డీవో హరిప్రసాద్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

- అగ్నిప్రమాదం, రికార్డుల తారుమారు ఆరోపణలపై విచారణ బాధ్యతలు అన్నమయ్య జేసీకి అప్పగింత

అమరావతి/కలికిరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో నేరపూరిత నిర్లక్ష్యం వహించారని, భూవ్యవహారాల్లో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురైన నాటి ఆర్డీవో సి.హరిప్రసాద్‌కు భారీ ఊరట లభించింది. ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ, అన్నమయ్య జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో హరిప్రసాద్‌కు పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది. 2024 జూలై 21 అర్ధరాత్రి జరిగిన ఘటనలో కీలకమైన భూముల ఫైళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇందులో కుట్రకోణం ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఆర్డీవో సి.హరిప్రసాద్, ఆయనకన్నా ముందు ఆర్డీవోగా చేసిన డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్.మురళి, సీనియర్ అసిస్టెంట్ జి.గౌతమ్ తేజ్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకొని, జూలై 29న సస్పెండ్ చేసింది. ఆ తర్వాత రెవెన్యూ, సీఐడీ విచారణలు జరిగాయి. తనపై వచ్చిన అభియోగాలపై హరిప్రసాద్ అక్టోబరు 26న రెవెన్యూ శాఖకు స్టేట్‌మెంట్ ఇచ్చారు. జరిగిన ఘటనకు తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. చుక్కల భూములు, 22(ఏ) జాబితా నుంచి భూములను తొలగించారన్న దాంట్లో తన ప్రమేయం లేదన్నారు.

ఆరు వారాల్లో నివేదిక ఇవ్వాలి

మరోవైపు ఫైళ్ల దహనం, చుక్కల భూములు, రికార్డుల తారుమారు, నిషేధ జాబితా 22(ఏ) నుంచి అడ్డగోలుగా భూములు తీసెయ్యడం, భూవ్యవహారాల్లో తలదూర్చడం వంటి తీవ్ర ఆరోపణలపై శాఖాపర విచారణాధికారిగా అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను నియమిస్తూ రెవెన్యూశాఖ మరో ఉత్తర్వు (జీవో 55) జారీచేసింది. ఆరువారాల్లో విచారణ పూర్తిచేసి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. సి.హరిప్రసాద్, ఎం.ఎస్.మురళి, జి.గౌతమ్ తేజ్‌పై వచ్చిన అభియోగాలు, వారు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లను పరిశీలించి, విచారణ చేయాలని రెవెన్యూ శాఖ పేర్కొంది. ఈ కేసులో ప్రభుత్వం తరపున వాస్తవాల నివేదన (ప్రజెంటింగ్) అధికారిగా అన్నమయ్య జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్ఓ) కె.మధుసూధనరావుకు బాధ్యతలు అప్పగించింది.

నకిలీ మద్యం కేసులో ఏడుగురు నిందితులకు షరతులతో బెయిల్

ములకలచెరువు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు శుక్రవారం ఏడుగురు నిందితులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అన్నమయ్య జిల్లా ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీ కేసులో ఎక్సైజ్ పోలీసులు 33 మందిని నిందితులుగా చేర్చారు. ఇప్పటి వరకు 31 మందిని అరెస్టు చేయగా, 27 మందిని కస్టడీకి తీసుకుని విచారించారు. తాజాగా ఈ కేసులో నిందితులైన తమిళనాడుకు చెందిన గణేషన్ మణిమారన్ (ఏ6), అనంతన్ శ్రీనివాసన్ (ఏ7), వెంకటేషన్ సురేష్ (ఏ9), తెనాలికి చెందిన కొడాలి శ్రీనివాసరావు (ఏ12), పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన నాగరాజు (ఏ14), బెంగళూరుకు చెందిన సుదర్శన్ (ఏ20), ములకలచెరువుకు చెందిన అష్రఫ్ (ఏ21)లకు కండిషన్ బెయిల్ మంజూరైంది. వీరు నాలుగు వారాల పాటు ప్రతి వారంలో ఒక రోజు తంబళ్లపల్లె కోర్టుకు వచ్చి సంతకాలు చేయాలని కోర్టు ఆదేశించింది.

'ఏ' కేటగిరి కింద 3 కార్పొరేషన్లు

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, బోర్డులకు సంబంధించి ప్రభుత్వం కేటగిరీలను నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్, ఏపీ అధికారిక భాషా కమిషనర్, ఉర్దూ అకాడమీలను కేటగిరి ఎ కేటగిరీ కింద ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలానే పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, రెడ్డిక వెల్ఫేర్ కార్పొరేషన్, కుర్ని వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్టేట్ షేక్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ భట్రాజ్ వెల్ఫేర్, ఏపీ స్టేట్ పేరికా వెల్ఫేర్ కార్పొరేషను బి కేటగిరీ కింద ఉంటాయని పేర్కొంది.

హోటల్ రూం.. 3 రోజులకు రూ.లక్ష!

భీమవరంలో కోడి పందేల ఎఫెక్ట్

సాధారణ హోటళ్లు, లాడ్జీల్లో రూ.30వేల నుంచి 60వేలు.. అన్నీ ఫుల్!

- మూడు నెలల ముందు నుంచే బుకింగ్‌లు ప్రారంభం
- కల్యాణ మండపాలు, విడిదిళ్లకు సైతం భారీ డిమాండ్
- పొరుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున రానున్న అతిథులు
- గదుల అద్దెలు పెంచేయడంతో పర్యాటకులకు చుక్కలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంబరాలకు పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం పెట్టింది పేరు. ఇక్కడ నిర్వహించే కోడి పందేలకు విపరీతమైన క్రేజ్ ఉంది. వీటిని ప్రత్యక్షంగా తిలకించడానికి, పందేల్లో పాల్గొనడానికి ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. పండుగ సమీపిస్తుండటంతో ఇప్పటికే గోదావరి జిల్లాల్లో బరులు సిద్ధమయ్యాయి. పందేల్లో పాల్గొనేందుకు రావాల్సిందిగా పెద్ద ఎత్తున అతిథులకు ఆహ్వానాలు వెళ్లాయి. ఈసారి గతానికి మించి సంక్రాంతి జోష్ కనిపిస్తోంది. హైటెక్ సొగసులతో బరులను తీర్చిదిద్దుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వసతులన్నీ ఫుల్ అయ్యాయి. సంక్రాంతి సందర్భంగా ఐదు రోజుల పాటు లాడ్జీలు, హోటల్ గదులన్నీ ముందస్తుగా బుక్ చేసుకున్నారు. భీమవరం, ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడుల్లో దాదాపు 150 హోటళ్లు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో ఒక్క రూమ్ కూడా ఖాళీ లేదు. ఇతర ప్రాంతాల నుంచి పందేలను తిలకించేందుకు వచ్చేవారంతా జిల్లాలోని తమ సన్నిహితులు, రాజకీయ నాయకులను సంప్రదిస్తున్నారు. ఇక ప్రైవేటు ఇళ్లను 3 రోజులకు అద్దెకు తీసుకుంటున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకునే విడిదిళ్లకు, కల్యాణ మండపాలకు సైతం గిరాకీ ఏర్పడింది. గదులకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని యజమానులు మూడు నుంచి నాలుగు రెట్ల వరకు అద్దె అదనంగా వసూలు చేస్తున్నారు. కొన్ని హోటళ్లలో గదులను, గెస్ట్‌హౌస్‌లను ఎవరికీ ఇవ్వవద్దని కొందరు రాజకీయ నాయకులు ఇప్పటికే ఆదేశాలు జారీచేసి వాటిని రిజర్వ్ చేశారు. అలాగే హోటళ్లు, లాడ్జీల్లో ఒక రోజు ప్రాతిపదికన రూమ్‌లు ఇవ్వడం లేదు. మూడు రోజుల ప్యాకేజీతో కేటాయిస్తున్నారు. భీమవరం, ఏలూరు, తణుకు ప్రాంతాల్లో హోటల్ స్థాయిని బట్టి ఒక్క గదికి రూ.30వేల నుంచి రూ.60వేల వరకు వసూలు చేస్తున్నారు. భీమవరంలోని రెండు ప్రముఖ హోటళ్లలో ఒక గదికి 3రోజులకు రూ.లక్ష చొప్పున 60 గదులు రిజర్వు చేశారు. సాధారణ రోజుల్లో లాడ్జీ, హోటల్ స్థాయిని బట్టి రోజుకు రూ.వెయ్యి నుంచి రూ5 వేల వరకు ఉంటుంది. అయితే ఈసారి గతేడాది కంటే అధికంగా ధరలను పెంచేశారు. వసతి భారంగా మారడంతో గోదావరి అందాలను తిలకించేందుకు ప్రణాళికలు వేసుకున్న సామాన్య పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోటికి పైనే పందేలు

కోడి పందేల్లో రూ.కోట్ల వర్షం కురిపించేందుకు బరుల నిర్వాహకులు ఇప్పటికే పందెగాళ్లతో సంప్రదింపులు జరిపారు. కొన్నిచోట్ల గతేడాది పెద్ద మొత్తంలో పందెం గెలిచినవారితో తమ బరికే రావాలని ఒప్పందాలు చేసుకున్నారు. నిరుడు రూ.కోటికి పైగా పందెం గెలుచుకున్న తాడేపల్లిగూడెంలో రూ.2.5 కోట్లకు ఒక పందెం సిద్ధమైంది. దీనిపై నిర్వాహకులు పెద్దఎత్తున ప్రచారం మొదలు పెట్టారు. ఇక పెద్ద బరులు నిర్వహిస్తున్న సీసలి, నారాయణపురం, గొల్లవానితిప్ప, చినఅమిరం ప్రాంతాల్లో రూ.కోటి పందేలకు ఒప్పందాలు కుదిరాయి. ఇరువైపులా సిండికేట్ అయి రూ.కోటి పందేనికి కాలు దువ్వుతున్నారు.

'డెయిరీ'కి సాంకేతికతను జోడించాలి

- కోజికోడ్ సదరన్ డెయిరీ, ఫుడ్ కాంక్లేవ్‌లో మంత్రి అచ్చెన్న

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు డెయిరీ రంగమే వెన్నెముక అని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం కేరళలోని కోజికోడ్‌లో జరిగిన సదరన్ డెయిరీ అండ్ ఫుడ్ కాంక్లేవ్-2026లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 'పోషకాహారంగా పాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. గ్రామీణుల జీవన విధానంలో ముఖ్యమైన పశుపోషణను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ విధానాలను అన్వయించి, డెయిరీ రంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వాల బాధ్యత. ఇందుకోసం ఇండియన్ డెయిరీ అసోసియేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయం. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి హెరిటేజ్ ఫుడ్స్ ఎండీగా, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా డెయిరీ రంగంతో పాటు సేవా రంగంలో ఆదర్శనీయ పాత్ర పోషిస్తున్నారు. ప్రతిష్ఠాత్మక గోల్డెన్ పీకాక్ అవార్డు అందుకున్నారు. భారతీయ పాడి రంగంలో విశిష్ట స్థాయికి ఎదిగిన భువనేశ్వరి డెయిరీ రంగానికి మార్గదర్శకులని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడును ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది.

'థర్డ్‌పార్టీ'తో గురుకులాల్లో పారిశుధ్యం

రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో పారిశుధ్యం, క్లీనింగ్, కుకింగ్ సేవలు అందించేందుకు.. ఆయా సంక్షేమశాఖలు ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమశాఖలతో పాటు ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో పారిశుధ్యం, క్లీనింగ్, వంట చేసేందుకు బడ్జెట్ వెసులుబాటు మేరకు థర్డ్‌పార్టీ ఏజెన్సీల ద్వారా సిబ్బందిని నియమించుకోనున్నారు.

బలహీనపడనున్న తీవ్ర వాయుగుండం

- నేడు శ్రీలంకలో తీరం దాటే అవకాశం

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర వాయుగుండం చెన్నైకు దక్షిణ ఆగ్నేయంగా 660 కి.మీ., శ్రీలంకలోని బట్టికోలకు 140 కి.మీ., ట్రింకోమలైకు తూర్పు ఆగ్నేయంగా 210 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్యంగా పయనించి శనివారం మధ్యాహ్నంలోగా ట్రింకోమలై, జాఫ్నా మధ్య తీరం దాటనున్నదని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం సాయంత్రం నుంచి క్రమేపీ బలహీనపడుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో తమిళనాడులో భారీవర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా.. రాష్ట్రంలో కోస్తా, రాయలసీమల్లోని అనేక ప్రాంతాల్లో శుక్రవారం చలి తీవ్రత కొనసాగింది. అల్లూరి జిల్లా అరకులోయలో 4.3 డిగ్రీలు నమోదైంది.

తూనికలు, కొలతలపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ 1100

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలు, ప్యాకేజ్డ్ ఉత్పత్తులు మొదలైన వాటికి సంబంధించి ఎదురయ్యే సమస్యలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (జీపీఆర్ఎస్) టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబరు 1100కు కాల్ చేసి నమోదు చేసుకుంటే.. ఆ ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోల్ కృష్ణచైతన్య అంగోతు హామీ ఇచ్చారు. ఈ అంశంపై రాష్ట్రంలోని జాయింట్ కంట్రోలర్లు, డిప్యూటీ కంట్రోలర్లందరూ ప్రత్యేక చొరవ చూపించాలని ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు క్యాబినెట్ ర్యాంక్

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్లా బొజ్జిరెడ్డికి క్యాబినెట్ హోదా కల్పిస్తూ సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆ హోదాకు తగ్గ అలవెన్సులు కూడా చైర్మన్‌కు అందనున్నాయి. ఆ మేరకు గిరిజన సంక్షేమశాఖ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్పోర్ట్స్

గుంటూరు ● శనివారం 10 జనవరి 2026



హుస్సాముద్దీన్

పసిడి రేసులో హుస్సాముద్దీన్, నిఖత్

జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్

నోయిడా: జాతీయ చాంపియన్‌షిప్‌లో తెలుగు బాక్సర్లు మహ్మద్ హుస్సాముద్దీన్, నిఖత్ జరీన్ స్వర్ణానికి అడుగు దూరంలో నిలిచారు. శుక్రవారం జరిగిన 60 కిలోల సెమీ ఫైనల్‌లో హుస్సాం 4-1తో రామన్ (ఆలిండియా పోలీసు)పై, నిఖత్ 48-51 కిలోల విభాగంలో 4-1తో కుసుం బఘేల్ (ఉత్తరప్రదేశ్)పై గెలిచి, ఫైనల్లోకి ప్రవేశించారు. రెండేళ్లుగా గాయాలతో సతమతమవుతున్న 31 ఏళ్ల హుస్సాముద్దీన్ ఈ పోటీల్లో యువ బాక్సర్లను దీటుగా ఎదుర్కొని తనలో ఇంకా సత్తా ఉందని నిరూపించాడు. ఇతర విభాగాల్లో 50-55 కిలోల కేటగిరీలో కామన్వెల్త్ మెడలిస్ట్ అమిత్ పంఘల్‌కు యువ బాక్సర్ జాదుమణి సింగ్ షాకిచ్చాడు. మీనాక్షి (45-48 కి.), ప్రీతి (51-54 కి.), లవ్లీనా బోర్గోహైన్ (70-75 కి.), సచిన్ (55-60 కి.), సుమిత్ (70-75 కి.) ఫైనల్ చేరారు.

అర్జున్‌కు మూడో స్థానం



విజేత నిహాల్, రన్నరప్ విషీ

టాటా స్టీల్ ర్యాపిడ్ చెస్

కోల్‌కతా: టాటా స్టీల్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌ను తెలుగు గ్రాండ్ మాసర్లు ఇరిగేసి అర్జున్ తృతీయ, ద్రోణవల్లి హారిక నాలుగో స్థానంతో ముగించారు. శుక్రవారం ముగిసిన ఈ పోటీల్లోని ఓపెన్ విభాగంలో నిహాల్ సరీన్ మొత్తం 9రౌండ్లలో 6.5 పాయింట్లతో టైటిల్ కైవసం చేసుకోగా, దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ 6 పాయింట్లతో ద్వితీ య స్థానం దక్కించుకున్నాడు. అర్జున్ 5 పాయింట్లతో తృతీయ స్థానంతో సరిపెట్టుకున్నాడు. అనారోగ్యంతో గురువారం మరణించిన తన తాతయ్య ఉమ్మార్‌కు సరీన్ టైటిల్‌ను అంకితం ఇచ్చాడు. తాతయ్యే తనకు చెస్‌ను పరిచయం చేశారని, ఆయన ప్రోత్సాహంతోనే తానీ స్థితికి వచ్చానని గుర్తు చేసుకున్న సరీన్ ఉద్వేగానికి లోనయ్యాడు. ఇక, మహిళల విభాగంలో హారిక, దివ్యా దేశ్‌ముఖ్‌తో కలిసి సంయుక్తంగా 4.5 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలవగా, మెరుగైన టై బ్రేక్ స్కోరు కారణంగా మూడో స్థానాన్ని కోల్పోయి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. రష్యా జీఎం కాటెరినా 6.5 పాయింట్లతో టైటిల్ సొంతం చేసుకోగా, మరో రష్యా జీఎం అలెగ్జాండ్రా గోరియాచ్కినా 5 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది.

సెమీస్‌లో సింధు

సాత్విక్ జోడీకి నిరాశ ● మలేసియా ఓపెన్

కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు మలేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ప్రత్యర్థి అకానె యమగూచి (జపాన్) మోకాలి గాయంతో మ్యాచ్ మధ్యలోనే వైదొలిగింది. అయితే అప్పటికే సింధు 11 నిమిషాల్లోనే తొలి గేమ్‌ను 21-11తో గెలుచుకుని ఆధిక్యంలో ఉంది. 2024, డిసెంబరు తర్వాత ఓ టోర్నీలో సింధు సెమీస్‌కు చేరడం ఇదే తొలిసారి. ఇక సెమీస్‌లో తను వాంగ్ జి యి-పుత్రి కుసుమ మధ్య విజేతతో తలపడనుంది. మరోవైపు పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. వీరిపై ఇండోనేసియాకు చెందిన ఫజర్ అల్ఫియాన్-మహ్మద్ రియాన్ 21-10, 23-21తో వరుస గేముల్లో గెలిచారు.

హనీసింగ్, జాక్వెలిన్ ఆట పాటలతో..







మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో ర్యాపర్ యోయో హనీ సింగ్ తన పాటలతో అలరించాడు. మ్యాచ్‌కు ముందు 30 నిమిషాల పాటు లీగ్ ఆరంభ వేడుకలు జరిగాయి. యో యో తన హిట్ సాంగ్స్‌తో చేసిన మెడ్లే ప్రేక్షకులను అలరించింది. అలాగే తన పాటలకు జతగా జాక్వెలిన్ నృత్యం అదనపు ఆకర్షణగా నిలిచింది. మరోవైపు ఈ కార్యక్రమంలో 2012లో మిస్ యూనివర్స్‌గా నిలిచిన హర్నాజ్ కౌర్ సంధూ కూడా పాల్గొంది.

ఒక్క ఏడాది.. 18 టైటిళ్లు



టెన్నిస్ ఆటగాడు స్వరణ్‌దీప్ రికార్డు

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ వెటరన్ ఆటగాడు స్వరణ్‌దీప్‌సింగ్ ధోడి అరుదైన రికార్డు సృష్టించాడు. ఢిల్లీకి చెందిన 46 ఏళ్ల స్వరణ్‌దీప్.. గతేడాది ఐటీఎఫ్ వరల్డ్ టెన్నిస్ మాస్టర్స్ టూర్ సర్క్యూట్‌లో ఏకంగా 18 టైటిళ్లు సాధించాడు. ఇందులో ఏడు సింగిల్స్ ట్రోఫీలున్నాయి. ఇలా.. ఓ సీజన్‌లో ఏదైనా సర్క్యూట్‌లో అత్యధిక టైటిళ్లు నెగ్గిన తొలి టెన్నిస్ ఆటగాడిగా స్వరణ్‌దీప్ ఘనత అందుకున్నాడు.

డిక్లెర్క్ ధమాకా


డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్ X యూపీ (మ. 3.00)

ముంబై X ఢిల్లీ (రా. 7.30)

- ఆఖరి బంతికి ఆర్‌సీబీ విజయం
- ముంబై ఇండియన్స్‌కు నిరాశ

4 వికెట్లు, 63 రన్స్‌తో అదుర్స్



నాడిన్ డి క్లెర్క్ (44 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 63 నాటౌట్)

సంక్షిప్త స్కోర్లు

ముంబై ఇండియన్స్: 20 ఓవర్లలో 154/6 (సజన 45, కేరీ 40, కమలిని 32; డి క్లెర్క్ 4/26).

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: 20 ఓవర్లలో 157/7. (డి క్లెర్క్ 63 నాటౌట్, హ్యారిస్ 25, అరుంధతి 20; కెర్ 2/13, కేరీ 2/35).

నవీ ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నాలుగో సీజన్‌కు అదిరే ఆరంభం. డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్, మాజీ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్ ఆఖరి బంతి వరకు ఉత్కంఠ రేపింది. ఆరు బంతుల్లో 18 పరుగులు కావాల్సిన వేళ ఆల్‌రౌండర్ నాడిన్ డి క్లెర్క్ (44 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 63 నాటౌట్) బౌండరీలతో విరుచుకుపడి ముంబైకి గట్టి షాక్ ఇచ్చింది. తద్వారా మూడు వికెట్లతో గెలిచిన ఆర్‌సీబీ ఘనంగా బోణీ చేసింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 154 పరుగులు చేసింది. సంజన (25 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 45), కేరీ (29 బంతుల్లో 4 ఫోర్లతో 40), కమలిని (28 బంతుల్లో 5 ఫోర్లతో 32) రాణించారు. డి క్లెర్క్‌కు 4 వికెట్లు లభించాయి. ఛేదనలో ఆర్‌సీబీ 20 ఓవర్లలో 7 వికెట్లకు 157 పరుగులు చేసి గెలిచింది. హ్యారిస్ (25), అరుంధతి (20) సహకరించారు. కెర్, కేరీలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా డి క్లెర్క్ నిలిచింది.

చివర్లో చెలరేగి..: ఓ మాదిరి ఛేదనలో ఆర్‌సీబీ ఓపెనర్లు హ్యారిస్, మంధాన (18) ఎడాపెడా షాట్లతో విరుచుకుపడ్డారు. మూడో ఓవర్‌లో హ్యారిస్ 6,4 మంధాన 4,4లతో ఏకంగా 20 పరుగులు సమకూరాయి. తొలి మూడు ఓవర్లలోనే స్కోరు 40కి చేర్చిన వీరు ముంబైలో గుబులు రేపారు. కానీ ఆ వెంటనే వరుస విరామాల్లో ఈ ఇద్దరితో పాటు హేమలత (7), రాధా యాదవ్ (1), హిట్టర్ రిచా (6) వరుసగా పెవిలియన్‌కు చేరడంతో ఆర్‌సీబీ 65/5 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో డి క్లెర్క్-అరుంధతి ఎదురుదాడికి దిగి జట్టును కాపాడే ప్రయత్నం చేశారు. ఆరో వికెట్‌కు 52 పరుగులు జోడించాక అరుంధతి వికెట్ కోల్పోవడంతో ఉత్కంఠ పెరిగింది. ఇక 19వ ఓవర్‌లో డి క్లెర్క్ ఇచ్చిన 2క్యాచ్‌లతో పాటు తన రనౌట్‌ను ముంబై మిస్ చేసుకోవడం నష్టపరిచింది. ఆఖరి ఓవర్‌లో 18 రన్స్ కావాల్సిన వేళ డి క్లెర్క్ 6,4,6,4తో చెలరేగి జట్టుకు అపూర్వ విజయాన్నందించింది.

ఆదుకున్న సజన-కేరీ: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై తొలి 11 ఓవర్లలో చేసింది 67 పరుగులే కాగా నాలుగు వికెట్లను కోల్పోవడం గమనార్హం. అయితే మిడిలార్డర్‌లో సజన-నికోలా కేరీ దూకుడుతో ముంబై కోలుకుంది. దీనికి తోడు బెంగళూరు ఫీల్డింగ్ వైఫల్యం కూడా వీరికి కలిసి రావడంతో స్కోరు 150 దాటింది. మొదట పేసర్ లారెన్ బెల్ తొలి ఓవర్‌నే మెయిడిన్‌తో ఆకట్టుకుంది. ఓపెనర్ అమెలియా కెర్ (4) విఫలం కాగా మరో ఓపెనర్ కమలిని ధాటిని ప్రదర్శించింది. అయితే చక్కగా కుదురుకున్న తను స్పిన్నర్ శ్రేయాంక ఓవర్‌లో బౌల్డయ్యింది. ఇక మధ్య ఓవర్లలో డి క్లెర్క్ రాణిస్తూ సివర్ బ్రంట్ (4), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (20) వికెట్లను తీసింది. ఈ దశలో బేలగా కనిపించిన ముంబై జట్టును సజన-కేరీ ఆదుకుని ఐదో వికెట్‌కు 82 పరుగులు జోడించడం విశేషం. సజన 2, 4 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన సులువైన క్యాచ్‌లను బెంగళూరు వదిలేసింది. 15వ ఓవర్‌లో సజన 6,4తో 15 పరుగులు రాబట్టగా.. డిక్లెర్క్ ఓవర్‌లో మరో మూడు ఫోర్లతో జోరు చూపింది. అటు కేరీ కూడా చక్కగా సహకరించింది. చివరి ఓవర్‌లో డిక్లెర్క్ ఐదు పరుగులే ఇచ్చి ఈ ఇద్దరినీ పెవిలియన్‌కు చేర్చినప్పటికీ ముంబై అప్పటికే సవాల్ విసిరే స్కోరందుకుంది.

బీసీబీ వైఖరితో బంగ్లా క్రికెటర్లకు కష్టాలు

స్పాన్సర్‌షిప్ నుంచి వైదొలగిన ఎస్‌జీ! ● అదే బాటలో మరిన్ని భారత సంస్థలు



తమీమ్

ఢాకా: ముస్తాఫిజుర్ ఉదంతంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) వ్యవహరిస్తున్న తీరు..ఆ దేశ ఆటగాళ్ల భవితవ్యానికి గొడ్డలి పెట్టులా మరే అవకాశం కనిపిస్తోంది. బీసీబీ నిర్ణయాలతో ఆ దేశ క్రికెటర్లు పలువురు భారత సంస్థల స్పాన్సర్‌షిప్‌ను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. టీ20 వరల్డ్ కప్‌లో తమ మ్యాచ్‌లను శ్రీలంక తరలించాలని బంగ్లా బోర్డు ఐసీసీకి రెండు లేఖలు రాసింది. కానీ బీసీబీ అభ్యర్థనకు ఐసీసీ సుముఖంగా లేనట్టు తెలుస్తోంది. ఈ పరిణామాల క్రమంలో బీసీసీఐతో బీసీబీ సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నట్టే కనిపిస్తోంది. ఇది బంగ్లాదేశ్ క్రికెటర్ల భవిష్యత్ పైనా పడుతోంది. భారత్‌కు చెందిన క్రీడా పరికరాల ప్రముఖ సంస్థ 'ఎస్‌జీ'..పలువురు బంగ్లాదేశ్ ఆటగాళ్లతో ఉన్న తమ కాంట్రాక్టులను కొనసాగించ కూడదని నిర్ణయించుకున్నట్టు సమాచారం. పలు భారత సంస్థలు కూడా ఇదే బాటలో పయనించనున్నట్టు తెలిసింది.

భావోద్వేగాలు వద్దు: మాజీ కెప్టెన్ తమీమ్

కీలకమైన వరల్డ్ కప్ విషయంలో ఆచితూచి వ్యవహరించాలని బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ తమ దేశ క్రికెట్ బోర్డుకు సూచించాడు. మెగా టోర్నీలో పాల్గొనే అంశంపై భావోద్వేగాల ఆధారంగా నిర్ణయం తీసుకోవద్దన్నాడు. బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవాలని ఇక్బాల్ అన్నాడు.

తమీమ్ భారత ఏజెంట్: నజ్ముల్

తమీమ్ ఇక్బాల్ భారత ఏజెంట్ అని బీసీబీ అధికారి ఒకరు నోరు పారేసుకున్నాడు. 'మరో భారత ఏజెంట్‌ను బంగ్లా ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు' అని బీసీబీ ఆర్థిక కమిటీ ఛైర్మన్ నజ్ముల్ ఇస్లామ్ అవాకులు చవాకులు పేలాడు. నజ్ముల్ వ్యాఖ్యలను టస్కిన్, మోమినుల్, తైజుల్ ఇస్లామ్ సహా పలువురు ఆటగాళ్లు ఖండించారు.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,38,710 ▲	1,27,150 ▲	2,68,000 ▼
విజయవాడ	1,41,500 ▲	1,31,000 ▲	2,47,000 ▲
విశాఖపట్నం	1,41,220 ▲	1,27,400 ▲	2,68,000 ▼
రాజమండ్రి	1,39,310 ▲	1,27,700 ▲	2,38,000 ▼
ప్రొద్దుటూరు	1,40,700 ▲	1,29,440 ▲	2,49,200 ▲
ముంబై	1,37,122 ▲	1,28,200 ▲	2,42,808 ▲

ఈ ఏడాది భారత వృద్ధి 6.6%



ఐక్యరాజ్య సమితి: అత్యంత సవాళ్లతో కూడిన ప్రపంచ వాతావరణంలో సైతం భారత్ 2026 సంవత్సరంలో 6.6% వృద్ధిని నమోదు చేస్తుందని ఐక్యరాజ్య సమితి (యూఎన్) అంచనా వేసింది. కల్లోలిత వాతావరణంలో కూడా ఇది అసాధారణమైన వృద్ధి అని 'ప్రపంచ ఆర్థిక పరిస్థితి-అవకాశాలు 2026' పేరుతో విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ప్రైవేట్ వినియోగంలో బలం, ప్రభుత్వ పెట్టుబడుల పెంపు, ఇటీవల చేపట్టిన పన్ను సంస్కరణలు, వడ్డీ రేట్ల తగ్గింపు వంటివి అధిక అమెరికా టారిఫ్‌లతో ఏర్పడిన ప్రతికూలతను తటస్థం చేసి దేశాన్ని బలమైన వృద్ధి బాటలో నిలిపే అంశాలని తెలిపింది. ఇటీవలే ముగిసిన 2025 సంవత్సరంలో దేశం 7.4% వృద్ధి సాధించే ఆస్కారం ఉన్నట్టు తెలియచేసింది. అయితే ఈ ఏడాది అమెరికా టారిఫ్‌ల ప్రభావం ఎగుమతులపై మాత్రం పడవచ్చని పేర్కొంది. భారత ఎగుమతుల్లో అమెరికా వాటా 18% వరకు ఉంటుంది. టారిఫ్‌ల కారణంగా కొన్ని వస్తువుల ఎగుమతులు ప్రభావితమైనా ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌ఫోన్లు వంటివి ఆ ప్రభావానికి దూరంగా ఉంటాయని తెలిపింది. యూరప్, పశ్చిమాసియా వంటి ప్రధాన దేశాల డిమాండ్ మాత్రం బలంగానే ఉంటుందని, ఇవి కూడా అమెరికా టారిఫ్‌ల ప్రభావాన్ని తగ్గించేందుకు దోహదపడే అంశాలని పేర్కొంది. కాగా విదేశీ పెట్టుబడులు తరలిపోవడం, అధిక టారిఫ్‌ల అమలు రూపాయిపై ఒత్తిడిని పెంచాయని, అయితే శక్తివంతమైన పనితీరుతో సమీప భవిష్యత్తులో రూపాయికి మద్దతు లభిస్తుందని తెలిపింది.

ప్రపంచ వృద్ధి 2.8%

"**2026** సంవత్సరంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి రేటు 2.8% ఉండవచ్చని సమితి అంచనా వేసింది. గత ఏడాది నమోదు చేసిన 2.7% వృద్ధి కన్నా ఇది స్వల్పంగా తక్కువ. 2027లో వృద్ధి రేటు 2.9% వరకు ఉండవచ్చని తెలిపింది. అయినా మహమ్మారి ముందు కాలం (2010-2019) సగటు వృద్ధి రేటు 3.2% కన్నా తక్కువగానే ఉంటుంది. యూరప్, జపాన్, అమెరికాల్లో వృద్ధి రేటులో వేగం నిలకడగానే ఉండవచ్చు" అని నివేదిక తెలిపింది. అమెరికా వృద్ధి రేటు సైతం 2024లో నమోదైన 2.8% నుంచి 2025లో 1.9 శాతానికి దిగజారవచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది వృద్ధి 2 శాతానికి, 2027లో 2.2 శాతానికి చేరవచ్చని పేర్కొంది.

నివేదికలోని ముఖ్యాంశాలు...

- 5.6% వృద్ధితో దక్షిణాసియా ప్రపంచంలోనే వేగంగా పురోగమిస్తున్న ప్రాంతంగా నిలుస్తుంది. అయితే అందులో కూడా అధిక శాతం వృద్ధి భారత్ నుంచే లభిస్తుంది.
- దేశంలో తయారీ, సేవల రంగాలు వృద్ధికి చోదకంగా ఉంటాయి.
- స్థూల స్థిర మూలధన వనరుల నిర్మాణంలో బలమైన వృద్ధిని నమోదు చేసిన రెండో దేశంగా భారత్ నిలిచింది.
- గత ఏడాది దేశంలో ఉపాధి సూచీలు కూడా స్థిరంగా ఉన్నాయి. అక్టోబరులో నిరుద్యోగిత రేటు 5.2% ఉంది. సంవత్సరం ద్వితీయార్ధంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ కార్మిక శక్తి భాగస్వామ్యం రేటు మెరుగుపడింది.

> "భారత ఎగుమతి మార్కెట్లు వైవిధ్యభరితంగా ఉండడం వల్ల టారిఫ్‌ల ప్రభావం తక్కువగానే ఉంటుంది. టారిఫ్‌ల వల్ల వాణిజ్య ఎగుమతులు కొంత మేరకు ప్రభావితమైనా సేవల ఎగుమతులు భారత్‌కు దన్నుగా నిలుస్తాయి"
>
> **శంతను ముఖర్జీ, డైరెక్టర్, యూఎన్ ఆర్థిక, సామాజిక వ్యవహారాల డివిజన్**

వాల్యూల్యాబ్స్ కొనుగోలు రేసులో సీవీసీ క్యాపిటల్

ముంబై: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టెక్నాలజీ సర్వీసెస్, ఏఐ సొల్యూషన్స్ సంస్థ వాల్యూల్యాబ్స్‌లో మెజారిటీ వాటా చేజిక్కించుకునేందుకు యూరప్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ సీవీసీ క్యాపిటల్ పార్టనర్స్ సన్నాహాలు చేస్తోంది. 1997లో దొనకంటి అర్జున్ రావు, ఆయన భార్య హరిణి స్థాపించిన ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 30 ఆఫీసులు, 7,000 మంది ఉద్యోగులతో దాదాపు 300 కంపెనీలకు సేవలు అందిస్తోంది. ఈ కొనుగోలు చర్చలకు సంబంధించి ఇప్పటికే సీవీసీ క్యాపిటల్-వాల్యూల్యాబ్స్ ప్రమోటర్ల మధ్య ఒక ఒప్పందం కుదిరినట్టు తెలుస్తోంది. ఇందుకోసం కంపెనీ విలువను రూ.9,000 కోట్లుగా లెక్కించినట్లుగా భావిస్తున్నారు. సీవీసీ మెజారిటీ వాటా కొనుగోలు చేసినా, కంపెనీ నిర్వహణ ప్రస్తుత యాజమాన్యం చేతిలోనే ఉంటుందని తెలుస్తోంది. మరోవైపు వాల్యూల్యాబ్స్‌లో వాటా కొనుగోలుకు ఈక్యూటీ, బ్లాక్‌స్టోన్ వంటి పీఈ సంస్థలు కూడా ఆసక్తితో ఉన్నట్టు సమాచారం.

సుజుకీ ఎలక్ట్రిక్ స్కూటర్ ఈ-యాక్సెస్

ధర రూ.1,88,490



న్యూఢిల్లీ: సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌ఎంఐపీఎల్).. మార్కెట్లోకి తొలి ఎలక్ట్రిక్ స్కూటర్ ఈ-యాక్సెస్‌ను తీసుకువచ్చింది. ఈ స్కూటర్‌తో కంపెనీ అంతర్జాతీయ ఎలక్ట్రిక్ మొబిలిటీ విభాగంలోకి అడుగుపెట్టింది. దీని ధర రూ.1,88,490 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). నాలుగు రంగుల్లో లభ్యమయ్యే ఈ స్కూటర్ బుకింగ్స్‌ను ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది. సాధారణ నికెల్ మాంగనీస్ కోబాల్ట్ (ఎన్‌ఎంసీ) బ్యాటరీలతో పోల్చితే నాలుగు రెట్లు దీర్ఘకాలం మన్నేలా 3 కేడబ్ల్యూహెచ్ లిథియం అయాన్ ఫాస్ఫేట్ (ఎల్‌ఎఫ్‌పీ) బ్యాటరీతో ఈ స్కూటర్‌ను తీసుకువచ్చినట్లు వెల్లడించింది. ఒకసారి చార్జింగ్‌తో ఈ స్కూటర్ 95 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది.


వొడాఫోన్ ఐడియాకు ఊపిరి

- ఏజీఆర్ బకాయిల చెల్లింపుల్లో కంపెనీకి పాక్షిక మారటోరియం
- వచ్చే పది సంవత్సరాల్లో రూ.1,144 కోట్లు చెల్లిస్తే చాలు..

2036 నుంచి ఆరేళ్లలో మిగతా బకాయిల చెల్లింపు

న్యూఢిల్లీ: అప్పుల ఊబిలో కూరుకుపోయి జీవం కోల్పోతున్న ప్రైవేట్ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా (వీఐ)కు కేంద్ర ప్రభుత్వం ఊపిరి అందించింది. ఏజీఆర్ బకాయిల చెల్లింపుల విషయంలో కంపెనీకి భారీ ఊరట కల్పించేందుకు పాక్షిక మారటోరియంను ఆఫర్ చేసింది. ఎలాగంటే, వచ్చే 6 సంవత్సరాల పాటు (2026 మార్చి నుంచి 2032 మార్చి వరకు) గత ఏజీఆర్ బకాయిలను ఏటా రూ.124 కోట్ల చొప్పున చెల్లిస్తే చాలు. ఆ తర్వాత 4 సంవత్సరాల పాటు (2032 మార్చి నుంచి 2035 మార్చి వరకు) ఏటా రూ.100 కోట్లు చెల్లిస్తే చాలని టెలికాం శాఖ తమకు సమాచారం అందించిందని వొడాఫోన్ శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ఆ తర్వాత మిగిలిన బకాయిలను ఆపై ఆరు సంవత్సరాల్లో (2036 మార్చి నుంచి 2041 మార్చి వరకు) వార్షిక సమ వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందని కంపెనీ తెలిపింది. అంటే, రూ.87,695 కోట్ల మొత్తం ఏజీఆర్ బకాయిల్లో వచ్చే పదేళ్లలో కంపెనీ చెల్లించాల్సింది రూ.1,144 కోట్లే. మిగతా బకాయిలను మాత్రం ఆపై ఆరేళ్లలో తీర్చాల్సి ఉంటుంది. వచ్చే పదేళ్ల పాటు కంపెనీకి నగదు లభ్యత పెరిగేందుకు ఈ మారటోరియం బాగా దోహదపడనుంది.

రిలయన్స్ జియో రూ.40,500 కోట్ల ఐపీఓ!



- 2.5 శాతం ఈక్విటీ వాటా విక్రయం
- 2-3 నెలల్లో సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పణ

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్)కు చెందిన టెలికాం, డిజిటల్ వ్యాపారాల అనుబంధ విభాగమైన రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులైన కోటక్ మహీంద్రా క్యాపిటల్, మోర్గాన్ స్టాన్లీతో కలిసి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. పబ్లిక్ ఆఫరింగ్‌లో భాగంగా కంపెనీ 2.5 శాతం ఈక్విటీ వాటాను విక్రయించే అవకాశం ఉందని రాయిటర్స్ కథనం వెల్లడించింది. గత నవంబరులో అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెఫ్రీస్.. రిలయన్స్ జియో విలువను 18,000 కోట్ల డాలర్లుగా (మన కరెన్సీలో రూ.16.2 లక్షల కోట్లు) అంచనా వేసింది. ఈ లెక్కన, 2.5 శాతం వాటా విక్రయం ద్వారా కంపెనీ 450 కోట్ల డాలర్లు (రూ.40,500 కోట్లు) సమీకరించే అవకాశం ఉంది. అంటే, దేశీయ క్యాపిటల్ మార్కెట్ చరిత్రలో ఇదే అతిపెద్ద ఐపీఓ కానుంది. 2024 అక్టోబరులో హ్యుండయ్ మోటార్ ఇండియా ఐపీఓ ద్వారా రూ.27,870 కోట్లు సేకరించింది. ఇప్పటివరకు ఇదే అతిపెద్ద ఇష్యూ.

జూన్‌కల్లా ఐపీఓకి: ఐపీఓ నిర్వహణ కోసం రిలయన్స్ జియో మర్చంట్ బ్యాంకర్లను అధికారికంగా నియమించుకోవాల్సి ఉంది. ఈ వివరాలను కంపెనీ త్వరలోనే వెల్లడించే అవకాశం ఉంది. వచ్చే 2-3 నెలల్లోనే కంపెనీ సెబీకి ఐపీఓ పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించవచ్చని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2026 జూన్ నాటికి జియో ఐపీఓకు రానుందని గత ఏడాది ఆగస్టులో జరిగిన ఆర్‌ఐఎల్ 48వ వార్షిక వాటాదారుల సమావేశంలో ముకేశ్ అంబానీ ప్రకటించారు.

5 రోజుల్లో రూ.13 లక్షల కోట్లు ఉఫ్

- ఈ వారమంతా నష్టాల్లోనే మార్కెట్లు
- సెన్సెక్స్ మరో 604 పాయింట్లు పతనం
- మళ్లీ 84,000 దిగువ స్థాయికి సూచీ
- ఐదు సెషన్లలో 2,186 పాయింట్ల నష్టం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు ఈ వారమంతా నష్టాల్లోనే పయనించాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ మరో 604.72 పాయింట్లు కోల్పోయి 83,576.24 వద్దకు జారుకుంది. దాంతో సూచీ 84,000 కీలక స్థాయిని కూడా చేజార్చుకుంది. నిఫ్టీ 193.55 పాయింట్లు క్షీణించి 25,683.30 వద్ద స్థిరపడింది. అమెరికా సుంకాలు 500 శాతానికి పెరగవచ్చన్న భయాలు, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ ఇందుకు కారణం. అమ్మకాల హోరులో ఈక్విటీ వర్గాల సంపద మరో రూ.4.43 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది. దాంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.467.74 లక్షల కోట్ల (5.19 లక్షల కోట్ల డాలర్లు)కు జారుకుంది. కాగా, ఈ వారంలోని 5 ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,185.77 పాయింట్లు (2.54 శాతం), నిఫ్టీ 645.25 పాయింట్లు (2.45 శాతం) క్షీణించాయి. ఈ ఐదు రోజుల్లో రూ.13.65 లక్షల కోట్ల మార్కెట్ సంపద ఆవిరైపోయింది.

బీసీసీఎల్ ఐపీఓకు తొలిరోజే 8 రెట్ల బిడ్లు

ప్రభుత్వ రంగ బొగ్గు ఉత్పత్తి దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ విభాగమైన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్) రూ.1,071 కోట్ల ఐపీఓకు అద్భుత స్పందన లభించింది. శుక్రవారం ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే ఈ ఇష్యూకు పూర్తి సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఆఫర్ తొలిరోజు ముగిసేసరికి 8.08 రెట్ల బిడ్లు లభించాయి. ఈ నెల 13తో ఆఫర్ ముగియనుంది.

త్వరలో విజయవాడ, విశాఖల్లోనూ అన్విత గ్రూప్ ప్రాజెక్టులు

హైదరాబాద్: నివాస, వాణిజ్య, హాస్పిటాలిటీ రంగాల్లో ఉన్న అన్విత గ్రూప్ త్వరలో తన కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం నగరాలకు విస్తరించనుంది. ఇందులో భాగంగా ఈ రెండు నగరాల్లో ప్రపంచస్థాయి ప్రాజెక్టులు చేపట్టనున్నట్టు గ్రూప్ సీఎండీ అచ్యుత రావు బొప్పన ప్రకటించారు. విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో నగరంలోనే ఎత్తయిన భవనాలను నిర్మిస్తామన్నారు. భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలకూ విస్తరించాలని అన్విత గ్రూప్ భావిస్తోంది. ప్రస్తుతం అన్విత గ్రూప్ హైదరాబాద్‌లో 80 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తోందని ఆయన చెప్పారు. ఇందులో కొల్లూరులోని అన్విత ఇవానా ప్రాజెక్ట్‌కు షెడ్యూల్ కంటే ముందుగానే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చిందని తెలిపారు. కాగా తమ గ్రూప్ బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ నటుడు, హిందూపురం ఎంఎల్‌ఏ నందమూరి బాలకృష్ణ వ్యవహరిస్తారని అచ్యుత రావు తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	600
వరంగల్	562	గోదావరి	585
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	విజయవాడ	152
వరంగల్	156	గుంటూరు	159
కరీంనగర్	156	ఒంగోలు	159
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	155
కర్నూలు	156	నెల్లూరు	160
విశాఖపట్నం	148	అనంతపురం	160
గోదావరి	152		

సంక్రాంతి సందడి

బడ్జెట్ నగ

తెలుగు లోగిళ్లలో అతిపెద్ద పండుగ సంక్రాంతి. వాకిట రంగవల్లులు... వంటింట పిండివంటలే కాదు... నచ్చిన నగ కొని ఆ సంబరాన్ని రెట్టింపు చేసుకొంటారు మహిళలు. కానీ ఇప్పుడు బంగారం మునుపెన్నడూ లేనంత ప్రియంగా మారింది. మరి కొనేదెలా అని సందేహిస్తున్నారా! అయితే బంగారు ఆభరణాల్లోనే ప్రత్యామ్నాయాలు ఉన్నాయంటున్నారు ప్రముఖ జెమాలజిస్ట్ రాధిక మన్నె.







ఎంపిక ఇలా...

● ఆభరణాల తయారీకి 24 క్యారెట్ల బంగారం అనువుగా ఉండదు. దీనికి మృదుత్వం ఎక్కువ. 22 క్యారెట్ల బంగారంలో ఇతర లోహాలను కలిపినప్పుడు రకరకాల ఆకృతుల్లో ఉన్న ఆభరణాలు తయారు చేయించుకోవచ్చు. అయితే ఈ మధ్యకాలంలో బంగారం ధర బాగా పెరిగిపోవడంవల్ల 22 క్యారెట్లకు ప్రత్యామ్నాయాలు ఏవైనా ఉన్నాయా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పాశ్చాత్య దేశాల్లో 22 క్యారెట్లతో పాటు 14, 9 క్యారెట్ల బంగారాన్ని కూడా ఉపయోగిస్తుంటారు. పసిడి ధర పెరగడంతో మన దేశంలో కూడా ఆభరణాల తయారీలో 14, 9 క్యారెట్ల బంగారాన్ని కూడా వాడుతున్నారు.

● 14 కేరెట్లలో 58.3 శాతం, 9 కేరెట్లలో 37.5 శాతం మాత్రమే స్వచ్ఛమైన బంగారం ఉంటుంది. పైగా వీటి ధర తక్కువ. ఇతర లోహాలు కలవడంవల్ల ఇవి బలంగా కూడా ఉంటాయి. వజ్రాలు, కెంపుల లాంటి రాళ్లను పొదిగినా అవి గట్టిగా పట్టి ఉంచుతాయి. 14 క్యారెట్ల బంగారానికి మంచి మెరుపు ఉంటుంది. ఇది ఎంగేజ్‌మెంట్ రింగ్స్, చోకర్స్, స్టేట్‌మెంట్ ఆభరణాల తయారీకి బాగుంటుంది. అవసరమనుకొంటే తక్కువ గ్రేడ్ వజ్రాలను పొదిగి రకరకాల ఆభరణాలు కూడా తయారు చేయవచ్చు. కాబట్టి ఇవి తక్కువ ధరకే లభ్యమవుతాయి.

● 9 క్యారెట్ల బంగారం చాలా గట్టిగా ఉంటుంది. దీనితో తేలికగా ఉండే ట్రెండీ డిజైన్లు ప్రయత్నించవచ్చు. దీని ధర చాలా తక్కువ కాబట్టి, ఎక్కువ బడ్జెట్‌ను మంచి వజ్రం కోసం కేటాయించవచ్చు. దీనితో తయారు చేసిన ఆభరణాలు రోజువారీ ధరించడానికి అనుకూలంగా ఉంటాయి. బడ్జెట్‌లోనే నెక్లెస్‌లు, ఇయర్ రింగ్స్‌తోపాటు ఇతర భారీ నగలను సైతం తయారు చేయవచ్చు.

వజ్రాల్లోనూ ప్రత్యామ్నాయాలు...

వజ్రాలను వాటి రంగు ఆధారంగా ఆంగ్ల అక్షరాలు 'డి' నుంచి 'జెడ్' వరకు గ్రేడ్‌లుగా విభజించారు. డి గ్రేడ్ వజ్రాలకు అసలు రంగు ఉండదు. ఇవి తెల్లగా ప్రకాశిస్తూ ఉంటాయి. వీటి విలువ అత్యధికం. జెడ్ గ్రేడ్ వజ్రాలు లేత పసుపు లేదా గోధుమ రంగులో మెరుస్తూ ఉంటాయి. వీటి విలువ కాస్త తక్కువ. ఇ, ఎఫ్ గ్రేడ్ వజ్రాలకు కూడా రంగు ఉండదు. వీటిని ప్రీమియమ్ గ్రేడ్స్‌గా పరిగణిస్తుంటారు. జి గ్రేడ్ వజ్రాలకు కొద్దిగా పసుపు రంగు జాడలు ఉంటాయి. ఇవి మామూలు కంటికి కనిపించవు. నిపుణులు మాత్రమే వీటిని గుర్తించగలుగుతారు. ఆకర్షణీయమైన మెరుపు వీటి సొంతం. ఇ, ఎఫ్ గ్రేడ్‌లతో పోలిస్తే వీటి ఖరీదు చాలా తక్కువ. అన్ని రకాల ఆభరణాల్లో అందంగా ఒదిగిపోతాయి కూడా.

● పెద్ద గ్రేడ్‌లకు బదులు జి గ్రేడ్‌ను ఎంచుకుంటే సరసమైన ధరకే వజ్రాల ఆభరణాలు కొనుక్కోవచ్చు. అలాగే ప్లాటినం, బంగారు ఆభరణాల్లోనూ అందంగా అమరుతాయి. మిగిలిన గ్రేడ్‌లన్నీ పసుపు లేదా గోధుమ రంగుల్లో మెరుస్తుంటాయి. జి, హెచ్ గ్రేడ్ వజ్రాలు కొనుగోలు చేస్తే, తిరిగి అమ్మడానికి కుదరదని అనుకొంటారు. కానీ వాటిని కూడా ఆ రోజు ధర ఆధారంగా రీసేల్ చేసుకోవచ్చు.

వీఎస్ క్లారిటీ చాలు...

ఆభరణాల్లో కూర్చే వజ్రాలు పూర్తిగా క్లారిటీతో ఉండాల్సిన పనిలేదు. చిన్న చిన్న లోపాలు ఉన్న వీఎస్ (వెరీ స్లైట్లీ ఇన్‌క్లూడెడ్) వజ్రాలతో కూడా చక్కగా నగలు చేయించుకోవచ్చు. వజ్రాన్ని ఆభరణంలో చేర్చిన తరువాత అందరి దృష్టి దాని మెరుపు పైనే ఉంటుంది కానీ లోపం మీద కాదు. క్లారిటీ తక్కువగా ఉన్నప్పటికీ కట్ బాగుంటే వజ్రాలు అందంగా మెరుస్తూ ఆకట్టుకుంటాయి. కలర్, క్లారిటీలకు కాకుండా సైజుకు ప్రాధాన్యమిస్తే తక్కువ బడ్జెట్‌లోనే చక్కని వజ్రాభరణాలను సొంతం చేసుకోవచ్చు.

వంటిల్లు

సంక్రాంతి రుచులు..!

సంక్రాంతి పండక్కి మనం అరిసెలు, చక్కిలాలు, నువ్వుల ఉండలు లాంటి ఎన్నో రకాల పిండి వంటలు చేసుకుంటూ ఉంటాం. మనలాగే ఇతర రాష్ట్రాలవారు కూడా ప్రత్యేకమైన సంప్రదాయ వంటలు చేస్తుంటారు. వాటిలో కొన్ని మీకోసం...

దాల్ బాఫ్లా (మధ్యప్రదేశ్)



కావాల్సిన పదార్థాలు

కంది పప్పు- ముప్పావు కప్పు, పసుపు- ఒక చెంచా, ఉప్పు- తగినంత, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- అర కప్పు, గోధుమ పిండి - ఒకటిన్నర కప్పులు, బొంబాయి రవ్వ- అర కప్పు, బేకింగ్ సోడా- అర చెంచా, చక్కెర- అర చెంచా, పెరుగు- అర కప్పు, నెయ్యి- పది చెంచాలు, జీలకర్ర- రెండు చెంచాలు, వాము- ఒక చెంచా, ఇంగువ- పావు చెంచా, అల్లం తరుగు- ఒక చెంచా, వెల్లుల్లి తరుగు- ఒక చెంచా, పచ్చి మిర్చి- రెండు, కారం- అర చెంచా, నిమ్మ రసం- ఒక చెంచా, కొత్తిమీర- కొద్దిగా

తయారీ విధానం

● ఒక గిన్నెలో కంది పప్పును తీసుకుని శుభ్రంగా కడిగి నిండా నీళ్లు పోసి పావుగంటసేపు నానబెట్టాలి. స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో నానిన కందిపప్పు, అర చెంచా పసుపు, తగినంత ఉప్పు, టమాటా ముక్కలు వేసి మూడు కప్పుల నీళ్లు పోసి మూతపెట్టాలి. అయిదు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. ఆవిరి మొత్తం పోయాక మూత తీసి పప్పును గరిటెతో మెత్తగా మెదపాలి. స్టవ్ మీద చిన్న గిన్నెపెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. అందులో ఒక చెంచా జీలకర్ర, ఇంగువ, అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, చిటికెడు పసుపు, కారం వేసి.. ఈ పోపు మిశ్రమాన్ని పప్పులో కలపాలి. చివరగా నిమ్మరసం, కొత్తిమీర తరుగు కూడా వేసి కలిపి మూతపెట్టి ఉంచాలి.

● వెడల్పాటి గిన్నెలో గోధుమ పిండి, బొంబాయి రవ్వ, తగినంత ఉప్పు, బేకింగ్ సోడా, చక్కెర, పెరుగు వేసి చెంచాతో బాగా కలపాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. అందులో ఒక చెంచా జీలకర్ర, అర చెంచా పసుపు, వాము వేసి అవి వేగిన తరువాత గోధుమపిండి మిశ్రమంలో పోసి బాగా కలపాలి. ఆపైన పిండిలో కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి. దీనిపైన తడిగుడ్డ కప్పి పావుగంటసేపు నాననివ్వాలి. తరువాత పిండిని చిన్న ముద్దలుగా చేసి మధ్యలో నొక్కి బిళ్లల మాదిరి చేయాలి. స్టవ్ మీద పెద్ద గిన్నె పెట్టి సగానికిపైగా నీళ్లు పోసి మరిగించి ఆపైన పిండి బిళ్లలు వేసి పావుగంటసేపు ఉడికించాలి. బిళ్లలు పైకి తేలిన తరువాత వాటిని పళ్ళెంలోకి తీయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. తరువాత ఉడికించిన పిండి బిళ్లలు పరిచి పైన మూత పెట్టాలి. వీటిని చిన్న మంట మీద రెండువైపులా ఎర్రగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఇలా తయారుచేసిన బాఫ్లాలను నెయ్యి, పప్పుతో వేడి వేడిగా సర్వ్ చేయాలి.

ఆటెకి పిన్ని (పంజాబ్)



కావాల్సిన పదార్థాలు

బాదాం- 50 గ్రా, జీడిపప్పు- 50 గ్రా, వాల్‌నట్స్- 50 గ్రా, కిస్‌మిస్‌లు- 50 గ్రా, గోధుమ పిండి- 300 గ్రా, నెయ్యి- 200 గ్రా, గోంద్- 100 గ్రా, కర్బూజ గింజలు- 50 గ్రా, శొంఠి- 10 గ్రా, యాలకుల పొడి- 5 గ్రా, చక్కెర పొడి- 200 గ్రా

తయారీ విధానం

గోంద్ పలుకులను మిక్సీలో వేసి మెత్తని పొడిలా చేయాలి. బ్లెండర్‌లో బాదాం, జీడిపప్పు, వాల్‌నట్స్, కిస్‌మిస్‌లు వేసి కచ్చాపచ్చాగా బ్లెండ్ చేయాలి. స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి అందులో నెయ్యి, గోధుమ పిండి వేసి బాగా కలుపుతూ చిన్న మంట మీద దోరగా వేయించాలి.
తరువాత గోంద్ పొడి, కర్బూజ గింజలు వేసి కలపాలి. ఆపైన డ్రై ఫ్రూట్స్ పొడి, శొంఠి పొడి, యాలకుల పొడి వేసి కలిపి అయిదు నిమిషాలు వేయించి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మిశ్రమం చల్లారిన తరువాత అందులో చక్కెర పొడి వేసి కలిపి లడ్డూలు చుట్టాలి. ఇలా తయారుచేసిన ఆటె కి పిన్ని పది రోజుల వరకు నిల్వ ఉంటుంది.

గిలా పిఠా (అసోం)



కావాల్సిన పదార్థాలు

బియ్యప్పిండి- ఒక కప్పు, బెల్లం తురుం- ముప్పావు కప్పు, మంచినీళ్లు- పావు కప్పు, బేకింగ్ సోడా- చిటికెడు, యాలకులు- మూడు, నెయ్యి- ఒక చెంచా, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం

స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి బెల్లం తురుం వేసి మంచినీళ్లు పోసి కరిగించాలి. బెల్లం కరిగిన తరువాత బేకింగ్ సోడా వేసి కలిపి మరో వెడల్పాటి గిన్నెలోకి వడబోయాలి. అందులో యాలకుల పొడి, నెయ్యి, బియ్యప్పిండి వేసి ఉండలు లేకుండా మెత్తగా కలపాలి. అరచేతికి కొద్దిగా నూనె రాసుకుని కొద్దికొద్దిగా పిండిని తీసుకుంటూ గుండ్రని బిళ్లల్లా చేయాలి. ఈ బిళ్లలను ఒక పళ్లెంలో పేర్చి అవి ఆరిపోకుండా పైన తడిగుడ్డ కప్పాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి నూనె పోసి వేడిచేయాలి. అందులో కొన్ని కొన్ని బిళ్లలు వేస్తూ చిన్న మంట మీద రెండు వైపులా దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఇవి పైన కరకరలాడుతూ లోపల మెత్తగా ఉంటాయి. తింటుంటే అరిసెలను గుర్తుకు తెస్తాయి.

భోజన కుతూహలం

పెద్దములక తిన్నారా?



వంకాయ, ఉమ్మెత్త, టొమాటో, నేలములక, పెద్ద ములక, కామంచి, కంటకారి వంటి మొక్కల్లో సొలనైన్ అనే రసాయనం ఉంటుంది. అందుకే వృక్షశాస్త్రంలో వీటిని సొలనేసీ కుటుంబంగా ప్రకటించారు. తెలుగులో వంకాయకు 'ములక' అనే మరో పేరుంది. టొమాటో కూడా ఈ వృక్ష కుటుంబానికి చెందినవి కాబట్టి- ఒకప్పుడు వీటిని రామములక అనే పిలిచేవారు. ఇప్పుడు పెద్దములక కాయలు పొలాల గట్టున కనిపిస్తాయి. వీటి వల్ల అనేక రకాల ప్రయోజనాలున్నాయి. అవేమిటో చూద్దాం..

● పెద్ద ములకకాయలు వాత, కఫాలను హరించటంలో విశేషమైన పాత్రను పోషిస్తాయి.

● శ్వాసకోశ వ్యాధుల్లో కఫం అధికంగా చేరి ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు కలిగించే ఆస్తమా, దీర్ఘకాలిక దగ్గు, బ్రాంకైటిస్ వంటి సమస్యల్లో పెద్దములక సహజ ఉపశమనాన్ని ఇస్తుంది. దట్టమైన కఫాన్ని కరిగించి శ్వాస మార్గాలను స్వచ్ఛంగా ఉంచుతుంది.

● మందగించిన జీర్ణాగ్ని, ఆకలి లేకపోవటం, గ్యాసు, ఉబ్బరం లాంటివి తగ్గించటంలో ఇది సహాయపడుతుంది. ఆహారం సరిగ్గా జీర్ణమై శరీరానికి పోషణగా మారేలా చేస్తుంది.

● వాపు తగ్గించే, సూక్ష్మజీవుల్ని నియంత్రించే గుణాలు దీనికి ఉన్నాయి.

● మూత్ర విసర్జన సులభంగా జరిగేలా చేసి, మూత్రంలో మంట, మూత్రపిండాల్లో రాళ్ళను కరిగిస్తుంది కూడా!

● అరుణాచల్‌ప్రదేశ్ లో ఈ కాయల్ని ముఖ్య సందర్భాల్లో తప్పనిసరిగా కూర వండుకుని తింటారు.

● భోజనకుతూహల గ్రంథం ప్రకారం- లేత ములకకాయలను తింటే కఫ, వాత, పిత్త దోషాలన్నీ తొలగిపోతాయి. కొద్దిగా ముదిరిన కాయలు పైత్యం చేస్తాయి. పండినవి కఫాన్ని పెంచుతాయి.

● గంగరాజు అరుణాదేవి

ఐస్ వాటర్‌తో...



ముఖాన్ని ఐస్‌వాటర్‌తో కడుక్కుంటూ అందంగా మెరిసిపోవచ్చు. ఎలాగంటే...

● మొటిమలు ఎక్కువగా ఉన్నప్పుడు తరచూ ఐస్ వాటర్‌ను ముఖం మీద చిలకరించుకుంటూ ఉంటే సమస్య తీరుతుంది. మచ్చలు కూడా ఏర్పడవు.

● ఐస్ నీళ్లతో ముఖాన్ని కడగడం వల్ల చర్మానికి రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. దీంతో చర్మం బిగుతుగా మారుతుంది. నుదుటిమీద గీతలు, పెదవుల చుట్టూ ముడుతలు రావు. కళ్ల కింద ఏర్పడిన నల్లని వలయాలు తగ్గిపోతాయి.

● బయటి నుంచి ఇంటికి వచ్చిన తరువాత పావుగంటసేపు ఆగి ముఖం మీద ఐస్ వాటర్ చిలకరించుకుంటే చర్మం మీద ట్యానింగ్ పేరుకోదు. ముఖం ఛాయగా మెరుస్తుంది.

● అలసటగా అనిపించినప్పుడు ముఖాన్ని ఐస్ వాటర్‌తో కడుక్కుంటే ఒత్తిడి తగ్గి హాయిగా అనిపిస్తుంది. కళ్లు తెల్లగా ప్రకాశిస్తాయి. ముఖం మృదువుగా మారుతుంది.

● మేకప్ వేసుకునే ముందు ముఖాన్ని ఐస్‌వాటర్‌తో కడుక్కుంటే అలంకరణ ఎక్కువసేపు నిలిచి ఉంటుంది. ముఖం తేమతో నిండి ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

● నిద్ర లేచిన వెంటనే ముఖం ఉబ్బుగా కనిపిస్తే వెంటనే ఐస్‌వాటర్‌ను చిలకరించుకుంటే చాలు. సమస్య తీరుతుంది.

● జిడ్డు చర్మం ఉన్నవారు తరచూ ముఖాన్ని ఐస్‌వాటర్‌తో కడుక్కుంటూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



తెలుగు సినిమా ఎలా ఉండాలి?

- **విలన్ పాత్రనే హీరోగా చూపించడం సమాజ ఆరోగ్యానికి మంచిది కాదు**
- **ఉన్నది ఉన్నట్టుగానే సినిమాలు తీయాలి**
- **ఓటీటీ యుగంలో.. క్రియేటివిటీ కంటెంట్‌తో సినిమాలు రావాలి**
- **'అవకాయ అమరావతి' ఫెస్టివల్‌లో వక్తలు**

సమాజ గమనాన్ని వెనక్కి నెట్టే ప్రమాదకర ఆలోచనలు చేసే వ్యక్తుల నుంచే సినిమాల్లో విలన్ పాత్రలు పుట్టుకొస్తాయని, ప్రతి నాయకుడి పాత్రకు వాస్తవికత ఉంటుందని బాలీవుడ్ దిగ్గజ రచయితలు హుస్సేన్ జైదీ, సుధీర్ మిశ్రా, విల్లీ దీవర్, టాలీవుడ్ ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి అడ్డదారులు తొక్కే వ్యక్తులను చూసే ఈ తరహా పాత్రలను తాము సృష్టిస్తుంటామని వెల్లడించారు. 'ఆవకాయ అమరావతి' రెండో రోజు కార్యక్రమంలో భాగంగా నగరంలోని భవాని ద్వీపంలో జరిగిన ప్యూర్ ఈవిల్ కార్యక్రమంలో సినిమాల్లో ప్రతి నాయకులు(విలన్) పాత్రపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రముఖ జర్నలిస్ట్ బాలాజీ మిట్టల్ సమక్షంలో వారు రచించిన సినిమా కథలు, ఇతర రచనల్లో విలన్ పాత్ర పుట్టిన వైనాన్ని ప్రస్తావించారు. సమాజంలో మూడు రకాల విలన్ పాత్రలు తరచూ ప్రతి ఒక్కరికీ తారసపడుతుంటాయని యండమూరి అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అడ్డదారులు తొక్కే వ్యక్తులను చదివి రాసినవే విలన్ పాత్రలుగా చెప్పారు. ముంబాయి మాఫియా డాన్‌లను చూసి ఎన్నో విలన్ పాత్రలు సృష్టించామని ప్రముఖ రచయిత హుస్సేన్ జైదీ చెప్పారు. మాఫియా ముఠాను కొన్నేళ్ల పాటు అధ్యయనం చేసి పాత్రలను సృష్టించామన్నారు. అనుకున్నది సాధించేందుకు డాన్‌లు ఏ విధంగా ప్రవర్తిస్తారో కథల్లో వివరించామన్నారు. సమాజాన్ని గడగడలాడించిన మాఫియా క్వీన్ షీలా దీక్షిత్ బయోపిక్‌ను చర్చలో ప్రస్తావించారు. విలన్ పాత్రను హీరోగా చూపిస్తున్న తీరు సమాజ ఆరోగ్యానికి మంచిది కాదని రచయితలు అభిప్రాయపడ్డారు. ఇటీవల కాలంలో కొన్ని సినిమాల్లో విలన్‌ను హీరో పాత్రగా తీర్చిదిద్దడాన్ని వారు తప్పుబట్టారు. రాముడు- రావణుడు, కృష్ణుడు-కంసుడు తదితరులు ఎలా ఉంటారో రామాయణ, మహాభారత ఇతిహాసాల్లో ఉన్నదని గుర్తు చేశారు. కానీ నేటి చిత్రాల్లో పురాణాలు, ఇతిహాసాల్లోని ప్రతి నాయకుడి పాత్రను తీర్చిదిద్దుతున్న తీరు ఆమోద యోగ్యం కాదన్నారు.

కథలు చెప్పే తీరు మారుతోంది

మారుతున్న కాలానుగుణంగా కథలు చెప్పే విధానంలో తీరు మారుతోందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. 'కథ చెప్పే విధానంలో పరిణామం, భారతీయ పురాణాల ప్రయాణం' అనే అంశంపై గంట సేపు చర్చ నిర్వహించారు. కస్తూరి మురళీకృష్ణ, సంజీవ్ పస్రిచా, భ్రిం, అనురాధ పలు విషయాలపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. నాటి నుంచి నేటి వరకూ సినిమా రంగం పరిణామక్రమాన్ని విశ్లేషించారు. జనరేషన్‌లో వస్తున్న మార్పులపై లోతుగా చర్చించారు. పురాణ కథలను ఆధునిక యుగంలో ప్రస్తుత ప్రజలకు అవగాహన కలిగేలా చేస్తున్న తీరును కొనియాడారు. ప్రముఖ చిత్రకారుడు భ్రిం మాట్లాడుతూ పూర్వకాలంలో తీసిన పౌరాణిక చిత్రాలకు అప్పటి చిత్రకారులు గీసిన చిత్రాలే ప్రేరణ అన్నారు. పంచభూతాలను ఆరాధించటం, ప్రేమించటం చేయాలని కోరారు. రాబోయే పౌరాణిక సినిమాల్లో విలువలు ఉండేలా దర్శకులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కస్తూరి మురళీకృష్ణ మాట్లాడుతూ పూర్వకాలం సినిమాలలో కథ ఉన్నది ఉన్నట్లు తీసేవారని, రానురాను కథలకు సామాజిక అంశాలను జోడిస్తూ కథనంలో మార్పులు చేస్తున్నారని చెప్పారు. అప్పట్లో తీసిన మాయాబజార్ సినిమా ఎప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా నిలుస్తోందని అన్నారు. పురాణ కథలు చెప్పే విధానంలో ఎన్నోమార్పులు వస్తున్నాయని తెలిపారు.

ఓటీటీ యుగంలో తెలుగు సినిమా

ఓటీటీ యుగంలో తెలుగు సినిమా అనే కార్యక్రమంపై నిర్మాతలు, దర్శకులు, నటీనటులతో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఓటీటీలు క్రియేటివిటీ కంటెంట్‌కు వేదికలుగా ఉంటున్నాయని అభిప్రాయపడ్డారు. వెబ్ సిరీస్, వివిధ రకాల షోలు, సినిమాల కారణంగా వర్ధమాన రచయితలకు అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. ఓటీటీలో భిన్న సంస్కృతులను గౌరవించే తరహాలో సినిమాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్రూప్ సీఈఓ శుభాశిష్ సర్కార్ మాట్లాడుతూ భారతీయ సినీ రంగంపై ప్రభుత్వ విధానాలు, మార్కెటింగ్‌పై ఆయన సునిశిత విశ్లేషణ చేశారు. భారతీయ సినిమాలు, కథలు ఓటీటీ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయన్నారు. ప్రముఖ ఎడిటింగ్ నిపుణురాలు లీనా యాదవ్(సృజనాత్మక స్వేచ్ఛ) మాట్లాడుతూ ఓటీటీ వల్ల కొత్త రకమైన కథలు, క్లిష్టమైన పాత్రలు చేసే అవకాశం దొరికిందన్నారు. బాక్సాఫీస్ ఒత్తిడి కూడా గణనీయంగా తగ్గిందన్నారు. సోనీ లైవ్ కంటెంట్ హెడ్ స్వాగత్ ముఖర్జీ మాట్లాడుతూ ఓటీటీ వ్యాపారంలో మంచి కథ, రచయితలు, దర్శకులపై నమ్మకంతోనే తాము స్కామ్, మహారాణి వంటి షోలు నిర్వహించినట్లు చెప్పారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ కేవలం పాత ఫార్మెట్‌లో సినిమాలు చేస్తే ఇప్పుడు కుదరదన్నారు. ఓటీటీలో కూడా క్రియేటివ్‌గా కష్టపడాల్సి ఉందన్నారు. తెలుగులో మూసగా కాకుండా కొత్త కథల కోసం అన్వేషణ జరగాలన్నారు.అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బిజినెస్ హెడ్ సునీల్ చైనాని మాట్లాడుతూ 'ఆర్‌ఆర్‌ఆర్', 'పుష్ప' వంటి చిత్రాలు కేవలం థియేటర్ కోసం తీస్తేనే ఆ స్థాయిలో విజయం సాధిస్తాయన్నారు.

నవలను సినిమాగా తీయడం ఒక సవాల్

నవలను ఉన్నది ఉన్నట్టు తీస్తే సినిమా బోర్ కొడుతుందని యండమూరి, కోదండరాంరెడ్డి అభిప్రాయపడ్డారు. నవలలోని ఒక చిన్న అంశాన్ని తీసుకుని దాని చుట్టూ వాణిజ్య అంశాలను జోడించి స్క్రిప్ట్ సిద్ధం చేసేవారమన్నారు. ఛాలెంజ్ నవల చదవాలని యండమూరి పట్టుబట్టినా, రెండు పేజీలు చదవగానే తనకు నిద్ర వచ్చేదని కోదండరాంరెడ్డి హాస్యమాడారు.


విజయవాడ (ఆంధ్రజ్యోతి)

ముత్యాల ముగ్గు



ఎస్.అరుణ కుమారి, భాగ్యనగర్ కాలనీ, కడప

13 చుక్కలు 3 వరుసలు 3 వరకు



మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com



ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ ఫైనల్స్ నేడే

విజయవాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ బిస్కెట్లు... టేస్ట్ పార్టనర్ స్వస్తిక్ మసాలా. ప్రేయర్ పార్టనర్ పరిమళ్ మందిర్ వారి భారత్‌వాసీ అగర్‌బత్తి) తుది అంకానికి చేరుకున్నాయి. తుది విజేతలు ఎవరో తేల్చే ఫైనల్స్ శనివారం విజయవాడలో జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగాను, తమిళనాడు, కర్ణాటకల్లోను సుమారు 40 కేంద్రాల్లో ప్రాథమిక స్థాయి ముగ్గుల పోటీలు ఈ నెల 3, 4, 5, 6 తేదీల్లో జరిగాయి. దాదాపు ఆరు వేల మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో విజేతల నుంచి 30 మంది ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. వీరంతా విజయవాడలో జరిగే ఫైనల్స్‌లో పోటీ పడనున్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.30,000, నాలుగు ద్వితీయ బహుమతులు రూ.10,000 చొప్పున అందజేస్తారు. మరో 25 కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే అందరికీ స్పాన్సర్ల నుంచి గిఫ్ట్ హ్యాంపర్లు కూడా లభిస్తాయి. కొందరు రాజకీయ, అధికార ప్రముఖులు ఈ ఫైనల్స్‌కు హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు.

విశాఖలో ఇన్ఫోసిస్ శాశ్వత క్యాంపస్

- 20 ఎకరాలు కావాలంటూ దరఖాస్తు
- రెండుచోట్ల స్థలాల పరిశీలన

విశాఖపట్నం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దిగ్గజ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ విశాఖపట్నంలో తన కార్యకలాపాలను విస్తరించడానికి భూమి కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఏపీఐఐసీ అధికారులతో కలిసి పరదేశిపాలెం, ఎండాడ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న భూములను పరిశీలించింది. హైవేను ఆనుకొని ఎండాడలో దిశ పోలీస్ స్టేషన్ ఉన్న కొండపై 20 ఎకరాలు కేటాయించాలని, శాశ్వత క్యాంపస్ నిర్మాణం చేపడతామని దరఖాస్తు చేసింది. టీసీఎస్‌కు, కాగ్నిజెంట్ కంపెనీలకు ఎకరా 99 పైసలు చొప్పున ఇచ్చినట్లుగానే తమకూ భూములు కేటాయిస్తే భారీ సంఖ్యలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రతిపాదించింది. ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. టీసీఎస్‌కు రుషికొండ హిల్-3పై 21.6 ఎకరాలు, కాగ్నిజెంట్‌కు కాపులుప్పాడలో 21.33ఎకరాలు ఎకరా 99 పైసలు చొప్పున కేటాయించిన సంగతితెలిసిందే. టీసీఎస్ 12వేల మందికి, కాగ్నిజెంట్ 25వేలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఒప్పందం చేసుకున్నాయి.



రుషికొండలో ఇన్ఫోసిస్ కార్యాలయం



ప్రసంగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు. చిత్రంలో కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

స్వదేశీ టూరిజాన్ని ప్రోత్సహించండి

- లైట్‌హౌస్ ఫెస్టివల్ ప్రారంభ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు
- ఏపీలో 110 ప్రాజెక్టులకు 1.14 లక్షల కోట్లు: కేంద్ర మంత్రి సర్బానంద

విశాఖపట్నం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్వదేశీ టూరిజాన్ని ప్రోత్సహించాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. పోర్టులు, షిప్పింగ్, జల వనరుల శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఎంజీఎం పార్కు మైదానంలో నిర్వహిస్తున్న లైట్‌హౌస్ ఫెస్టివల్‌ను శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, దేశంలో అనేక అద్భుతమైన నగరాలు, సుందరమైన ప్రదేశాలు, ప్రాంతాలు ఉన్నాయని, వాటిని ఆస్వాదించాలని కోరారు. అమెరికాకు వైట్ హౌస్ ఉంటే, మనకు 200కుపైగా లైట్‌హౌస్‌లు ఉన్నాయని చెప్పారు. అతిథిగా హాజరైన కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జల రవాణా శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ గడిచిన 11 ఏళ్లలో లైట్ హౌస్ టూరిజం 500 శాతం అభివృద్ధి చెందిందని తెలిపారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర మంత్రి వెల్లడించారు. సాగరమాల పథకంలో భాగంగా ఏపీలో 110 ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు రూ.1.14 లక్షల కోట్లు వెచ్చించనున్నట్టు తెలిపారు.

క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి టెండరు ఖరారు

- 'ఎల్ అండ్ టీ' ఎల్-1 బిడ్‌కు సీఆర్డీఏ ఆమోదం

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజధానిలో క్వాంటం వ్యాలీ నిర్మాణానికి సంబంధించి మరో కీలక అడుగు పడింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ (ఏక్యూసీసీ) నిర్మాణానికి టెండరు ఖరారయింది. దీనికి సంబంధించిన ఎల్-1 బిడ్‌ను ఏపీ సీఆర్డీఏ శుక్రవారం ఆమోదించింది. రూ.103 కోట్లకు కాంట్రాక్టు దక్కించుకున్న 'ఎల్ అండ్ టీ' సంస్థకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ (ఎల్ఓఏ)ని అందజేసింది. దీని ప్రకారం కంప్యూటింగ్ సెంటర్ నమూనా రూపకల్పన, నిర్మాణాన్ని సదరు కాంట్రాక్టు సంస్థ చేపట్టనుంది. కంప్యూటింగ్ సెంటర్‌కు సీఆర్డీఏ నిధుల నుంచి రూ.137కోట్లు కేటాయిస్తూ మున్సిపల్ శాఖ పరిపాలనా అనుమతి మంజూరు చేసింది.

జాతీయ చిహ్నానికి ఆర్‌ఎస్‌ఎస్ నిక్కరు

- పౌర హక్కుల సంఘం సభల ఫ్లెక్సీపై ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 9(ఆంధ్రజ్యోతి): జాతీయ చిహ్నంలో మార్పులు, వివాదాస్పద నినాదాలతో రూపొందించిన పౌరహక్కుల సంఘం మహాసభల ఫ్లెక్సీలను పోలీసులు తొలగించారు. కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. తిరుపతిలో శని, ఆదివారాల్లో పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. సంఘం కార్యకర్తలు గురువారం అర్ధరాత్రి తిరుపతిలోని కొన్ని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇందులో... జాతీయ చిహ్నంలోని ధర్మపీఠానికి ఆర్‌ఎస్‌ఎస్ నిక్కర్ తొడిగినట్లు చిత్రీకరించారు. 'హేతువాదులను, ప్రజాస్వామిక వాదులను హత్య చేస్తున్న హిందూ మతోన్మాదులను శిక్షించాలి' అని మరో ఫ్లెక్సీలో రాశారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో పోలీసులు రంగంలోకి దిగి ఫ్లెక్సీలను తొలగించారు. పౌర హక్కుల సంఘం నేత క్రాంతి చైతన్యను, పబ్లిషర్ దుగ్గినేని మోహన్ కృష్ణను శుక్రవారం అరెస్టు చేశారు. ర్యాలీకి, సభలకు అనుమతి తీసుకోలేదని తిరుపతి డీఎస్పీ ప్రసాద్ వెల్లడించారు.

సునీల్ నాయక్ ముందస్తు బెయిల్ కొట్టివేత

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నాటి సీఐడీ డీఐజీ సునీల్ నాయక్‌కు కోర్టులో చుక్కెదురైంది. గుంటూరులోని రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. దీంతో పోలీసులు ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

కల్తీ నెయ్యి కేసులో విజయభాస్కర్‌రెడ్డికి చుక్కెదురు

- ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేసిన ఏసీబీ కోర్టు

తిరుపతి/నెల్లూరు(లీగల్), జనవరి 9(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో నిందితుడు(ఏ34)గా ఉన్న డెయిరీ నిపుణుడు విజయభాస్కర్‌రెడ్డి(62)కి కోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను నెల్లూరు ఏసీబీ కోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే డెయిరీల సామర్థ్యాన్ని, నెయ్యి తయారీలో నాణ్యతా ప్రమాణాలు పరిశీలించేందుకు దేవస్థానం నియమించుకున్న డెయిరీ టెక్నాలజీ నిపుణుల్లో విజయభాస్కర్ ఒకరు. సికింద్రాబాద్‌కు చెందిన ఆయన్ను టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో నిందితుడిగా చేరుస్తూ గత నవంబరు 23న నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ మెమో దాఖలు చేసింది. అప్పటినుంచీ ఆయన అజ్ఞాతంలో ఉంటున్నారు. పది రోజుల కిందట నెల్లూరు ఏసీబీ కోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై 7న వాదనలు జరిగాయి. సిట్ తరపున తిరుపతికి చెందిన ఏపీపీ జయశేఖర్ వాదనలు వినిపించారు. నెయ్యి సరఫరా చేసిన డెయిరీల ప్లాంట్లను తనిఖీ చేసేందుకు నెయ్యి నాణ్యత విషయంలో విజయభాస్కర్ తప్పుడు సమాచారం ఇచ్చి టీటీడీని, టెక్నికల్ కమిటీని, పాలకమండలిని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఆయా డెయిరీలకు అనుకూలంగా రిపోర్టులు ఇచ్చారని వివరించారు. "పలు డెయిరీల ప్లాంట్లను తనిఖీ చేయకుండానే చేసినట్టు, వాటికి తగిన సామర్థ్యం ఉందని అనుకూల రిపోర్టులు ఇవ్వడంతో అర్హత లేనప్పటికీ టీటీడీ నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొన్నాయి. భోలే బాబా డెయిరీలో నెయ్యి కల్తీ దందా జరిగింది. స్వల్ప పరిమాణంలో నెయ్యి తీసుకుని అందులో పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్, పామోలిన్‌లను అధికంగా కలిపారు. వాటికి బీటా కెరోటిన్, అసిటిక్ యాసిడ్ ఈస్టర్ తదితర రసాయనాలను జత చేసి కల్తీ నెయ్యి తయారు చేశారు. ల్యాబ్ టెస్టు వాల్యూస్‌కు తగ్గట్టుగా నెయ్యి ఫ్లేవర్ సహా పలు ఇతర కల్తీ పదార్థాలు కలిపారు. ఈ నెయ్యిని భోలేబాబాతో పాటు వైష్ణవీ, మాల్‌గంగా, ఏఆర్ తదితర డెయిరీల ద్వారా టీటీడీకి సరఫరా చేశారు. ఈ కల్తీ నెయ్యినే టీటీడీ శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించారు" అని ఏపీపీ వివరించారు. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డెయిరీ ఎండీ జగ్‌మోహన్ గుప్తా నుంచి విజయభాస్కర్‌రెడ్డి రూ.2.50లక్షలు లంచంగా తీసుకున్నారని, ఆల్ఫా డెయిరీ ప్రతినిధుల నుంచి 8 గ్రాముల గోల్డ్ కాయిన్, వైష్ణవి, భోలేబాబా, మాల్‌గంగా, ప్రీమియర్ ఫుడ్స్ తదితర డెయిరీల నుంచి హైదరాబాద్‌లోని హవాలా ఏజెంట్ ద్వారా రూ.83 లక్షలు లంచంగా తీసుకున్నారని ఆరోపించారు. ఆయా డెయిరీలకు జరిపిన బిల్లుల చెల్లింపులతో టీటీడీకి సుమారు రూ.118 కోట్ల నష్టం జరిగిందని చెప్పారు. విచారణకు హాజరు కాకుండా అజ్ఞాతంలో ఉన్న నిందితుడికి ముందస్తు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏపీపీ వాదనలతో ఏకీభవించిన ఏసీబీ కోర్టు.. విజయభాస్కర్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. కాగా, సికింద్రాబాద్‌లోని నిందితుడి నివాసంలో సిట్ అధికారులు ఇటీవల తనిఖీలు చేసి రూ.34 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

వైసీపీ నెత్తినెక్కి డ్యాన్స్ చేస్తోంది

తెలిసింది బూతులు తిట్టడం, కేసులు పెట్టడమే.. ఆ పార్టీ విషయంలో గట్టిగా ఉండాలి

- పిఠాపురం వచ్చి గొడవలు పెడితే ఏరేస్తా
- నాకు, చంద్రబాబుకు అపార అవగాహన ఉంది
- మా మధ్య విభేదాలు, అరమరికలు లేవు
- పిఠాపురం సంక్రాంతి సంబరాల్లో పవన్

కాకినాడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు మనశ్శాంతి లేకుండా చేసిందని, ఇప్పుడు మళ్లీ పాత పద్ధతులు మొదలుపెట్టిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ప్రభుత్వం మెతగ్గా ఉండటంతో వైసీపీ నెత్తినెక్కి డ్యాన్స్ చేస్తోందన్నారు. ఇదే విషయాన్ని పలుసార్లు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లానని, ఆయన ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వ్యక్తి కావడంతో నియంత్రణ పాటిద్దామని అంటున్నారని చెప్పారు. శుక్రవారం కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆయన పర్యటించారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో పవన్ మాట్లాడారు. "రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబుతో కలిసి కష్టపడి పనిచేస్తున్నాం. ఎన్ని పనులు చేస్తున్నా మాపై రాళ్లేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏ పనీ చేయలేదు. కేసులు పెట్టి భయపెట్టడమే వాళ్ల పని. వైసీపీ విషయంలో గట్టిగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రజలు కూటమికి అండగా ఉండకపోతే మళ్లీ నియంతృత్వ పోకడలు వస్తాయి. వైసీపీకి తెలిసింది బూతులు తిట్టడం, కేసులు పెట్టడమే. ఎక్కడ శాంతిభద్రతలకు భంగం కలిగినా కలెక్టర్లు, ఎస్పీలు ఉపేక్షించవద్దు. నా మాటలు మెతగ్గా ఉంటాయి. కానీ చేతలు గట్టిగా ఉంటాయి. రాజకీయాల్లో విమర్శలు చేయవచ్చు. కానీ కులాలు, మతాల మధ్య వివాదాలు రాజేస్తే పర్సనల్‌గా తీసుకుంటా. వ్యవస్థలకు ఎవరూ అతీతులు కాదు. పార్టీలు నన్ను, నా పార్టీని తిట్టినా ఫర్వాలేదు. కానీ ప్రజల మధ్య వైషమ్యాలు తెస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" అని పవన్ హెచ్చరించారు.



పిఠాపురం సంక్రాంతి సంబరాల్లో చిన్న పిల్లలకు భోగి పళ్లు పోస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, డప్పు కళాకారులతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

కూటమిని బలహీనం చేయవద్దు

"కూటమిని బలహీనం చేయవద్దు. నాకు, చంద్రబాబుకు మధ్య అపార అవగాహన ఉంది. మా మధ్య విభేదాలు, అరమరికలు లేవు. కొన్నిచోట్ల రెండుపార్టీల్లో నేతలు కూటమి నిలబడదని అంటుంటారు. పెన్షన్లు, 24గంటల్లో ధాన్యం డబ్బులు చెల్లించినా అంతా కూర్చుని చేసిందే. బలమైన పార్టీ, అనుభవం ఉన్న సీఎం ఉండడం వల్లే ఇది సాధ్యమైంది. అందుకే టీడీపీని గౌరవిస్తా. అన్యాయం జరిగితే రోడ్డెక్కి పోరాడడం జనసేన బలం. నా సిద్ధాంతాలు నమ్మి పార్టీలో చేరే వాళ్లు ఊరికి పదిమంది ఉన్నా వెయ్యిమందితో సమానం. రాష్ట్రానికి చంద్రబాబు అనుభవం చాలా అవసరం. ఆ అనుభవంతోనే 7లక్షల మంది రైతుల నుంచి 40లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.9,300 కోట్లు చెల్లించగలిగాం. గత ప్రభుత్వంలో ధాన్యం బకాయిల కోసం దేహీ అని అడగాల్సిన పరిస్థితి కల్పించారు. ఎన్టీఆర్ భరోసా కింద 63 లక్షలమందికి నెలకు రూ.2,750 కోట్ల పింఛన్ డబ్బులు ఇస్తున్నాం. తల్లికి వందనం కింద రూ.10వేల కోట్లు జమ చేశాం. గత గతంలో అన్నా క్యాంటీన్లు తీసేశారు. కూటమి వచ్చాక 4 కోట్ల భోజనాలు అందించాం. గత ప్రభుత్వంలో రహదారులు దారుణంగా ఉండేవి. కేంద్రం జలజీవన్ మిషన్ కింద అప్పట్లో రాష్ట్రానికి రూ.25 వేల కోట్లు ఇస్తే రూ.4 వేల కోట్లే ఖర్చుచేశారు. రాష్ట్రవాటా రూ.2 వేలకోట్లే. మిగిలిన డబ్బు ఏంచేశారో తెలియదు. పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చారు డ్రైనేజీలు లేవు. రోడ్లు లేవు. లోతట్టు ప్రాంతాల్లో స్థలాలు అంటగట్టారు" అని పవన్ విమర్శించారు.

బాబాయ్‌ని హత్య చేసినా..

"పిఠాపురం నా నియోజకవర్గం కావడంతో ఇక్కడ కొబ్బరిచెట్టు ఆకు పడినా, తాటాకు కింద పడినా, చెట్టుమీద నుంచి పక్షి ఈక రాలినా అమ్మో.. దారుణం అంటున్నారు. కానీ గత ప్రభుత్వ నేతల్లో వారి నియోజకవర్గాల్లో అసలు ఏం జరుగుతుందో కూడా తెలియనివ్వలేదు. పులివెందులలో బాబాయ్‌ను హత్య చేసినా ఆ విషయం బయటకు రానివ్వలేదు. కానీ పిఠాపురంలో ఓ స్కూల్లో ఇద్దరు పిల్లలు కొట్టుకుంటే మాత్రం పెద్ద విషయం అయిపోతోంది. బడిపిల్లలు కొట్టుకున్న దానికి కులాలు అంటగడుతుంటే ఇంకేం చెప్పాలి. పిఠాపురం వచ్చి గొడవలు పెడితే ఏరేస్తా. పిడికెడు గింజలు పండించడం కష్టం. కానీ చేతికి వచ్చిన పంటను కూల్చడం సులువు. కూటమిని నిలబెట్టడం కష్టం. కానీ కష్టపడి దాన్ని ముందుకు తీసుకెళ్తుంటే చెడగొట్టడం తేలిక. నేను మెత్తగా కనిపిస్తాననుకుంటున్నారు. కానీ నా మొండితనం గురించి ఎవరికీ తెలియదు. అధికారం ఉన్నా లేకున్నా నా జోలికి వస్తే ఊరుకోను. వ్యక్తిగతంగా నేను ఎవరితో గొడవ పెట్టుకోను. ఆవేదన, బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చాను. డబ్బు సంపాదన కోసం కాదు. నేను పెద్ద యాక్టర్‌ను. నా సినిమాలు ఫ్లాప్ అయినా వాటికి డబ్బులు తీసుకునే సామర్థ్యం ఉంది. అయితే సమాజానికి ఎంతో కొంత ఇవ్వాలనే వచ్చా. ఎవరైనా మతం, కులం, వర్గాల పేరుతో గొడవలు తెస్తే వారికి ప్రజలే బాధ్యత తెలియజేయాలి" అని పవన్ అన్నారు. ఆయన తన ప్రసంగంలో సరదాగా గోదారి యాసలో మాట్లాడారు. సంక్రాంతి అంటే కోడి పందేలు, పేకాటే కాదని, సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉండాలన్నారు.

పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభ

"పిఠాపురం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని అనుకోలేదు. ఆఖరి శ్వాస వరకు మీకోసం పనిచేస్తా. దీనికి అధికారంతో సంబంధం లేదు. నాకు ఓటమి భయం లేదు. నాకు యుద్ధకళలు అంటే ఇష్టం. అందుకే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నా. పిఠాపురంలో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, ఫైన్‌ఆర్ట్స్ అకాడమీ నా ట్రస్ట్ తరపున నెలకొల్పాలని నిరయించాను. మార్చి 14న జనసేన ఆవిర్భావ సభను పిఠాపురంలోనే నిర్వహించాలని నిర్ణయించాం. నేను ఎక్కడ ఉన్నా పిఠాపురం నా గుండెల్లో ఉంటుంది" అని పవన్‌కల్యాణ్ తెలిపారు.

కళాకారులతో కలసి పవన్ థింసా

పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన పవన్‌కు సంప్రదాయ నృత్యాలతో కళాకారులు స్వాగతం పలికారు. పవన్ ఆసక్తిగా తిలకించారు. వారితో సరదాగా కాసేపు ముచ్చటించి ఫొటోలు దిగారు. థింసా నృత్య కళాకారులతో కలిసి నృత్యం చేశారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ, ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మలబాబు, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్మ తదితరులతో కలిసి సంక్రాంతి సంబరాల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. హరిదాసులకు పవన్ స్వయంపాకం దానం చేశారు. చిన్నారులకు భోగిపళ్లు వేశారు. రాట్నం ఒడికి చేనేత మగ్గాన్ని పరిశీలించారు. లేపాక్షి స్టాల్‌లో ఏటికొప్పాక బొమ్మల తయారీని పరిశీలించారు. అనంతరం సంక్రాంతి మహోత్సవాలను పవన్ ప్రారంభించి ప్రసంగించారు. సభ ముగిసిన తర్వాత పిఠాపురం పట్టణంలో 40 నిమిషాల పాటు కాలినడకన పర్యటించి ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు.

'టెట్'లో 52% మంది టీచర్లు ఫెయిల్

- 47.82 శాతం మంది మాత్రమే పాస్
- 31,886 మందికి 15,239 మంది ఉత్తీర్ణత
- పాస్ కాని వారికి రెండేళ్ల వరకు గడువు
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టెట్ పరీక్ష
- ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు హాజరైన టీచర్లలో 52.18 శాతం మంది ఫెయిలయ్యారు. తాజాగా విడుదల చేసిన టెట్ ఫలితాల్లో 31,886 మంది ఉపాధ్యాయులకుగాను 15,239 (47.82 శాతం) మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 16,647 మంది ఉత్తీర్ణులు కాలేకపోయారు. అయితే, టీచర్లు కాని వారి ఉత్తీర్ణతతో పోలిస్తే ఇది కాస్త ఎక్కువే. సాధారణ అభ్యర్థులు 2,48,427 మంది టెట్ రాయగా వారిలో 97,560(39.27శాతం) మాత్రమే అర్హత సాధించారు. సాధారణ అభ్యర్థులతో పోలిస్తే టీచర్లు 9 శాతం అదనంగా పాసయ్యారు. టెట్-2025 ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం 'ఎక్స్'లో విడుదల చేశారు. ఇన్ సర్వీసు టీచర్లు కాకుండా ఇతర అభ్యర్థులు 2,71,692 మంది టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1(ఏ)కు 1,06,747 మంది, పేపర్-1(బీ)కి 2,497 మంది, పేపర్-2(ఏ)కు 1,59,146 మంది, పేపర్-2(బీ)కి 3,302 మంది దరఖాస్తు చేసుకున్నారు. కంప్యూటర్ ఆధారంగా డిసెంబరు 10 నుంచి 21 వరకు టెట్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రం సహా ఇతర రాష్ట్రాల్లో మొత్తం 133 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. కాగా సాధారణ అభ్యర్థులు 2,48,427 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 97,560 మంది అర్హత సాధించారు. ఇన్ సర్వీస్ టీచర్లు 31,886 మంది రాస్తే 15,239 మంది అర్హత సాధించారు. గత నాలుగు టెట్‌లను పరిశీలిస్తే ఈ సారి అతి తక్కువ ఉత్తీర్ణత నమోదైంది. గత నాలుగు టెట్‌లలో కనీసం 50 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

సుప్రీం తీర్పుతోనే..

2011కు ముందు టెట్ లేకుండా నేరుగా డీఎస్సీ పరీక్షతో టీచర్ నియామకాలు చేపట్టారు. టెట్ వచ్చిన తర్వాత తొలుత టెట్ అర్హత సాధించి, ఆ తర్వాత డీఎస్సీ రాయాలి. అయితే ఓ కేసులో గతేడాది సెప్టెంబరు 1న సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. గతంలో టెట్ లేకుండా ఉద్యోగాలు పొందిన టీచర్లంతా తప్పనిసరిగా అర్హత పరీక్ష రాయాల్సిందేనని ఆదేశించింది. దీంతో దేశవ్యాప్తంగా దాదాపు 30 లక్షల మంది టీచర్లు టెట్ రాయాల్సిన పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో 1,27,802 మందికి టెట్ లేదు. అయితే సుప్రీంకోర్టు తీర్పులో ఐదేళ్లలోపు రిటైర్ అయ్యేవారికి మినహాయింపు ఇచ్చారు. దీంతో 1,04,595 మంది తప్పనిసరిగా టెట్ అర్హత సాధించాల్సి ఉంది. కాగా, దీనిపై సుప్రీంలో రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. మినహాయింపు లభిస్తుందని దేశవ్యాప్తంగా టీచర్లు ఎదురుచూస్తున్నారు. అయితే.. అర్హత సాధించడం మేలని ఆలోచించి రాష్ట్రంలో 31,886 మంది టెట్ రాయగా వారిలో కేవలం 47.82 శాతం మంది మాత్రమే అర్హత సాధించారు. మిగిలిన 89,356 మంది టీచర్లు రాష్ట్రంలో టెట్ అర్హత సాధించాల్సి ఉంది. వారికి రెండేళ్ల వరకు గడువు ఉంది. అయితే, ఈలోగా సుప్రీంకోర్టులో మినహాయింపు లభిస్తే టెట్ రాసే అవసరం ఉండదు.

'రద్దు'పై రచ్చకు రెడీ!

భారతీ సిమెంట్స్ పారిపోతోందంటూ ప్రకటన

- జగన్ ముందస్తు బ్లాక్ మెయిలింగ్
- కడప జిల్లాలో 752 ఎకరాల సున్నపురాయి లీజు
- కేంద్ర చట్టాలు, హైకోర్టు తీర్పుల ఉల్లంఘన
- తీర్పును వక్రీకరిస్తూ ఎన్నికల ముందు లీజుల పునరుద్ధరణ
- నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం
- సమాధానం చెప్పలేక మౌనంగా ఉన్న యాజమాన్యం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు దెబ్బకు భారతీ సిమెంట్స్ పారిపోతోందట! సజ్జన్ జిందాల్, అరబిందో, షిరిడీ సాయి, మైహోమ్, దాల్మియా, శ్రీసిమెంట్స్ వంటి పరిశ్రమల యాజమాన్యాలు పారిపోతున్నాయట! ఇది... మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉవాచ! ఔనా... పారిశ్రామికవేత్తలకు ఎర్రతివాచీ పరచడం మాత్రమే తెలిసిన కూటమి సర్కారుకు, వారిని బెదరగొట్టి తరిమేయడమూ తెలుసా!? అని ఆయన అందరినీ ఆశ్చర్యపరిచారు. 'భారతీ సిమెంట్స్ పారిపోతోంది' అంటూ, ఇతర కంపెనీల పేర్లనూ ప్రస్తావించడం వెనుక భారీ వ్యూహమే ఉన్నట్లు తెలుస్తోంది. తాను ముఖ్యమంత్రిగా ఉండగా తన కుటుంబానికే చెందిన భారతీ సిమెంట్స్‌కు అడ్డగోలుగా మేళ్లు చేసుకున్న జగన్... ఇప్పుడు కూటమి ప్రభుత్వం దానిపై చర్యలు తీసుకోకుండా ముందస్తు 'బ్లాక్ మెయిలింగ్'కు దిగినట్లుగా అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఎందుకంటే... వైఎస్ హయాంలో రఘురాం సిమెంట్స్‌కు కడప జిల్లాలో 752 ఎకరాల్లో సున్నపురాయి లీజులు కేటాయించారు. ఆ తర్వాత... అది 'భారతీ సిమెంట్స్'గా మారింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వంతో ఒప్పందం కుదరనప్పటికీ... మైనింగ్ లీజులనూ భారతీ సిమెంట్స్‌కు బదలాయించేశారు. ఇదో... ఉల్లంఘన. ఇక... 2015లో కేంద ప్రభుత్వం గనులు, ఖనిజాల అభివృద్ధి నియంత్రణ (ఎంఎండీఆర్) చట్టాన్ని సవరించింది. ఈ చట్టానికి లోబడని మైనింగ్ లీజులను రద్దు చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు పంపింది. ఆ మేరకు... 2016లో భారతీ సిమెంట్స్ సహా అనేక కంపెనీలకు నోటీసులు వెళ్లాయి. 45 రోజుల్లోపు సమాధానం చెప్పాలని అందులో స్పష్టం చేసినా... భారతీ సిమెంట్స్ పట్టించుకోలేదు. దీంతో... 2018లో భారతీ సిమెంట్స్‌కు ఇచ్చిన సున్నపురాయి లీజులను రద్దు చేశారు. దీనిపై జగన్ (భారతీ సిమెంట్స్ యాజమాన్యం) కేంద్రం వద్ద చేసుకున్న ప్రయత్నాలు ఫలించలేదు. 2021లో హైకోర్టును ఆశ్రయించారు. "మీరు రాష్ట్ర ప్రభుత్వాన్నే ఆశ్రయించండి. ప్రభుత్వమూ భారతీ సిమెంట్స్ వాదనలు వినాలి" అని 2023లో హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. అప్పుడు 'ప్రభుత్వం' అంటే... జగనే! ఇంకేముంది... అన్నీ ఆయనకు అనుకూలంగా మార్చుకున్నారు. డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై రిటైర్డ్ న్యాయమూర్తి చేత లీగల్ ఒపీనియన్ తీసుకున్నారు. 'వాదనలు వినండి' అని మాత్రమే హైకోర్టు చెప్పగా... 'లీజులు ఇచ్చేయండి' అన్నట్లుగా వక్రీకరించి, భారతీ సిమెంట్స్‌కు సున్నపురాయి లీజులు పునరుద్ధరించుకున్నారు. అది కూడా ఒకేసారి 50 ఏళ్లకు! ఇదం తా... మరికొన్ని నెలల్లో జగన్ 'మాజీ' అవుతారనగా జరిగిన పరిణామం. కేంద్ర మైనింగ్ చట్టాలకు, కోర్టు తీర్పులకు, ఇతర నిబంధనలకు విరుద్ధంగా లీజుల పునరుద్ధరణ జరగడంతో... కూటమి ప్రభుత్వం భారతీ సిమెంట్స్‌తో పాటు మరో రెండు కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. 14 రోజుల్లో స్పందించాలంటూ గత నెలలో (2025 డిసెంబరు) నోటీసులు ఇవ్వగా... భారతీ సిమెంట్స్ ఇప్పటిదాకా స్పందించలేదు. నిబంధనల ప్రకారం 45 రోజులు వేచి చూసి... ఈ మైనింగ్ లీజులను రద్దు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది.

'రద్దు చేస్తే' రచ్చ చేయాలని...

మైనింగ్ లీజుల్లో ఉల్లంఘనలు గుర్తించినప్పుడు నోటీసులు జారీ చేయడం సర్వసాధారణం. ఆయా కంపెనీలు ఇచ్చిన సమాధానం ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటాయి. ఈ విషయం జగన్‌కూ తెలుసు. అయితే... ప్రభుత్వం జారీ చేసిన నోటీసులకు సంతృప్తికరమైన సమాధానం భారతీ సిమెంట్స్ వద్ద కూడా లేదు. అంటే... చట్ట ప్రకారం లీజులు రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నట్లే! దీనినే రాజకీయంగా ఉపయోగించుకునేందుకు జగన్ ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం భారతీ సిమెంట్స్ గనుల లీజు రద్దు చేస్తే... దీనిని కక్షసాధింపు చర్యగా అభివర్ణిస్తూ జనంలోకి వెళ్లడం ఒక ఆలోచన. అలాగే... కూటమి ప్రభుత్వం పరిశ్రమలను తరిమేస్తోందని జాతీయ స్థాయిలో వివాదాస్పదం చేయాలన్నది మరో వ్యూహం! ఇందులో భాగంగానే... తమ సొంత కంపెనీతోపాటు మరికొన్ని సంస్థల పేర్లనూ ప్రస్తావించి 'చంద్రబాబు బెదిరింపులకు పారిపోతున్నాయి' అని జగన్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. సజ్జన్ జిందాల్ జగన్‌కు అత్యంత సన్నిహితుడు. ముంబై నటి కేసులో ఆయన తీరు వివాదాస్పదమైంది. ఇక... జగన్ హయాంలో బాగా లబ్ధి పొందిన మరో సంస్థ 'షిరిడీ సాయి'. వాళ్లు ఇప్పటికీ రాష్ట్రంలో చక్కగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. తెలంగాణ పారిశ్రామికవేత్త రామేశ్వరరావు 'మై హోం సిమెంట్స్' ఏపీని వీడుతున్నట్లు ఎక్కడా చెప్పలేదు. అయినప్పటికీ... ఆయా కంపెనీల పేర్లనూ జగన్ ప్రస్తావించారు.

ప్రత్యామ్నాయ ఉద్యోగమా.. పరిహారమా?

ఎనిమిది వారాల్లోగా ఐచ్ఛికాలు ఇవ్వండి

- అనారోగ్య కారణాలతో పదవీ విరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగులకు హైకోర్టు ఉపశమనం

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో పదవీ విరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగులకు హైకోర్టులో ఉపశమనం లభించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో వీలీనం చేసిన తరువాత నిలిచిపోయిన ఆర్థిక ప్రయోజనాలు, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన విషయంలో కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. రవాణాశాఖ జారీ చేసిన జీవో 58ని అనుసరించి ప్రత్యామ్నాయ ఉద్యోగం కావాలా? లేక పరిహారం కావాలా? అనే విషయాన్ని తెలియపరుస్తూ 8వారాల్లోగా ఐచ్ఛికాలు ఇవ్వాలని పిటిషనర్లను ఆదేశించింది. అదనపు పరిహారం కోసం వచ్చిన వినతుల ను గరిష్ఠంగా 3 నెలల్లోగా, ప్రత్యామ్నాయ ఉద్యోగం కోసం వచ్చిన వినతులను ఖాళీల లభ్యతను బట్టి 6నెల ల్లోగా పరిష్కరించాలని రవాణాశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది.ఈమేరకు హైకోర్టు సింగిల్‌జడ్జి ఇటీవల తీర్పిచ్చారు.

నైపుణ్యాలతోనే ఉద్యోగాలు

- డిజిటల్ టెక్నాలజీ సదస్సులో విశాఖ ఎంపీ శ్రీభరత్



డిజిటల్ టెక్నాలజీ సదస్సులో రోబోల సందడి

విశాఖపట్నం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ రాకతో పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అలా ఆధునిక సాంకేతికలను అందిపుచ్చుకున్నవారే భవిష్యతులో నిలదొక్కుకుంటారని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. విశాఖపట్నంలోని సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏపీ డిజిటల్ టెక్నాలజీ సదస్సు-26 రెండో ఎడిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ పెట్టుబడులతో కంపెనీలు తీసుకొస్తోందని, వాటి ద్వారా కేవలం ఉత్తరాంధ్రలోనే ఐదు లక్షల ఉద్యోగాలు ఇస్తాయని, వాటిని అందిపుచ్చుకోవాలంటే తగిన నైపుణ్యం ఉండాలన్నారు. ఇదే వేదికపై రెండు స్టార్టప్‌లతో ఎస్టీపీఐ అవగాహన ఒప్పందాలు మార్చుకుంది. ఏపీడీటీఐ నెట్‌వర్క్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు, ఎస్టీపీఐ డిప్యూటీ డైరెక్టర్ కవిత, హెచ్‌సీఎల్ జీసీసీ గ్లోబల్ లీడర్ కిరణ్ బాబు చెరుకూరి, ఐటాప్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి కిశోర్, తదితరులు ప్రసంగించారు. కాగా, సదస్సులో రోబోలు సందడి చేశాయి. కాకినాడ కైట్ సంస్థ విద్యార్థులతో ఓ రోబో స్టాల్‌ను ఏర్పాటు చేసింది. అందులో యునిట్రీ జీ1 హ్యూమనాయ్డ్ రోబో అందరినీ ఆకట్టుకుంది. సెల్యూట్ కొట్టడం, షేక్ హ్యాండ్ ఇవ్వడం, మోకాళ్లపై కూర్చోవడం వంటివి చేసింది. ఇలాంటి రోబోలను ఆర్డర్లపై అవసరాలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ అమర్చి పంపిణీ చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.



పొంగళ్లు వండుతున్న మగవాళ్లు (ఫైల్)

మగవాళ్లకు మాత్రమే

పండగైనా, జాతరైనా.. చాలా వరకు ఆడవాళ్లదే హవా! పూజల నుంచి వంటల వరకు అంతా వారిదే!! అయితే ఆ గ్రామంలో సంక్రాంతికి ముందు వచ్చే ఆదివారం జరిగే వేడుకల ప్రత్యేకతే వేరు.. అక్కడ జరిగే పొంగుబాళ్ల పండగ మగవాళ్లకు మాత్రమే పరిమితం! గ్రామంలోని సంజీవరాయస్వామికి మగవాళ్లే పొంగళ్లు వండి, నైవేద్యంగా సమర్పించి పూజలు చేస్తారు. తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం తిప్పాయపల్లెలో రేపు(ఆదివారం) జరగనున్న ఈ ఆసక్తిర మైన పండుగ విశేషాలివీ..

- సంజీవరాయునికి పురుషులతో పొంగళ్లు
- పొయ్యి మంట, వంట అంతా వారిదే..
- గుడి ప్రవేశం, ప్రసాదం మహిళలకు నిషిద్ధం
- రేపు తిప్పాయపల్లెలో పొంగుబాళ్ల పండగ
- ఏటా సంక్రాంతికి ముందు వచ్చే ఆదివారం నాడు ప్రత్యేక ఆచారం

(రైల్వేకోడూరు-ఆంధ్రజ్యోతి)

రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం తిప్పాయపల్లెలోని సంజీవరాయస్వామికి ఒక ప్రత్యేకత ఉంది. రాతి శిల రూపంలో ఉన్న ఆయనకు ఏటా సంక్రాంతికి ముందు వచ్చే ఆదివారం మగవాళ్లే పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. తిప్పాయపల్లెతో పాటు చుట్టుపక్కల గ్రామాల మగవాళ్లు కూడా ఈ వేడుకల్లో పాల్గొంటారు. మగదేవుడైన సంజీవరాయునికి పూజాక్రతువులన్నీ పూర్తిగా మగవాళ్లే చేయాలి. ఇది అనాదిగా వస్తున్న ఆచారం. పురుషులు తెల్లవారుజామునే పొంగలికి అవసరమయ్యే సామగ్రిని బుట్టలో పెట్టుకొని, చేతిలో కట్టెలు తీసుకుని ఇళ్లనుంచి సంజీవరాయస్వామి ఆలయానికి చేరుకుంటారు. వీరి వెంట ఆడవాళ్లు ఎవరూ రారు. మగవాళ్లే పొయ్యి వెలిగించి, పొంగలి వండుతారు. అనంతరం స్వామికి నైవేద్యంగా పెట్టి పూజలు చేస్తారు. ఆ పొంగలిని కూడా మగవాళ్లు మాత్రమే తినాలి. మహిళలు ముట్టుకోరు.

గేటు బయటే మహిళలు

సంజీవరాయుని సన్నిధికి వచ్చి, స్వామిని దర్శించుకోవడానికీ ఆడవాళ్లకు ప్రవేశం లేదు. వారు గేటు బయట నిలబడాల్సి ఉంటుంది. పూజ చేసిన తర్వాత పూజారే గేటు వెలుపలకు వచ్చి మహిళలకు హారతి ఇస్తారు. అయితే బాలికలు, వృద్ధురాళ్లకు మాత్రం ఈ నిషేధం వర్తించదు. ఆలయానికి వచ్చి సంజీవరాయుడిని దర్శించుకునే అవకాశం కల్పిస్తారు.



సంజీవరాయుని ఆలయం, ఆలయం వెలుపలే ఉన్న మహిళలు (ఫైల్); సంజీవరాయస్వామి రాతి శిల (ఇన్‌సెట్)

ఇదీ సంజీవరాయుని కథ

సంజీవరాయుడికి విగ్రహ రూపం ఉండదు. కేవలం నిలబడి ఉన్న రాతి బండపై చెక్కిన బీజాక్షరాలనే సంజీవరాయుడిగా భావించి ప్రజలు కొలుస్తారు. ఇందుకు ఈ ప్రాంతంలో ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. తిప్పాయపల్లె గ్రామస్తుల కథనం ప్రకారం... కరువు కాటకాలు, అంటు వ్యాధులతో ఈ ప్రాంత ప్రజలు అల్లాడిపోతున్న కాలంలో.. ఒక వృద్ధుడు గ్రామంలో సంచరిస్తూ ఒక సలహా ఇచ్చాడు. ఒక రాయిని చూపించి, దానిపై బీజాక్షరాలు రాసి, ఇక నుంచి ఇది రాయి కాదు సంజీవరాయుడు అని చెప్పాడు. ఈ దేవుడికి పూజలు చేయాలి. అయితే మగవాళ్లు మాత్రమే పూజిస్తే అంతా బాగుంటుందని చెప్పాడు. ఆయన మాట ప్రకారం ఆ ఊరి మగవాళ్లు పూజలు చేశారు. వానలు కురిసి, పంటలు పండాయి. వ్యాధులు తగ్గాయి. అప్పటి నుంచి అదే ఆచారంగా మారింది.

ఎంఎస్ఎంఈల బలోపేతానికి 'సీడీపీ'

- రూ.200 కోట్లతో క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం: మంత్రి కొండపల్లి



అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లను అభివృద్ధిపరిచే లక్ష్యంతో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో 'ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఏపీ-సీడీపీ)'కు రూపకల్పన చేశామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంత్రివర్గం ఆమోదం పొందిన ఈ కార్యక్రమం ద్వారా రాబోయే ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 45 కామన్ ఫెసిలిటీ సెంటర్లు (సీఎఫ్‌సీ) స్థాపిస్తామన్నారు. ఈ కేంద్రాలు 1,840 ఎంఎస్ఎంఈ యూనిట్లకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తాయని.. తద్వారా 7,500 మందికిపైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'సీఎం ఉపాధి కల్పన కార్యక్రమం (సీఎంఈపీజీపీ)' ప్రారంభించేందుకు కూడా చంద్రబాబు ఆమోదం తెలిపారన్నారు. కాగా, రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ, స్వయం సహాయక సంఘాల్లో జీవనోపాధి వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా స్ట్రైవ్‌తో వ్యూహాత్మక చర్చలు జరిపినట్లు మంత్రి శ్రీనివాస్ తెలిపారు.

ఓపీ, ఐపీ సేవలపై నమ్మకం పెరిగింది

- వైద్య ఆరోగ్యశాఖపై సమీక్షలో మంత్రి సత్యకుమార్

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో పెరుగుతున్న ఓపీ, ఐపీ రోగుల సంఖ్య.. ప్రజారోగ్య వ్యవస్థ పట్ల ప్రజలకున్న నమ్మకాన్ని తెలియజేస్తోందని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ అన్నారు. అయినప్పటికీ పలు విషయాల్లో పరిస్థితి ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో 17 ప్రభుత్వాస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేటర్లతో శుక్రవారం వివిధ అంశాలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. డిసెంబరులో సేకరించిన ప్రజాభిప్రాయం మేరకు జీజీహెచ్‌ల్లో లభించే వైద్యసేవల పట్ల 60-70శాతం రోగులు సంతృప్తి వ్యక్తం చేశారని.. 30-40% ఉన్న ప్రతికూలతలను తొలగించడం సూపరింటెండెంట్ల బాధ్యత అని స్పష్టంచేశారు.

'అమరావతి'పై జగన్ కుట్ర: మంత్రి జనార్దన్‌రెడ్డి

బల్లికురవ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర రాజధాని అమరావతిపై జగన్ మరోమారు కుట్రలకు తెరలేపారు. రోజుకోరకంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు' అని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ప్రకాశం జిల్లా బల్లికురవ మండలంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. 'ఐదేళ్లు నిద్రపోయిన జగన్... ఇప్పుడు రాజధాని పనులు పరుగులు పెడుతుండటంతో ఓర్వలేకపోతున్నారు. మరో మూడేళ్లల్లో అభివృద్ధి పనులు పూర్తికావటం తథ్యం. ప్రజలకు వైసీపీ క్షమాపణ చెప్పాలి' అని జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

విధ్వంసం వైసీపీ సిద్ధాంతం...: మంత్రి ఆనం

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విధ్వంసం చేయడం వైసీపీ సిద్ధాంతమని, అరాచకం సృష్టించడం జగన్ విధానమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమ ప్రజల జీవితాలను నాశనం చేసిన జగన్, ఇప్పుడు సీమ ఉద్ధారకుడిలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 'తిరుమలలో ఖాళీ మద్యం సీసాలు పెట్టించారు. సింహాచలం ప్రసాదంలో నత్తలు ఉన్నాయని తప్పుడు వీడియోలు చేయించారు. రాజకీయాల కోసం ఇంత నీచానికి తెగబడతారా?' అని మంత్రి ఆనం నిలదీశారు.

జగన్ సీమ బిడ్డ కాదు.. క్యాన్సర్ గడ్డ: బీటెక్ రవి

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): 'రాయలసీమలో ఏ ప్రాజెక్టు చూసినా అది తెలుగుదేశం పార్టీ పుణ్యమే. సీమకు జగన్ చేసింది ఏమీ లేదు. ఆయన సీమ బిడ్డ కాదు... క్యాన్సర్ గడ్డ' అని టీడీపీ సీనియర్ నాయకుడు బీటెక్ రవి విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రాధామ్యాలు ఎంత చిత్రంగా ఉంటాయో చెప్పేందుకు రుషికొండ ప్యాలెస్, భోగాపురం ఎయిర్‌పోర్టు నిదర్శనమని ఎద్దేవా చేశారు.

తిరుమలలో 'సీసాల' కుట్రకు భూమన స్క్రిప్ట్: ఎంఎస్ రాజు

తిరుమలపై మద్యం సీసాలు వేసి వైసీపీ మూఠా అపవిత్రం చేసిందని టీటీడీ పాలకమండలి సభ్యుడు ఎంఎస్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం ప్రకారమే మద్యం బాటిళ్లు పెట్టి కుట్రకు తెరదీశారని, కరుణాకర్ రెడ్డి స్క్రిప్ట్ ప్రకారమే ఇదంతా జరిగిందని రాజు ఆరోపించారు.

విద్యార్థి సంఘాలను వైసీపీ రెచ్చగొడుతోంది: రవి నాయుడు

రాష్ట్రంలో విద్యార్థి సంఘాలను వైసీపీ రెచ్చగొట్టాలని చూస్తోందని శాప్ ఛైర్మన్ రవినాయుడు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆరోపించారు. వైసీపీ హయాంలో విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా బకాయిలు పెట్టిందని, విద్యార్థి సంఘాలు వైసీపీ ట్రాప్‌లో పడొద్దని రవి నాయుడు విజ్ఞప్తి చేశారు.

నటుడు నవదీప్‌పై డ్రగ్స్ కేసు కొట్టివేత

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు నవదీప్‌పై నమోదైన డ్రగ్స్ కేసును కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నవదీప్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించనప్పటికీ కేసు కొనసాగించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడం కిందకే వస్తుందని పేర్కొంది.

ప్రతి ఏటా పోలీస్ రిక్రూట్‌మెంట్

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం: హోంమంత్రి అనిత

నెల్లూరు (క్రైం), జనవరి 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు శాఖల్లో ఉద్యోగాల భర్తీ జరగలేదని... కూటమి ప్రభుత్వం రాగానే 6 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయడంతోపాటు స్టైపెండ్‌ను కూడా మూడింతలు పెంచామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. జాబ్ క్యాలెండర్ ఆధారంగా ప్రతి ఏడాది పోలీస్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తామని, అందులోనే జైళ్లు, అగ్నిమాపక శాఖల ఉద్యోగాలు కూడా భర్తీ చేస్తామని చెప్పారు. శుక్రవారం నెల్లూరుకు వచ్చిన ఆమె కేంద్ర కారాగారాన్ని తనిఖీ చేశారు. జైలులో ఖైదీలు తయారు చేస్తున్న వస్తువులు, వారికి అందిస్తున్న భోజనాలను పరిశీలించారు. జైలులో వసతుల కల్పనపై ఖైదీలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ సహించేది లేదని హెచ్చరించారు.

రాజాసాబ్ టికెట్ ధరల పెంపు మెమో కొట్టివేత

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజాసాబ్ సినిమా నిర్మాతలకు తెలంగాణ హైకోర్టులో నిరాశ ఎదురైంది. సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతినిస్తూ తెలంగాణ హోంశాఖ జారీచేసిన మెమోను కోర్టు కొట్టేసింది. ఆ సినిమా టికెట్ ధరల పెంపు మెమోను సవాలు చేస్తూ శుక్రవారం పలు లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం పై నిర్ణయం వెలువరించింది.

ఇక ఎవడూ కబ్జా చేయలేడు!

- మీ భూమి-మీ హక్కు: చంద్రబాబు
- బ్లాక్ చైన్ టెక్నాలజీతో పాస్ పుస్తకాలు
- ప్రతినెలా 9న నేనో గ్రామానికి వస్తా
- తూర్పుగోదావరి రాయవరంలో ప్రజావేదిక సభలో సీఎం వెల్లడి

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): 'ఇక మీ భూమిని ఎవడూ కబ్జా చేయలేడు. మీ భూమి-మీ హక్కు. అత్యాధునికమైన బ్లాక్ చైన్ టెక్నాలజీతో పాస్‌పుస్తకాలు రూపొందిస్తున్నాం. ఒక తప్పు కూడా లేకుండా మీకు అందిస్తాం' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం పరిధిలోని రాయవరంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 'మీ భూమి-మీహక్కు' ప్రజావేదిక సభలో సీఎం ప్రసంగించారు. 'తెలుగుదేశం కూటమి అధికారంలోకి రాకుంటే మీ భూములు గోవిందా.. గోవిందా అయ్యేవి.. అవునా? కాదా?.. అవునంటే చేతులు పైకెత్తండి..' అని ఆయన అనగానే సభలో అందరూ చేతులు పైకెత్తారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. 'ఇదీ ఆనాటి పరిస్థితి. ఇవాళ చరిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను. రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. ఇది పవిత్ర కార్యక్రమం. మనందరికీ భూమి అనేది ఒక అటాచ్‌మెంట్. మన తల్లిదండ్రులు, పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తోంది. ప్రాణంపోయినా ఒప్పుకుంటాడేమో కానీ రైతు భూమిని వదులుకోవడానికి ఇష్టపడడు. కరోనా సమయంలో అందరికీ హాలిడే.. రైతుకు మాత్రం లేదు. ఆ సమయంలో కూడా వ్యవసాయం చేసి అందరికీ అన్నంపెట్టిన రైతును మరచిపోకూడదు. అలాంటి భూమిని గత వైసీపీ ప్రభుత్వం, అప్పటి సీఎం జగన్.. సమస్యగా మార్చేశారు. అతలాకుతలం చేశారు' అని మండిపడ్డారు. ఇంకా ఏం చెప్పారంటే..



తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో జరిగిన సభలో పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులతో సీఎం చంద్రబాబు, ఎంపీ హరీశ్ మాధుర్, మంత్రులు నిమ్మల, అనగాని, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు

మీ భూములపై పెత్తనం చేయాలని..

సున్నితమైన సమస్యతో తలగోక్కుంటే మసైపోతారని నాటి సీఎంకు చెప్పాను. కానీ లెక్కపెట్టలేదు. అహంకారం కళ్లపైకెక్కింది. నీ తల్లో, తండ్రో, తాతముత్తాతలో ఇచ్చిన ఆస్తికి ఆయన ఫొటో వేసుకున్నాడు. మీ భూమి సరిహద్దుల్లో సర్వే రాళ్లు పెట్టి, వాటిపై తన బొమ్మ పెట్టుకున్నాడు. మరోపక్క మీభూమిని కంప్యూటరీకరించి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తెచ్చాడు. ఆ చట్టానికి అధిపతులుగా ప్రైవేటు వాళ్లను.. తన మనుషులను పెట్టుకున్నాడు. మీ భూమి-మీహక్కు.. వేరే వాళ్ల ఫొటో ఉండడానికి వీల్లేదని.. రాజముద్రతో మళ్లీ మీకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తానని నేనా రోజు హామీ ఇచ్చాను. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తానని చెప్పాను. రెండో సంతకం దానిపైనే పెట్టాను. వైసీపీ ప్రభుత్వం 22ఏ తీసుకొచ్చి.. మీ భూమిని ఏ రౌడీషీటర్ అడిగినా, రాజకీయ నాయకుడు అడిగినా ఇవ్వకపోతే దాన్ని నిషేధ జాబితాలోకి మార్చేసింది. ఇవాళ 6,680 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశాం. 4,784 గ్రామాల్లో పాసు పుస్తకాలు ముద్రించాం. 22.33 లక్షల పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. రాష్ట్రం మొత్తమ్మీద లక్షా 18 వేల పాసు పుస్తకాల్లో లోపాలున్నాయి. అవన్నీ సరిచేస్తున్నాం. సంవత్సరం కాలపరిమితి పెట్టుకున్నాను.. ప్రతినెలా 1న పింఛన్లు ఇవ్వాలి. 2 నుంచి 9 వరకూ పాసుపుస్తకాల పంపిణీ. ఒక తప్పు కూడా లేకుండా ఇవ్వాలి.

ఐదేళ్లకోసారి మార్చేద్దామనే ఆలోచన వద్దు

ఐదేళ్లకోసారి ప్రభుత్వాన్ని మార్చేద్దామని ఆలోచన మంచిదికాదు. సుస్థిర పాలనతోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఇక విద్యుత్ చార్జీలు పెరగవు. గత ప్రభుత్వ చార్జీలు పెంచేసి అనేక రకాలుగా ప్రజలను ఇబ్బంది పెట్టింది. వృథాగా పోయే నీటి కోసం తెలుగు రాష్ట్రాల మధ్య గొడవలు వద్దు.

ప్రభల తీర్థాలకు రాష్ట్ర గుర్తింపు

గోదావరి జిల్లాల్లో.. ముఖ్యంగా కోనసీమలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసే ప్రభల తీర్థాలకు రాష్ట్ర పండుగ గుర్తింపు ఇచ్చాం. జగన్నతోట ప్రభల శివుని రూపం. 470 ఏళ్లనాటి వారసత్వ ఆధ్యాత్మిక సాంస్కృతిక ఉద్యమానికి రక్షణ ఇవ్వనున్నాం. సంక్రాంతికి గోదావరి జిల్లాలో కోడిపందేలు గుర్తుకు వస్తాయి. జూదాలు వద్దు.. కానీ వారసత్వాన్ని పరిరక్షించుకోవడానికి కోడిపందాలు చూద్దాం. ప్రజలందరికీ ఒక విజ్ఞప్తి. చరిత్రలో ఒక నరకాసురుడిని వధిస్తే ఏటా దీపావళి చేసుకుంటున్నాం. ఇవాళ మళ్లీ నరకాసురుడి పాలన రాకూడదు. 'నా అదృష్టం. గోదావరి పుష్కరాలు మూడోసారి నిర్వహించే అవకాశం వచ్చింది. 2027 మార్చిలోపు పోలవరం పూర్తి చేసి ప్రజలకు అంకితం ఇస్తాం. సొంత బాబాయిని హత్య చేసి నామీదకు తోసినవాడి వ్యవహారం ఎలా ఉంటుందో తెలుసుకుని వైసీపీపట్ల అప్రమత్తంగా ఉన్నాను. దేగకన్ను వేశాను. వాళ్ల పాపాలు కడిగేస్తాం.

12న నారావారిపల్లికి సీఎం

తిరుపతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోమవారం తిరుపతి జిల్లాకు రానున్నారు. సూళ్లూరుపేటలో సోమవారం రాష్ట్రస్థాయి ఫ్లెమింగో ఫెస్టివల్ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరవుతారు. అనంతరం రోడ్డు మార్గాన స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లి చేరుకుంటారు. 13, 14, 15 తేదీల్లో సంక్రాంతికి ఎప్పటిలాగే కుటుంబసభ్యులతో గడుపుతారు. 14న స్వర్ణ నారావారిపల్లి ప్రాజెక్టులో భాగంగా అమలవుతున్న పలు కార్యక్రమాలను సమీక్షిస్తారు. 15న తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారు. అదే రోజు ఉండవల్లికి తిరుగు ప్రయాణమవుతారు.

తప్పులు తేల్చేస్తాం!

చంద్రబాబు పొలంబాట!

- రీసర్వే, సమస్యలపై ప్రత్యేక దృష్టి
- ఉన్నతాధికారులను పక్కనపెట్టి.. వీఆర్వో, సర్వేయర్లతో నడిచిన సీఎం
- రైతు పొలంలోకి వెళ్లి ప్రత్యక్ష పరిశీలన
- భిన్నంగా జరిగిన రాయవరం 'గ్రామసభ'

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ కార్యక్రమాల్లో.. ఇటు అధికారులు, అటు వేదిక మీదకు తీసుకొచ్చే వారికి పక్కాగా ట్రైనింగ్ ఇచ్చి తీసుకొస్తారు. 'అంతా బాగుంది' అనిపిస్తారు. జేజేలు కొట్టించుకుని వెళ్లిపోతారు! ఇది ఎప్పుడూ జరిగేదే! కానీ... రీసర్వేలో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భిన్నమైన పంథా అనుసరించారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాయవరం పర్యటనలో స్థానిక యంత్రాంగం చేసిన 'ఏర్పాట్లు' దాటి ముందుకు నడిచారు. ఉన్నతాధికారులు, మంత్రులను సైతం పక్కనపెట్టి నేరుగా పొలాల వద్దకు వెళ్లి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. రీసర్వేలో కష్టాలు, పట్టాదారు పుస్తకాల్లో తప్పులపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. అధికారులు మాత్రం ప్రభుత్వానికి 'అంతా బాగుంది' అనే నివేదికలు ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో తేడా ఉందని గ్రహించిన చంద్రబాబు తన సొంత వనరులు, ఇతర వర్గాల నుంచి సమాచారం తెప్పించుకున్నారు. రాయవరం పర్యటనలో అసలు విషయాన్ని నేరుగా రైతులు, సర్వేయర్ల నుంచే తెలుసుకునేందుకు పొలంబాట పట్టారు. అమరావతి నుంచి వచ్చిన రెవెన్యూ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి, సర్వే డైరెక్టర్ కూర్మనాథ్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మేఘ స్వరూప్, ఇతర ఉన్నతాధికారులను గ్రామ సభకే పరిమితం చేశారు. స్థానిక వీఆర్‌ఓ శైలజ, సర్వేయర్లు మాధురి, కళ్యాణిలతో కలిసి పొలంబాట పట్టారు. అక్కడ క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన తీరును పరిశీలించారు. సత్యసాయిబాబా అనే రైతు పొలం వద్దకు వెళ్లి 'గ్రామంలో రీసర్వే జరుగుతోంది కదా.. మీరు సంతోషంగా ఉన్నారా?' అని ప్రశ్నించారు. తాను సంతోషంగానే ఉన్నానని రైతు చెప్పారు. "భూములకు సంబంధించి కొన్ని ఇబ్బందులున్నాయి. రీసర్వే చేసి వివాదాలకు శాశ్వత పరిష్కారం ఇస్తాం. నీ భూమి ఎక్కడుంది? నీ పట్టా ఏది?" అని చంద్రబాబు ప్రశ్నించారు. రైతు తన భూమి వద్దకు బాబును తీసుకెళ్లి చూపించగా... "మీ దగ్గర ఉన్న రోవర్‌లో ఈ భూమిని ఎలా చూపిస్తారు? కోఆర్డినేట్స్‌లో చూపించగలరా?" అని సీఎం సిబ్బందిని ప్రశ్నించారు. వారు రోవర్‌లో చూపించిన పాయింట్‌కు వద్దకు వెళ్లేందుకు పంట కాలువ దాటారు. స్థానిక రైతులు 'వారధి'లా వేసిన పాత విద్యుత్ స్తంభంపైనే ముఖ్యమంత్రి నడిచారు. రోవర్స్ వినియోగం గురించి, రీ సర్వేలో ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై గ్రామస్థాయి అధికారులకు ఉన్న అవగాహనను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత వీఆర్‌ఓ లాగిన్‌ద్వారా రైతు సాయిబాబా డేటాను పరిశీలించారు. అనంతరం రైతుకు కొత్తగా రాజముద్రతో ముద్రించిన పాస్‌పుస్తకాన్ని పొలంలోనే అందించారు. అందులో అన్ని వివరాలు కరెక్టుగా ఉన్నాయా? అని సీఎం ఆరాతీశారు.



రాయవరంలో రైతు కంటిపూడి సాయిబాబా చెందిన పొలం వద్దకు పంట కాల్వను దాటుతూ వెళుతున్న సీఎం

విభిన్నంగా గ్రామసభ

పొలాలను పరిశీలించిన తర్వాత సీఎం చంద్రబాబు రైతులతో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. ఇక సీఎం నుంచి ఎలాంటి ప్రశ్నలు ఉండవని, నలుగురైదుగురు రైతులను వేదికమీదకు పిలిచి పాస్‌పుస్తకాలు ఇచ్చి, ఆ తర్వాత ప్రసంగించి వెళ్లిపోతారని అధికారులు అనుకున్నారు. కానీ అనూహ్యంగా చంద్రబాబు రైతుల నుంచే అనేక వివరాలు ఆరా తీశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకున్నవారు చేతులెత్తండి అంటే 15 మంది మాత్రమే స్పందించారు. దీంతో సీఎంకు అనుమానం వచ్చి... 'ఇంతేనా? అందరికీ ఇవ్వలేదా?' అని వీఆర్‌ఓ శైలజను సీఎం ప్రశ్నించారు. 'ఇస్తున్నాం సర్' అని ఆమె బదులిచ్చారు. తమకు ఇవ్వలేదని సభలో కూర్చున్న రైతులు గట్టిగా చెప్పారు. దీంతో జాయింట్ కలెక్టర్‌పై సీఎం ఆగ్రహించారు. ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. "మొత్తం పంచాయతీలో 2037 పాస్ పుస్తకాలు వచ్చాయి. అందులో 1873 కరెక్టుగా ఉన్నాయి. ఈ-కేవైసీ చేసి 900 మందికి ఇచ్చాం" అని జేసీ చెప్పారు. మరి ఆ 900 మంది ఇక్కడ లేరే అని సీఎం ప్రశ్నించారు. పాస్ పుస్తకాలు పొందిన వారు ఎంత మంది సభకు వచ్చారన్న వివరాలను అధికారులు స్పష్టంగా చెప్పలేకపోయారు. "ఈ-కేవైసీ తర్వాత రైతులను తీసుకొచ్చే బాధ్యత మీదే. ఒక సమస్యకు పరిష్కారం వచ్చినప్పుడు రైతులూ ఇక్కడ ఉండాలి. ఇది మీ లోపమా? వారి లోపమా? గ్రామసభలో రైతుల వివరాలు చదివి వినిపించి అన్నీ కరెక్టుగా ఉన్న తర్వాతే పుస్తకాలను రైతులకు ఇవ్వాలి. వాటిని రైతులు చూసి సంతృప్తి చెందితేనే మీరు పరీక్షలో పాస్ అయినట్లు. మీరు ఇలాంటివి చేస్తారని తెలిసే నేను ఇక్కడకు నేరుగా వచ్చా. రూపాయి అవినీతి లేకుండా, సమస్యలు లేకుండా, వారి భూమి వారి హక్కు. దాన్ని నెరవేర్చే బాధ్యత మీ అందరిది. ఇలాంటివి మరోసారి జరగకుండా చూసుకోండి" అని సీఎం స్పష్టం చేశారు.

తప్పులు చేస్తే సహించను

రాయవరంలో గ్రామసభ జరిగిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు కొద్దిసేపు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులతో మాట్లాడారు. సమావేశం ప్రారంభంలోనే అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "రీ సర్వేలో తప్పులెందుకు వస్తున్నాయి? ఇందుకు బాధ్యులెవరు? తప్పులకు కారణం ఏమిటి" అని అధికారులను సీఎం నిలదీశారు. రీ సర్వేను సరిగ్గానే చేస్తున్నామని, తప్పులు రావడం లేదని జేసీ నివేదించారు. మరి.. దేవరపల్లి మండలం కురుకూరులో రైతులు ఎందుకు ధర్నా చేశారని సీఎం ప్రశ్నించారు. రీ సర్వేలో భారీగా తప్పులు వస్తున్నాయని సీఎం స్పష్టంగా పేర్కొన్నారు. "భూసమస్యల శాశ్వత పరిష్కారానికి, రీ సర్వేకు ఎంతో ఖర్చుపెడుతున్నాం. తప్పులు జరిగితే అదంతా వృథా అవుతుంది. రైతుల సమ్మతి, సమక్షంలోనే కొలవండి. రైతుతో రీ సర్వే డేటాను సరిపోల్చుకోండి. గ్రామసభలో ఆ వివరాలను ఉంచి చర్చించండి" అని సీఎం ఆదేశించారు. మళ్లీ మళ్లీ రీసర్వేలో అవే తప్పులు వస్తే సహించనని తీవ్రంగా హెచ్చరించారు. జగన్ ప్రభుత్వంలో ఇలాంటి తప్పులే జరిగాయని గుర్తు చేశారు. రెవెన్యూ, సర్వే అధికారులు రీ సర్వే జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేయాలని సీఎం ఆదేశించారు.



హెలికాప్టర్ నుంచి కోనసీమ జిల్లా ఇరుసుమండ బ్లోఔట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

3 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ దగ్ధం!

- బ్లో ఔట్ బావి వద్ద శరవేగంగా శకలాల తొలగింపు
- ఘటనా ప్రాంతంలో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

అమలాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండలో ఐదు రోజుల క్రితం సంభవించిన బ్లోఔట్‌లో ఇప్పటి వరకూ 3 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిక్షేపాలు మంటల్లో దగ్ధమైనట్టు ఓఎన్జీసీ అధికారుల అంచనా వేశారు. ఓఎన్జీసీ మోరి-5 బావి వద్ద బ్లోఔట్ వల్ల ఏర్పడిన మంటలు శుక్రవారానికి తగ్గుముఖం పట్టడంతో ఓఎన్జీసీ సిబ్బంది వాటర్ అంబ్రెల్లాల ద్వారా నీటిని వెదజల్లుతూ దగ్గర వరకు వెళ్లి శకలాల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేశారు. నిపుణులైన ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఒకవైపు శకలాల తొలగిస్తూనే.. మరోవైపు బావిని మూసివేసేందుకు అవసరమైన పరికరాలను బ్లోఔట్ సైట్ వద్దకు తరలిస్తున్నారు. బ్లోఔట్ నియంత్రణకు మరో రెండు, మూడు రోజులు పట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు, మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు బ్లో ఔట్ ప్రాంతం వద్ద ఓఎన్జీసీ నిపుణులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా మంటలను అదుపు చేయాలని కోరారు.

ఏరియల్ సర్వే: కోనసీమ జిల్లా ఇరుసుమండలో సంభవించిన బ్లోఔట్ ప్రాంతాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాయవరం పర్యటనకు వెళ్తున్న సమయంలో బ్లోఔట్ ప్రదేశంలో మంటల తీవ్రతను ఆయన హెలికాప్టర్ నుంచే పరిశీలించారు. అనంతరం రాయవరం గ్రామంలో కోనసీమ జిల్లాకు చెందిన అధికారులతో బ్లోఔట్ పరిస్థితిపై ప్రత్యేకంగా సమీక్షించారు. అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి, కోనసీమ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తోపాటు ఓఎన్జీసీ అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. బ్లోఔట్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ మహేష్‌కుమార్ సీఎం చంద్రబాబుకు వివరించారు. స్పందించిన సీఎం... బ్లోఔట్ వల్ల పంటలకు సంభవించిన నష్టాన్ని అంచనా వేసి, బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

డబుల్ ఇంజన్ కాదు.. ఇది బుల్లెట్ సర్కారు

- జనవరి 9 పవిత్రమైన రోజు... మండపేట కార్యకర్తల భేటీలో సీఎం

రాయవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మనది డబుల్ ఇంజన్ సర్కారు కాదని.. బుల్లెట్ సర్కారు అని సీఎం చంద్రబాబు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం రాయవరంలో శుక్రవారం ఆ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జనవరి 9 పవిత్రమైన రోజు. చరిత్రలో సుపరిపాలనకు నాంది పలికిన రోజు. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ప్రమాణస్వీకారం చేసిన రోజు. అలాగే సుపరిపాలనలో భాగంగా ఇవాళ నేను రాయవరంలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించడం ఒక చరిత్ర. ఎన్నికల్లో గెలవడం.. కలిసి పనిచేయడం ముఖ్యం. అందుకే ఎన్నికల ముందు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిశాం. ఆ నిర్ణయం తీసుకున్న వెంటనే ఎన్నికలు ఏకపక్షమవుతాయన్న అభిప్రాయం వచ్చింది. నాడు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను బట్టి బీజేపీ అవసరం ఉంది.. ఆ పార్టీ ముందుకొస్తే ముగ్గురం కలిసి కూటమి పెట్టాం. అనునిత్యం పార్టీని కాపాడుకునే బాధ్యత కార్యకర్తలదే.. కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకునే బాధ్యత నాదే' అని హామీ ఇచ్చారు. సాధ్యం కాదన్న సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి చూపిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కువ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ చిరునామాగా మారిందని చెప్పారు. పార్టీలో అవసరం, అవకాశాలను బట్టి ఎవరిని ఎక్కడ ఉపయోగించుకోవాలో తనకు తెలుసన్నారు. టీడీపీకి భవిష్యత్‌లో అపజయమన్నదే లేకుండా ముందుకు తీసుకువెళ్లాలని.. మరో 15 ఏళ్లు అధికారంలో ఉండేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేస్తే 2047లో రాష్ట్రం ఎక్కడో ఉంటుందని.. ఈ ప్రక్రియలో భాగస్వాములై రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా అవకాశాలు అందిపుచ్చుకోవాలని శ్రేణులకు పిలుపిచ్చారు.







Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.